# ఉత్తరప్రదేశ్ జానపద కథలు

రచన:

**సౌభాగ్య**

ప్రచురణ :

సరోజా రాయ్ కమ్యూనికేషన్స్

నిశ్చింత్ టవర్స్, ఫ్లాట్ నెం. 306, అశోక్‌నగర్, హైదరాబాద్-500 020. ఫోన్స్: 040-27623320

# UTTARA PRADESH JANAPADA KATHALU


Written by :

**SOWBAGHYA**

Address :



First Edition : 2015

Rs. 80/-

Composed, Designed & Printed at :

**SAROJA ROY DTP & Graphics**,

HYDERABAD.

Printed at:

**AKRUTHI OFFSET PRINTERS**

1-1-191/A, Chikkadapally, Hyderabad - 500 020

Ph: 27664525, 66626475.



© Publisher



***Published by:***

**SAROJA ROY Communications**

**Nischit Towers, Flat No. 306, Ashok nagar,**

**Hyderabad - 500 020. Ph: 040-27623320.**

# రచయిత గురించి



సౌభాగ్య అసలు పేరు విజయకుమార్. సౌభాగ్య అన్నది అతని కలం పేరు. తెలుగు ఎం.ఎ. చేశారు. ఆబిడ్స్‌లోని గ్రామర్ స్కూల్లో టీచర్‌గా పనిచేసి ఇటీవలె రిటైరయ్యారు. గత నాలుగు దశాబ్దాలుగా సౌభాగ్య తెలుగు సాహిత్యంలోని వివిధ ప్రక్రియల్లో విశేష కృషి చేశారు.

సౌభాగ్య కవి, రచయిత, విమర్శకుడు, అనువాదకుడు. సంధ్యా బీభత్సం, కృత్యాద్యవస్థ, సింహావలోకనం, పునరుత్థానం, ప్రేమ కవితలు, యాభై దాటిన యవ్వనం సౌభాగ్య కవితా సంపుటాలు. సాహిత్య వ్యాసాలు, సమీక్షలు, వ్యాసాలు ద్వేషాలు సౌభాగ్య విమర్శ గ్రంథాలు.

ప్రసిద్ధ ఉర్దూ కవులు, ప్రాపర్టియస్ కవిత, ఆధునిక ప్రపంచకవులు, రెండు వందల ఏళ్ళ జాన్‌కీట్స్, ఇరవయ్యో శతాబ్దం ఇంగ్లీషు కవులు, ఈ కాలం కవులు, వజ్ర శకలాలు, మొదలయినవి ప్రపంచ సాహిత్య పరిచయ గ్రంథాలు. శిఖామణి, యాకూబ్, ఆశారాజు, కందుకూరి శ్రీరాములు, కె.ఎస్. రమణ తదితర కవులపై కవిత్వ పరామర్శ గ్రంథాలు రాశారు. ఆస్కార వైల్డ్ ఆలోచనలు, నిత్య జీవితంలో ధ్యానం, అద్భుతమైన కథలు, పాశ్చాత్య సంగీత కారుల జీవితాలు, తావో తరంగాలు వంటి వైవిధ్య తాత్విక రచనలు చేశారు. అక్బర్ బీర్బల్ కథలు, గ్రీకు రోమన్ కథలు, ఈసఫ్ కథలు, మంచి మంచి కథలు వంటి ఎన్నో పిల్లల కోసం కథా సంపుటాలు తెచ్చారు.

ప్రపంచ ప్రసిద్ధమయిన జోక్స్ రెండు సంపుటాలు తెచ్చారు.

సుప్రసిద్ధ మార్మికుడు ఓషో రచనల్ని తెలుగువాళ్ళకు పరిచయం చేసే పనిలో వున్నారు.

**- పబ్లిషర్**

# విషయ సూచిక


1. రైతు భార్య
2. పిచ్చుక – కాకి
3. విలువైన సలహాలు
4. ప్రాప్తం
5. నలుగురు గుడ్డివాళ్ళు
6. సావంత్ సాహసం
7. నలుగురు నమ్మకస్థులయిన స్నేహితులు
8. సూరజ్ మల్ స్వర్గ యాత్ర
9. తల్లి ప్రేమ
10. స్వర్గానికి ప్రయాణం
11. కనురెప్పల స్వేదం
12. దయగల చిట్టెలుక
13. తెలివితక్కువవాడు
14. మంత్రాల మంచం
15. తెలివయిన నక్క
16. తుఫాన్
17. కుండడు నెయ్యి
18. బ్రహ్మకన్వాల్
19. షేక్ చిల్లీ జీవనవిధానం
20. నలుగురు దేవకన్యలు
21. చిల్లీ అత్తగారింటి ప్రయాణం
22. వెయ్యి బళ్ళ తెలివి
23. మంచుకోతి
24. ఢిల్లీలో షేక్ చిల్లీ
25. కానా భాయ్
26. వెలుగు చిమ్మే రాణి
27. రాయి దాస
28. అదృష్టవంతురాలైన రాజకుమారి
29. మామ

# 1 రైతు భార్య

ముజ్‌ఫర్ నగర్ జిల్లాలో ఒక గ్రామంలో ఒక రైతువుండేవాడు. అతని భార్య అతన్ని చిత్రహింసలు పెట్టేది. పనీపాటాలేకుండా కూచుని భర్తని బాగా విసిగించేది. పొలం పని చేసి, వంటపని చేసి, పశువుల్ని మేపి అన్ని పనులూ రైతే చేసేవాడు.

రైతు ఏమయినా అంటే ఆమె వెంటనే ఏడుపు లంఘించుకునేది. దాంతో ఎదురింటివాళ్ళు, పక్కింటి వాళ్ళు వచ్చేవాళ్ళు, దాంతో పరువు బజార్న పడేది. అందుకని సాధ్యమయినంత వరకూ రైతు మౌనంగా వుండేవాడు. ఏదయినా పనివున్నపుడు ఆమె నాకు కడుపులో నొప్పి వుంది అని తప్పించుకునేది. తన భార్యకు ఎట్లాగయినా బుద్ధి చెప్పాలని రైతు ఒక రోజు పథకం వేశాడు. వుదయాన్నే ఆమెతో నాకు పక్క గ్రామంలో పని పడింది. లేచి నాలుగు చపాతీలు చేసి యియ్యవా? అని అడిగాడు ఆమె, అయ్యో! నాకు నడుమునొప్పిగా వుంది. నేను కదలలేను అంది. రైతు ఈ సంగతి ముందుగా వూహించి తానే చపాతీలు చేసి నాలుగు తను తీసుకుని యింకో నాలుగు భార్య కోసం పెట్టి మధ్యాహ్నం తిను, అన్నాడు. అబ్బే! నాకు ఆకలి లేదు తినలేను అంది. ఎప్పుడొస్తారు? అంది.

'రేపు సాయంత్రం వస్తాను' అన్నాడు రైతు త్వరగా రండి నాకు విసుగు పుడుతుంది. ఏమీతోచదు, అంది.

రైతు వెళ్ళినట్లే వెళ్ళి చాటుగా వచ్చి భార్య ప్రవర్తనను కనిపెట్టాడు. ఆమె భర్త అటు వెళుతూనే లేచి కూచుంది. వుత్సాహంగా పాట పాడుకుంటూ ముఖం కడిగి వెన్నతీసి కాచింది. అర చేతిమందం చపాతీలు రెండు చేసుకుంది. వాటి మీద నేయి చక్కెర వేసుకుని తిన్నది. భర్తచేసిన నాలుగు చపాతీలు కూడా తిన్నది.

భర్త యిదంతా గమనిస్తూనే వున్నాడు. తన భార్య బద్ధకస్థురాలే కానీ తనకు అవసరమయినవి చేసుకోడానికి బద్ధకం వుండదని, యితరులకు చెయ్యడానికి మాత్రం సోమరితనం అడ్డం వస్తుందని గ్రహించాడు.

ఆమె చపాతీలు తింటున్నపుడు భర్త తలుపు తట్టాడు 'ఎవరూ' అంది. 'నేనే' అన్నాడు భర్త. ఏమిటి అప్పుడే వచ్చేశారే, అంది త్వరగా చపాతీలు తింటూ తలుపు తెరువు

చెబుతాను అన్నాడు. తలుపు తెరిచింది. ఆమె వాలకం గమనించాడు. 'మనగ్రామం దాటగానే ఎదురుగా ఒక నాగుపాము వచ్చింది' 'అమ్మో నిజమా? అవును, పైగా అది అపశకునం, అందుకని ప్రయాణం వాయిదావేసుకుని వచ్చాను. 'ఆ పాము ఎలా వుంది' నువ్వు చేసిన చపాతీలంత మందంగా వుంది' భర్త తను చపాతీలు చేసిన విషయం గమనించాడని తెలుసు కుంది. 'బాగా విషం కలిగిందా! అవును నువ్వు కాచిన నెయ్యంత విషం కలిగింది, భర్త తన పనులన్నీ గమనించినట్లు గ్రహించింది. భయపడింది. రైతు ఒక బెత్తం తీసుకుని ఆమె వీపు వాయగొట్టాడు. గొల్లుమంది. శబ్దం బయటకు వస్తే చీరేస్తానన్నాడు. నోరు మూసుకుంది.

అది మొదలు ఆమె సోమరితనం మాయమయింది. కిక్కురుమనకుండా ఉదయాన్నే లేచి వంట చేసి భర్తతోపాటు పొలం వెళ్ళి సాయపడడం మొదలు పెట్టింది. తన భార్యలో పరివర్తన కలిగినందుకు రైతు సంతోషించాడు.

# 2 పిచ్చుక - కాకి

ఒక పిచ్చుక, కాకి స్నేహితులు. యిద్దరూ కలిసి పొలం కొన్నారు. పొలం దున్నాల్సిన సమయం వచ్చింది. పిచ్చుక చాలా చురుకైంది. కష్టజీవి కాకి బద్ధకస్తురాలు.

తెల్లవారుజామునే పిచ్చుక నిద్ర లేచి పొలానికి వెళదాం, పొలం దున్నుదాం, నువ్వు కూడా రెడీకా, బయల్దేరుదాం, అంది కాకితో.

'మిత్రమా! నువ్వెళ్ళు. మంచుపొగలు మాయమవుతేనే కొమ్మల మీద గంతులేస్తూ కాసేపు గడిపి నీ వెనకనే వచ్చేస్తాను వెళ్ళు, అంది.

పిచ్చుక ఒంటరిగా వెళ్ళి పొలమంతా దున్ని పంటవెయ్యడానికి సిద్ధం చేసింది. కాకి రానేలేదు.

మరుసటిరోజు కాకిని నిద్ర లేపి మనం వెళ్ళి చకచకపనులు పూర్తి చేసి మట్టి బెడ్డల్ని పొడిపొడి చేసి భూమిని అనుకూలంగా మారిస్తే రేపటి కల్లా ధాన్యాన్ని విత్తవచ్చు, అంది.

తప్పకుండా మిత్రమా! పొగమంచు వెళ్ళాకా కొమ్మలమీద ఎగురు కుంటూ వస్తా, నువ్వు వెళ్ళు అంది కాకి.

పిచ్చుక ఒకటే వెళ్ళింది. ఎదురుచూసింది కానీ కాకి జాడ లేదు తానే మట్టి బెడ్డల్ని పగలగొట్టి చదనుచేసింది. నీళ్ళతో తడిపింది. మరుసటిరోజు, మిత్రమా! పంట వేసే సమయం ధాన్యపు గింజల్ని నాటాలి, రేపు ఉదయాన్నే వెళదాం, అంది.

కాకి, తప్పకుండా. నువ్వు వెళ్ళు నీవెనకనే వస్తా, అంది. రాలేదు.

పిచ్చుక ఒకటే ధాన్యాన్ని పొలమంతా చల్లింది. కొన్నాళ్ళు గడిచాయి. పచ్చని మొలకలు పైపైకి వస్తే పిచ్చుక ఆనందించింది. ధాన్యంతో పొలం కళకళలాడింది.

పంటకోత సమయం వచ్చింది. 'మిత్రమా! పొలం పంటతో విరగగా చింది, వెళ్ళి పంటకొద్దాం బయలుదేరు అంది.

'ఎంత సేపు మిత్రమా! నీవెనకనే వస్తున్నా. నువ్వు మొదట వెళ్ళు, అంది కాకి వెళ్ళనేలేదు.

ఎప్పటిలాగే పంట కోతలు పిచ్చుకే చేసింది. మనుషుల్ని పెట్టి వడ్లు దంపించి బియ్యం వేరుగా, పొట్టువేరుగా చేసింది. కాకితో అంతా సిద్ధమయింది, పంపకాలు చేసుకుందాం రమ్మని కబురు పెట్టింది.

కాకి వచ్చి బియ్యం మీద వాలి, నాకు బియ్యం, నీకు పొట్టు అంది. పిచ్చుక వాదించలేదు. మౌనంగా భరించింది సరేనంది.

కాకి బియ్యంలో దూరి కడుపు నిండుగా బియ్యమెక్కింది. అంతలో పెద్దగా వర్షం కురిసింది. కాకి కడుపు బరువుతో ఎగరలేకపోయింది. బియ్యం నించీ బయటకు రాలేక పోయింది. నీళ్ళతో బరువెక్కిన బియ్యం కాకి మీదకు ఒరిగింది. కాకి వూపిరాడక చనిపోయింది.

తేలికపొట్టపై కూచున్న పిచ్చుక చినుకులు ఆరంభం కాగానే ఎగిరి చెట్టు కొమ్మపై వాలింది.

దురాశ నిండిన కాకి బతుకు అలా ముగిసింది.

# 3 విలువైన సలహాలు

బండా, అన్న పట్టణంలో సంపన్నుడయిన వ్యాపారి వుండేవాడు. అతనికి ఐదు మంది కొడుకులు. అతను బాగా లోభి. అతని లోభితనం వల్ల కుటుంబమంతా బాధ పడాల్సి వచ్చేది. సరయిన తిండి తినేవాడు కాదు, సరయిన బట్టకట్టేవాడు కాదు. యింట్లో ఎవర్నీ మంచిబట్టలు వెయ్యనిచ్చేవాడు కాదు, మంచి తిండి తిననిచ్చేవాడు కాదు. యింట్లో ఎవరయినీ అనారోగ్యం పాలయినా సరయిన వైద్య చికిత్స యిప్పించేవాడు కాదు, అతనికి ఏదీ యిష్టముండేది కాదు, డబ్బే అతనికి సర్వస్వం.

ఏమనుకున్నాడో ఏమో వ్యాపారి ఒకరోజు తన ఐదుగురు కొడుకుల్ని పిలిచి తలా ఒక వెయ్యి రూపాయలిచ్చి సొంతవ్యాపారాలు ప్రారంభించమన్నాడు.

అందరికన్నా చిన్నవాడు అజయ్‌కుమార్. తమ వూళ్ళో కాకుండా తన భవిష్యత్తును నగరంలో వెతుక్కుంటూ వెళ్ళాడు. ఆ నగరంలో తిరుగుతూ వుంటే దాహం వేసింది. ఒక బ్రాహ్మణుడి యింటి ముందు ఆగాడు ఆ బ్రాహ్మణుడు కాగితంలో ఏదో రాస్తున్నాడు. ఆ పని అయ్యేదాకా ఆగి దాహం తీర్చమన్నాడు. బ్రాహ్మణుడు అజయ్‌కుమార్‌కి దాహం తీర్చాడు నీళ్ళు తాగిన తరువాత జయ్, అయ్యా! మీరు కాగితంపై ఏదో శ్రద్ధగా రాస్తున్నారు. ఏమిటది?అని అడిగాడు.

బ్రాహ్మణుడు, అందులో నాలుగువాక్యాలు రాశాను. అవి చాలా విలువైన వాక్యాలు. ఒక్కో వాక్యం విలువ వెయ్యిరూపాయలు. కానీ నీకోసం ఆ నాలుగు వాక్యాల్ని కలిపి వెయ్యి రూపాయలకే యిస్తాను, అన్నాడు

అజయ్ బదులు చెప్పకుండా ఆ నాలుగు వాక్యాలు రాసిన కాగితం తీసుకున్నాడు.

అందులో మొదటి వాక్యం : ఒంటరిగా నడవకు,ప్రయాణించకు

రెండో వాక్యం : కూచునే ముందు పరుపును పరీక్షించు

మూడో వాక్యం : ప్రమాద పరిస్థితులో మేలుకునేవుండు

నాలుగో వాక్యం : స్నానం చేసేటప్పుడు ఏకాంత ప్రదేశంలో చేయి.

ఆ కాగితం తీసుకుని అజయ్ యింటికి వెళ్ళాడు తండ్రి, అబ్బాయీ! మీ అన్నలు సొంతవ్యాపారాలు ఆరంభించారు. నీ డబ్బుతో నువ్వు ఏం చేశావు! అని అడిగాడు.

అజయ్ నాన్నా! మీరిచ్చిన వేయిరూపాయలతో ఈ కాగితం కొన్నా, నన్నాడు. తండ్రి ఆగ్రహించి అజయ్ యింటో అడుగు పెడితే కాళ్ళు విరగ్గొడతానని యింట్లోంచీ గెంటేశాడు.

అజయ్ కొంత దూరం వెళ్ళే సరికి అతనికి ఒక ముంగీస కనిపించింది. కాగితంలో రాసిన మొదటి సలహా గుర్తొచ్చింది. తోడు లేకుండా ఒంటరిగా ప్రయాణించకు అన్నది. వెంటనే ఆ ముంగిసను పట్టుకుని తన కోటు జేబులో వేసుకుని బయల్దేరాడు. చాలాదూరం నడిచిన తరువాత అలసిపోయి ఒక చెట్టు కింద వున్న అరుగుమీద కూచున్నాడు. తెచ్చుకున్న అన్నం మూట విప్పి తిని ముంగిసను తన పక్కన పెట్టుకుని పడుకున్నాడు.

అజయ్ గాఢంగా నిద్రపోతున్నప్పుడు ఒక నాగుపాము అతన్ని కాటేయబోయింది. అప్పుడు ముంగీస దాని మీదకు దాడి చేసింది. రెండూ పోట్లాడుకుంటూ వుంటే అజయ్‌కి మెలకువ వచ్చింది. అతను కర్రతీసుకుని పామును చంపేశాడు. అప్పుడు తోడు లేకుండా ఒంటరిగా ప్రయాణించకూడదన్న మొదటి సలహా విలువ అతనికి తెలిసి వచ్చింది. తన ప్రాణాల్ని కాపాడిన ముంగిస పై కృతజ్ఞత కలిగింది.

అతను నడుస్తూ పోతూవుంటే చీకటి పడింది. దూరంగా మినుకు మెనుకుమని దీపం కనిపిస్తే దగ్గరికి వెళ్ళాడు. అదొక యిల్లు రాత్రికి యిక్కడ బసచేసి ఉదయం బయల్దేరదామనుకుని యింటి తలుపు తట్టాడు. వయసులో వున్న అందమైన అమ్మాయి తలుపు తీసింది. అజయ్ ఉదయం నించీ నడిచినడిచీ అలసిపోయాను. దయచేసి ఈ రాత్రికి విశ్రాంతి తీసుకోడానికి అనుమతిస్తారా? అని అడిగాడు. ఆ స్త్రీ ఎంత అందమైందో అంత మోసకారి కూడా. అతని దగ్గర ఏదో సంపద వున్నట్లు భావించి దాన్ని ఎట్లాగయినా దోచుకుందామను కుంది.

దాంతో ఆమె అతన్ని యింట్లోకి ఆహ్వానించి మంచి ఆహారం పెట్టింది. అతను భోంచేశాకా చాలా ఖరీదుగా వున్న అలంకరించిన పడక చూపింది.

అతను పడుకోబోతూ కాగితంలో రాసిన రెండో సలహా గుర్తుకు తెచ్చుకున్నాడు. కూర్చునే ముందు పడకను పరీక్షించు,

అతను పడకపై వున్న కవరు తొలిగించి చూసి భయపడిపోయాడు ఆ కవరు కింద లోపలి నించీ వాడిగా దూసుకు వచ్చిన కత్తులు వున్నాయి. అతను చూసుకోకుండా పడుకుని వుంటే క్షణంలో చనిపోయి వుండేవాడు. ఆ స్త్రీని ఆగ్రహంతో చూశాడు. ఆమె వణికి పోయింది. అజయ్! యిట్లా ఎంతమందిని చంపి దోచుకున్నావు? అన్నాడు ఆమె అజయ్ కాళ్ళ మీద పడి యిక యిట్లా చెయ్యను. దయచేసి నన్ను మన్నించు అని

వేడుకుంది. అజయ్, సరే! నిన్ను వదిలేస్తాను కానీ యిప్పటిదాకా నువ్వు దోచుకున్న సొమ్మునంతా తెచ్చివ్వు, అన్నాడు.

ఆమె ప్రాణభయంతో యింట్లోకి వెళ్ళి వెయ్యి రూపాయలు తెచ్చి యిచ్చింది. అజయ్ తను నాలుగుసలహాల కోసం బ్రాహ్మణునికి యిచ్చినడబ్బుతనకు తిరిగి వచ్చిందనుకున్నాడు.

బ్రాహ్మణుని సలహాతో సంతోషపడిన అజయ్ ముందుకుసాగి నగరంలో ప్రవేశించాడు. ఎక్కడయినా వుండడానికి నివాసం కోసం వెతుకుతూ ఒక వృద్ధురాలయిన వితంతువు యింటిదగ్గర ఆగాడు. ఆమె దానిదేముంది నాయనా! యిక్కడ వుండు. అన్నది కానీ బాలా దిగులుగా కనిపించింది. అజయ్, ఎందుకంత దిగులుగా వున్నారు అన్నాడు.

ఆమె, నాయనా! మా రాజకుమారిని ఒక రాక్షసుడు పాముురూపంలో వచ్చి బంధించి తీసుకెళ్ళాడు. ప్రతీరోజూ నగరం నించీ ఒకరు తనకు ఆహారమయిన పక్షంలో రాజకుమారికి ప్రమాదం కలిగించను, అని చెప్పాడు. ఈ రోజు నా కొడుకు వంతు, అందుకని బాధలో వున్నానంది. అజయ్ 'అమ్మా' మీరు దిగులు పడకండి. మీ కొడుకు స్థానంలో నేను వెళతాను, అన్నాడు. ఆమె ఎంతో సంతోషించి అజయ్‌కు కృతజ్ఞతలు తెలిపింది.

అజయ్ ఒక గదిలో దీపాలు బాగా వెలిగించాడు. ఖడ్గంతో అప్ర మత్తంగా వున్నాడు. ప్రమాద సమయంలో మేలు కొనివుండు అన్న మూడో సలహా గుర్తొచ్చింది. పాము పెద్ద ఆకారంలో గదిలోకి వచ్చింది. కానీ దీపాల కాంతి దాని కళ్ళలో పడి చూపు మసకబారింది. అదే అదనుగా అజయ్ పాముని ఖండఖండాలుగా నరికేశాడు. నగరానికి పీడ విరగడ అయింది. రాజు తన కూతుర్ని విడిపించి నందుకు ఎంతో సంతోషించాడు. అంతులేని సంపదను అజయ్‌కి యిచ్చాడు.

కావలసినంత సంపద సొంతమయ్యాక యిక యింటికి తిరుగు ముఖం పట్టాడు. తిరుగు ప్రయాణంలో చీకటయింది. ఒక నది దగ్గర ఆగాడు అక్కడే విశ్రాంతి తీసుకున్నాడు. ఒక డేరాలాంటిది కట్టాడు. తన సంపద నందులో పెట్టాడు. తెలతెలవారుతోంది. స్నానం చెయ్యాలనుకున్నాడు. తన సంపదని వదిలి, వెళ్ళాలంటే సందేహం వేసింది. డబ్బు, నగలు మూటకట్టి నెత్తిన పెట్టుకుని కాగితంలోని నాలుగో వాక్యం గుర్తు తెచ్చుకున్నాడు. స్నానం చేసి కొంత దూరం నడిచాకా తను స్నానం చేసిన దగ్గరే సంచిని మరచిపోయినట్లు గుర్తుకు వచ్చింది. పరిగెట్టుకుంటూ వెళ్ళే సరికి ఆ సంచి అక్కడే వుంది. ఏకాంత ప్రదేశం కాబట్టి ఎవరికంటా పడలేదు. బ్రాహ్మణుడి సలహాకు సంతోషించాడు.

తను సోదరులకన్నా ఎక్కువ ధనం సంపాదించానని తండ్రికి చూపించాడు. తండ్రి సంతోషించి కొడుకును ఆదరించాడు.

# 4 ప్రాప్తం

అల్మోరా జిల్లాలో పర్వతప్రాంత గ్రామంలో దయారాం మనీంద్ర అని యిద్దరు అన్నదమ్ములుండేవాళ్ళు. వాళ్ళ యిళ్లు పక్కన పక్కనే వుండేవి. వాళ్ళు ఎంతో అన్యోన్యంగా కలిసిమెలిసి వుండేవాళ్ళు.

దయారాం పెద్దవాడు పశువుల్ని మేపుతూ, పొలం పని చేస్తూ ఎప్పుడూ కష్టపడుతూ వుండేవాడు. పొలం పనులు లేనపుడుకూడా ఏదోపని కల్పించుకుని చేస్తూ వుండేవాడు.

మనీంద్ర బాగా బద్ధకస్తుడు. అవసరానికి మించి పనిచేసేవాడు కాదు. నిద్రపోవడం, ఎండలో చెట్టుకింద సోమరిగా కూచోవడంతోనే ఎక్కువ సమయం గడిపేవాడు. అతని భార్య, అట్లా సోమరిగా కాలం గడపకుంటే మీ అన్నగారిలాగా కష్టపడి పనిచేస్తే ఆదాయం పెరుగుతుందికదా! అంది. దానికి మనీంద్రుడు, రోజంతా ఎందుకు నన్ను ఆడిపోసుకుంటావు? సంపద, ఐశ్వర్యం, లాభనష్టాలు, చావుపుట్టుకులు, మంచి చెడ్డలు అన్నీ దేవుని మీద ఆధారపడివున్నాయి. ఒక వేళ దేవుడే తలచుకుంటే మనయింటి రూఫ్‌కు వున్న పెంకులు తీసి కావలసినంత ధనం యిస్తాడు అన్నాడు.

అతని భార్య, ఎవరయితే కష్టపడతారో వాళ్ళకే దేవుడు సాయపడతాడని నమ్మేది. భర్తతో 'దేవుడికి వేరే పనీపాటా లేదా? యింటిపై పెంకులు తీసి కుండల్తో బంగారు నాణేల్ని కుమ్మరించడానికి'? అంది. బదులివ్వకుండా మనీంద్ర తన హుక్కా పీల్చాడు.

ఒక రోజు మనీంద్ర భార్య అడవిలోకి పశువుల్ని తోలుకెళ్ళింది. ఒక దగ్గర గడ్డి చదరంగా కోసినట్లున్న స్థలం చూసింది. అక్కడ కూచుని తన కొడవలి అంచుతో అక్కడ తవ్వింది. ఒక పెద్ద యిత్తడి కూజా బంగారు నాణేలతో వున్నది బయటపడింది. ఆశ్చర్యపోయి యిటూ అటూ చూసి ఎవరూ లేరని తెలుసుకుని దగ్గరున్న ఆకులు తీసి దానిపై కప్పి వెంటనే పరిగెత్తుకుంటూ యింటికి వెళ్ళి భర్తతో విషయం చెప్పి, ఆ కూజా చాలా బరువుగా వుంది. నేనొక్కదాన్నే మోయ లేను. రండి. యిద్దరం కలిసి మోసుకొద్దాం అంది.

దానికి మనీంద్రుడు ఆవేశపడకుండా, తాపీగా నేనొచ్చి దొంగలా భయ పడుతూ

ఆ కూజాను మోయను. అది నిజంగా మనకు  చెందాల్సి వస్తే అది మనయింటికే పంపుతాడు అన్నాడు. భార్య ఎంతగా ఒప్పించాలని చూసినా మనీంద్రుడు వినలేదు.

ఈ ఛాదస్తం మొగుడితో చెప్పి లాభం లేదని తనతోడికోడలైన దయారాం భార్య దగ్గరికి వెళ్ళి విషయం చెప్పి, అక్కా! మనం వెళ్ళి దాన్ని తెచ్చుకుని సగం సగం పంచుకుందాం అంది. దయారాం భార్య తెలివైంది చురుకయింది. చెల్లితో ఇప్పుడు చీకటి పడింది. దొంగలు, పురుగూ పుట్రా భయముంటుంది. పొద్దున్నే వెళదాం అంది. మనీంద్రుని భార్య సరేనంది.

మనీంద్రుని భార్య యింటికి వెళ్ళి పడుకుందని నిర్ధారించుకున్నాకా దయారాం భార్య భర్తతో విషయం వివరించి మనం అక్కడికి వెళ్ళి రహస్యంగా కూజాలోని బంగారు నాణేల్ని తెచ్చుకుందామంది. భర్త సరేనన్నాడు.

ఇద్దరూ కలిసి చీకటిలో వెళ్ళి ఆ కూజాను తీసి మోసుకుంటూ బయ ల్దేరారు. సగం దారి వచ్చే సరికి కూజాలో కాపురమున్న తేనెటీగలు ఒక్కసారిగా లేచి యిద్దరీ తెగకుట్టాయి. దాంతో దయారాం, నీ చెల్లెలు నీ మీద పగతో కుట్ర పన్ని యిట్లా తేనెటీగల కూజాని బంగారు నాణేల కూజాగా మోసగించిందని ఒక గుడ్డ తీసి కూజాకు మూతగా కట్టి, యిప్పుడు నీ చెల్లిమీద ప్రతీకారం తీర్చుకో. మనల్ని తేనెటీగలతో కుట్టించిన కుట్రకు ప్రతిగా వాళ్ళను తెగకుట్టేలా చేద్దాం, అని యిద్దరూ కూజాను తలకిందులుగా పెట్టేసరికి పెద్దశబ్దంతో బంగారు నాణేలు తమ్ముడి యింట్లో  పడ్డాయి. శబ్దానికి భయపడి త్వరగా దయారాం, భార్యా జారుకున్నారు.

అలకిడికి లేచిన మనీంద్రుడు భార్యను లేపి యిల్లంతా చిందరవందరగా పడివున్న బంగారు నాణేల్ని చూపి, దేవుడు దయదలిస్తే మన యింటి పై కప్పు నించే బంగారు వర్షం కురిపిస్తాడని నేను చెప్పాను కదా! మనకు ఎంత ప్రాప్తమో అంత దేవుడు మనకిచ్చాడు అన్నాడు. మనీంద్రుని భార్య ఆవురావురుమని బంగారు నాణేల్ని ఏరి కుప్పవేసి భద్రపరించింది.

మనీంద్రుడు తులసీదాసు మాటలు విన్నావా? ఆయన, సముద్రానికి ఎట్లాంటి కోరికా లేకున్నా నది సముద్రం  కేసి సాగుతుంది. అట్లాగే ధార్మికుడికి కాంక్ష లేకున్నా సంతోషం, సంపద  అతన్ని సమీపిస్తాయి అన్నాడు అని చెప్పాడు.

# 5 నలుగురు గుడ్డివాళ్ళు

పూర్వం ఉత్తరప్రదేశ్‌లో ఒక వివేకవంతుడయిన రాజు వుండేవాడు. ఆయన జాలి, దయ కలిగిన ప్రభువు. ప్రజల బాగోగులు చూసేవాడు ఒక రోజు రాజు వేటకు వెళ్ళి తిరిగి వస్తూవుంటే రాజుకు నలుగురు గుడ్డివాళ్ళు ఎదురయ్యారు. వాళ్ళు గుర్రపు డెక్కల శబ్దం విని రాజును గుర్తించి తమ ఆకలి తీర్చమని  అభ్యర్థించారు.

రాజు వాళ్ళని తనతో బాటు నగరానికి తీసుకొచ్చి ఒక స్వీట్‌షాపులో రుచికరమయిన తినుబండారాలు కొన్నాడు. కొంటున్నపుడు ఆ షాపు ఓనరు తూకం తప్పుడు వేస్తున్నట్లు గమనించి  హెచ్చరించారు.

తినుబండారాలు గుడ్డివాళ్ళకు పెట్టాడు. వాళ్ళు తిని రాజుకు కృతజ్ఞతలు చెప్పారు. రాజు సెలవు తీసుకుపోయేంతలో వాళ్లు రాజా! మమ్మల్ని మీ ఆస్థానంలో పెట్టుకోండి. మేము వుపయోగపడతాము అన్నారు.

రాజు, మీకు కళ్ళు కనిపించవు కదా!మీరెలా నాకు ఉపయోగపడతారు? అని అడిగాడు. దానికి వాళ్ళు, మాలో ఒకడు అసలయిన ముత్యమేదో, నకిలీ ముత్యమేదో గుర్తించగలడు. రెండోవాడు జాతిగుర్రమేదో మామూలు గుర్రమేదో గుర్తు పట్టగలడు. మూడోవాడు ఒక స్త్రీ గుణవంతురాలా కాదా! చెప్పగలడు. నాలుగోవ్యక్తి ఒక మనిషి విశ్వాస పాత్రుడా, మోసగాడా! చెప్పగలడు, అన్నాడు.

రాజుకు నమ్మబుద్ధి వెయ్యలేదు. ఐనా సరే! మొదట వీటికి సంబంధించి మీకు పరీక్ష పెడతాను. వీటిల్లో మీరు నెగ్గితే మిమ్మల్ని నా ఆస్థానంలో నియమించుకుంటాను అన్నాడు.

గుడ్డివాళ్ళు మీ యిష్టం మహారాజా! అన్నారు. రాజు తన సభను సమావేశపరిచి గుడ్డివాళ్ళను పిలిపించాడు. ముందుగా వేసుకున్న ప్రణాళిక ప్రకారం రాజు వజ్రాల వ్యాపారిని పిలిపించాడు. వ్యాపారి అసలయినవి, నకిలీవి ముత్యాలు కలిపి ముందుంచాడు. మొదటి గుడ్డివాడు, చేతుల్తో ముత్యాలు తడిమిచూసి అసలయిన ముత్యాల్ని వేరుగా, నకిలీముత్యాల్ని వేరుగా చేసి చూపించాడు. రాజు ఆశ్చర్యపోయి, అభినందించి అతన్ని

తనమంత్రుల్లో ఒకడుగా నియమించాడు.

రాజు తనకు నచ్చిన గుర్రాన్ని రెండో గుడ్డివాడి ముందుంచాడు. గుడ్డివాడు గుర్రాన్ని తడిమిచూసి, ఇది నాసిరకం గుర్రం, మిమ్మల్ని ఎవడో మోసంచేసి దీన్ని జాతి గుర్రమని మీకు అంటగట్టాడు అన్నాడు. రాజు ఆగ్రహించి గుర్రాన్ని కొన్నవాణ్ణి పిలిపించాడు. అసలయిన జాతిగుర్రం స్థానంలో మామూలు గుర్రాన్ని మార్చినవైనం బయటపడింది. రాజు అతన్ని వుద్యోగం నించీ తొలగించి రెండోగుడ్డివాణ్ణి తన మంత్రివర్గంలోకి తీసుకున్నాడు.

మంచి స్త్రీకి, చెడ్డస్త్రీకి మధ్య అంతరమెలా గుర్తిస్తాడో మూడో గుడ్డివాడు! అని రాజుకు ఉత్సుకతకలిగింది. గుడ్డివాడు అంతఃపురంలోని ప్రధాన చెలికత్తెను పిలిపించండి అన్నాడు. వున్నఫళంగా ఆమెను హాజరు పరిచారు. గుడ్డివాడు ఆమె వీపు తడిమి, రాజా! వజ్రాల నగల్ని దొంగలించి యీమె బయటికి చేరవే స్తోంది అన్నాడు. రాజు మనుషుల్ని పంపి వెతికిస్తే నిజమేనని తేలింది. ఆమెకు దేశబహిష్కార శిక్ష విధించి మూడో గుడ్డివాణ్ణి మంత్రి వర్గంలో చేర్చుకున్నాడు.

నాలుగో గుడ్డివాడు, రాజా! నేను నిజం నిరూపిస్తే నన్ను ముఖ్యమంత్రిని చేస్తారా? అన్నాడు. అక్కడే వున్న ముఖ్యమంత్రి, నువ్వు మరీ హద్దు మీరు తున్నావన్నాడు ఆగ్రహంగా గుడ్డివాడు ముఖ్యమంత్రి శరీరాన్ని తడిమి, రాజా! ముఖ్యమంత్రి దుర్మార్గుడు మంచి వాడయితే యితని జేబులో విషం సీసావుంది. రాత్రికి మీ మధువులో కలపాలని కుట్రపన్నాడు. కావాలంటే యితని వస్త్రాల్లో వెతికించండి అన్నాడు. రాజాజ్ఞతో భటులు వెతికారు. విషపు సీసా బయటపడింది. ముఖ్యమంత్రి కుట్ర బహిర్గతమయింది.

గుడ్డివాడు, రాజా! విశ్వాసంతో నటించే నక్క యితను. మిమ్మల్ని చంపి రాజ్యాన్ని పాలించాలని కుట్రపన్నాడు.

రాజు ముఖ్యమంత్రికి జీవిత ఖైదు విధించి నాలుగో గుడ్డివాణ్ణి ముఖ్యమంత్రిని చేసి, నన్ను ప్రాణాపాయం నించి కాపాడావు. నీరుణం తీర్చు కోలేను అన్నాడు.

నలుగురు గుడ్డి వాళ్ళ సాయంతో రాజు రాజ్యాన్ని చల్లగా పాలించాడు.

# 6 సావంత్ సాహసం

మొగలు సామ్రాజ్యం బలహీన పడిన తరువాత చిన్నచిన్న రాజ్యాలు ఎవరికి వారుగా పరిపాలించుకోవడం ప్రారంభించారు.

బారా, అన్న పట్టణంలో సావంత్ అన్న యువకుడు వుండేవాడు. అతనికి దేవుడంటే భయభక్తులుండేవి. కానీ యవ్వనంలో వుండడం వల్ల చిన్నవిషయాలకే ద్రేకపడి, ఆవేశానికి లోనయ్యేవాడు. అతను ఎత్తుగావుండేవాడు. పొడవాటి చేతులు. ఉద్యోగాన్వేషణలో ఢిల్లీ వెళ్ళాడు. ఢిల్లీలో ప్రసిద్ధి చెందిన చాందినీ చౌక్ గుండా వెళుతూ వుంటే ఆ దారంటా ఎదురయిన యింకో యువకుడు. ఎవరు నువ్వు, ఎక్కడి నుంచీవచ్చావు? అని అడిగాడు. సావంత్ రొమ్ము విరుచుకుని 'నేను బారా' నించీ వచ్చాను అన్నాడు గర్వంగా. ఆ యువకుడు నిర్లక్ష్యంగా 'నువ్వు బారా నించీ వస్తే నేను తేరా నించీ వచ్చాను' అన్నాడు ఎగతాళిగా అన్న ఆ మాటల్తో ఆగ్రహించిన యువకుడు కత్తి దూసి అతని కాలు నరికాడు.

రాజ భటులు సావంత్‌ని బంధించి రాజు ముందు హాజరుపరిచారు. ఎందుకలా చేశావన్నాడు. తను జన్మించిన స్థలాన్ని కించపరిస్తే తను సహించ లేకపోయానన్నాడు. సావంత్ రాజుకు కూడా జన్మభూమి పట్ల మమకారం వుండడంతో సావంత్‌ని శిక్షించడానికి బదులు పన్ను వసూలు చేసే అధికారిగా నియమించాడు. ఆ రకంగా ఆ వుద్యోగంలో చేరి చాలా రోజులు పనిచేశాడు.

కొన్నాళ్ళకి మంత్రి రాజుతో, రాజుగారూ! షాద్‌జా అన్న గ్రామంలో మనకు చాలా కాలంగా పన్నులు సక్రమంగా వసూలు కావడం లేదు. అక్కడికి వెళ్ళిన అధికారులు ఎన్నో కష్టనష్టాలకు గురవుతున్నారు. అక్కడి పరిస్థితులు చక్కబరచడానికి సావంత్ లాంటి సమర్థుడయిన అధికారి మాత్రమే సరయినవాడు. అతన్ని ఆ గ్రామానికి పంపుదాం, అన్నాడు.

రాజు అనుమతించాడు. సావంత్‌ని ఆదేశించాడు. కష్ట సాధ్యమయిన బాధ్యతని నెత్తిన వేసుకుని సావంత్ ఆ గ్రామానికి బయల్దేరాడు.

అతను ఆ గ్రామం చేరకముందే పన్ను వసూలు చేసే అధికారి వస్తున్నట్లు జనాలకు తెలిసింది. వాళ్ళు గ్రామం ముందు ఒక మర్రి చెట్టువుంది. ఆ మర్రిచెట్టు కింద ఒక

గుడారం వేసి అతిథికి మర్యాదలు చేసేవాళ్ళు. అధికారి అక్కడి నుండే పన్ను వసూలు చేసేవాడు. ఐతే ఆ మర్రి చెట్టులో ఒక దయ్యం వుంది. అది పన్ను వసూలు చేసే అధికారిని చంపుతుందని, లేదా భయపెడుతుందని ఆ గ్రామస్తుల నమ్మకం. అందుకనే చాలా మంది అధికారులు తిరిగి యింటికి చేరలేదు.

సావంత్ దైవభక్తితో నిద్రపోకుండా ప్రార్థనచేసుకుంటూ వున్నపుడు మర్రి చెట్టులో దయ్యం దిగి గుడారంలోకి వచ్చింది. సావంత్ దైవనామస్మరణ చేస్తూ వుండడం వల్ల అతన్ని ఏమీ చెయ్యలేక నిస్సహాయంగా తిరిగి వెళ్ళిపోయింది.

ఉదయాన్నే గ్రామజనం సజీవంగా వున్న సావంత్‌ని చూసి విస్తుపో యారు. దయ్యం అతనికి జడుసుకుందనుకున్నారు. బలమైన అతని శరీరం చూసి భయపడి గ్రామస్తులు చెల్లించాల్సిన పన్నుల్ని బకాయిలు లేకుండా కట్టారు.

వసూలు చేసిన సొమ్ముతో ఆస్థానానికి తిరిగి వచ్చి రాజుగారికి డబ్బు చెల్లించాడు.

రాజు అతని సాహసానికి సంతోషించి, నీకు ఏంకావాలో కోరుకో, నీ కోరిక తీరుస్తా అన్నాడు.

సావంత్ రాజా! అక్కడ గ్రామం ముందు వున్న మర్రి చెట్టు కొట్టించి ఆ కలపతో నేను యింటి తలుపులు, బీరువాలు చేసుకోవడానికి అనుమతించండి, అన్నాడు రాజు సావంత్ కోరికను మన్నించాడు.

# 7 నలుగురు నమ్మకస్థులయిన స్నేహితులు

పూర్వం ఒకప్పుడు నలుగురు స్నేహితులుండేవాళ్ళు. వాళ్ళు నలుగురూ ఒక యింట్లో కలిసివుండేవాళ్ళు. వాళ్ళతో బాటు ఒక కుక్కవుండేది. వాళ్ళు ఒక సందర్భంలో ప్రమాణం చేసుకున్నారు. అదేమిటంటే వాళ్ళు నలుగురూ బతికితే నలుగురం కలిసి బతుకుదాం, చనిపోతే నలుగురం కలిసి చనిపోదాం, అని నిర్ణయించుకున్నారు.

కొన్నాళ్ళు హాయిగా గడిచింది. ఒకరోజు నలుగురూ ఎక్కడికో వెళుతున్నారు. ఒక మిత్రుడికి దాహం వేసింది. దగ్గరలో వున్న ఒక బావిలో దిగి మిత్రుడు నీళ్ళు తాగి పైకి వచ్చాడు. పైకి వచ్చిన వెంటనే అతను మూర్ఛకు లోనయి, అతని నోటి వెంట నురగలు వచ్చాయి. కిందపడి పోయాడు. అందరూ చూస్తూ వుండగానే చనిపోయాడు.

ముగ్గురు మిత్రులూ బాధతో ఆకాశంవేపు చూసి, దేవుడా! మాస్నేహం నిజమైందయితే మమ్మల్ని వెళ్ళిపోయిన మా మిత్రునితో బాటు వెళ్ళనీ, మేము అతన్ని కలిసేలా చేయి. ఎందుకుంటే అతను లేనిదే మా బతుకు అర్థం లేనిది. అన్నారు.

ఆ మాటలు ఆకాశంలో ప్రతిధ్వనించాయి. మరక్షణమే భూమి చీలింది. నలుగురు మిత్రులు కుక్కతో సహా భూమిలోకి వెళ్ళిపోయారు. మళ్ళీ భూమి మామూలు స్థితిలోకి వచ్చింది. అంతా మామూలుగా మారింది.

కొన్నాళ్ళు గడిచాయి. ఒక నవాబు ఏనుగు మీద ఆ దారంటా వచ్చాడు. ఎక్కడయితే భూమి చీలిందో, ఎక్కడయితే మిత్రులు భూమిలోపలికి వెళ్ళారో అక్కడికి వచ్చి ఏనుగు భీకరిస్తూ అక్కడి నుండీ కదలడానికి మొరాయించింది. మావటివాడు ఎంత ప్రయత్నించినా ప్రయోజనం లేకపోయింది. గత్యంతరం లేక నవాబు కిందకు దిగి ఆకాశంలోకి చూశాడు.

అప్పుడు ఆకాశం నించీ ఆకాశవాణి మాటలు వినిపించాయి. గౌరవనీయ వంశానికి చెందిన వాడా! యిక్కడ నువ్వు నిల్చున్న స్థలంలో భూమిలోకి వెళ్ళిపోయారు. వాళ్ళతోబాటు ఒక కుక్క కూడా వెళ్ళిపోయింది. నువ్వు ఆ ఐదు మందికోసం ఐదు సమాధులు నిర్మిస్తే అక్కడినుండి ఏనుగు కదుల్తుంది. లేకుంటే అది అక్కడి నుండీ కదలదు, అన్న మాటలు నవాబు విన్నాడు.

వెంటనే మనుషుల్ని, పెట్టి ఐదు సమాధులు నిర్మించాడు. కానీ నిర్మించిన మరుక్షణం ఏవో దుష్టశక్తులు రాత్రికి రాత్రే వాటిని నాశనం చేశాయి.

నవాబు నిస్సహాయంగా ఆకాశంలోకి చూశాడు. అప్పుడు ఆకాశవాణి, ఆ సమాధులు దుష్టశక్తుల బారిన పడకుండా వుండాలంటే నువ్వు స్వహస్తాలతో ఆ సమాధుల్ని నిర్మించాలి అంది.

వెంటనే నవాబు స్వహస్తాలతో సమాధుల్ని నిర్మించాడు.

అవి ఐదు సమాధులు పక్కన పక్కనే వుండేవి. ఐదోది చిన్నది. అవన్నీ యిప్పటికీ, బులందర్‌షహర్ పట్టణంలో వున్నాయి. ఆ సమాధుల్ని యిప్పటికీ, నలుగురు మిత్రుల సమాధులు అంటారు. స్నేహానికి కట్టుబడాలనుకున్న మిత్రులు ఆ సమాధుల దగ్గరికి వెళ్ళి ప్రమాణం చేస్తారు.

# 8 సూరజ్ మల్ స్వర్గ యాత్ర

బారాబంకీ జిల్లాల్ని పాలించే రాజు దగ్గర అజిత్‌సింగ్ అన్న మంత్రి వుండేవాడు. అతను ఎంతో వివేకవంతుడు, సత్పురుషుడు, రాజుకు అతనంటే ఎంతో యిష్టం. ప్రతివిషయానికీ రాజు అతని సహాయం సలహా తీసుకునేవాడు. యిదంతా చూసి తక్కిన మంత్రులు, యితర వుద్యోగులు అజిత్‌సింగ్ పట్ల ద్వేషం పెంచుకున్నారు. వీళ్ళందరికీ నాయకుడు సూరజ్‌మల్. అతను ఒకరోజు రాజు దగ్గరికి వెళ్ళి 'రాజుగారూ! మీకు తెలీదుకానీ నిన్న అజిత్‌సింగ్, ఏమన్నాడంటే మనరాజ్యంలో అందరికంటే తన గొప్పవాణ్ణని, తెలివైనవాణ్ణని గొప్పలు చెప్పుకుంటున్నాడు. దానికి మీరు కూడా మినహాయింపు కాదని అతిశయాలు పోతున్నాడు అహంకరిస్తున్నాడు, అన్నారు.

రాజు అంతా విని, అయితే ఏం చేద్దాం !అన్నాడు. సూరజ్ మల్లు, రాజా! అతని పొగరు తగ్గించాలంటే మనం అతను చేయలేని పనిని, అతనికి అసాధ్యమయిన పనిని ఒప్పగించాలి, ఒక గది నిండుగా దూది నింపి ఉదయం కల్లా దానిని దారంగా మార్చాలని చెప్పండి, అన్నారు.

రాజు అజిత్‌సింగ్ ను పిల్చి ఈ గదిలో దూదివుంది. వుదయం కల్లా అదంతా దారంగా మార్చాలి. లేకుంటే నీ మెడ మీద నీ తలవుండదు, అని ఆదేశించాడు.

మాటాపలుకూ లేకుండా మానాదితో అజిత్‌సింగ్ యింటికి తిరిగి వచ్చాడు. రాత్రంతా నిద్రపోకుండా మధన పడ్డాడు, తన శత్రువర్గం తన మీద పన్నిన కుట్ర అని భావించాడు. ఐనా చేయగలిగింది లేదు, మరణమే తనకు శరణ్యమని ఆత్మహత్య చేసుకోడానికి అరణ్యంలోకి వెళ్ళాడు. అరణ్యం దగ్గర్లో ఒక నది ప్రవహిస్తు వుంటుంది. దాంట్లో దూకి చనిపోదామని నిర్ణయించుకున్నాడు.

దారిలో ఒక సన్యాసి ధ్యానంలో వున్నాడు. అజిత్‌సింగ్ ఆ సన్యాసి పాదాలకు నమస్కరించాడు ఆ సన్యాసి మంత్రి ముఖకవళికల్ని బట్టి అతని ఆంతర్యాన్ని, ప్రయాణ కారణాన్ని గ్రహించి, నాయనా! మనిషి జీవితమన్నది గొప్పవరం, మన మనసుకు వ్యతిరేకంగా ఆ జీవితాన్ని అంతం చెయ్యడం అర్థరహితమైన పని. నీ కష్టాల్ని అధిగమించడానికి నీకు నేను సహాయ పడతాను. కాబట్టి రాజు కోరిక ప్రకారం ఆయన

చెప్పినట్లు చేయి, అన్నాడు.

సన్యాసి అజిత్ సంగ్‌కి ఒక విచిత్రమైన రాట్నాన్ని ఒక పారను, కొడవలిని యిచ్చి ఆశీర్వదించి పంపాడు.

అజిత్‌సింగ్ ఆ వింతరాట్నాన్ని తీసుకుని రాజభవనానికి వెళ్ళాడు. ఆ గదిలోకి వెళ్ళి తలుపువేసుకున్నాడు. వింతరాట్నం విచిత్రంగా యాంత్రికంగా తిరుగుతూ గదిలోకి దూదినంతా దారపు వుండలుగా మార్చేసింది. రాజు, సూరజ్ మల్లు దాదాపు వుండల్ని చూసి ఆశ్చర్యపోయారు.

సూరజ్ మల్లు రాజుతో రాజుగారు! ఈ దూదినంతా దారంగా మార్చడంతో అజిత్‌సింగ్ అహంకారం మరింత పెరిగింది. మీరు చెయ్యలేని పనులు తను చేయగలనని అతనికి గర్వం. మీరు అతన్ని కష్టపెట్టదలచుకుంటే అసంఖ్యాకమైన మీ పొలాల్లో విరగబండిన గోధుమధాన్యాన్ని రేపటికల్లా కోసి ధాన్యాగారంలో నింపమని చెప్పండి. చూద్దాం అన్నాడు.

రాజు వెంటనే అజిత్‌సింగ్‌ను పిలిచి, గోధుమపంట బాగా పండింది. రేపటికల్లా నా పొలాల్లో పంట ధాన్యాగారంలో వుండాలి అని ఆదేశించాడు.

ఆ పొలాలు వందల ఎకరాల్లో వుంటాయి. మనుషుల్ని పెట్టి కోతపని చేసినా నెలరోజులు పడుతుంది. కానీ వెంటనే సన్యాసి యిచ్చిన కొడవలి గుర్తు కొచ్చింది.

చీకటి పడుతుండగా కొడవలి తీసుకుని పొలం కేసి వెళ్ళాడు. గంటలో చకచకా పంటకోసి కుప్పలు వేసింది కొడవలి.

యింత జరిగాకా కూడా యింకా ఏదయినా అపకారం చెయ్యగలననే సూరజ్‌మల్లు భావించాడు. రాజుదగ్గరికి వెళ్ళి, రాజా! అజిత్‌సింగ్ అందరితో గొప్పలు చెప్పుకుంటున్నాడు. నెలల తరబడి అందరూ చెయ్యగలిగే పనులు తను ఒక్కడే ఒంటి చేత్తో చేస్తున్నాడని ప్రగల్భాలు పోతున్నాడు అన్నాడు రాజు. మరి అయితే అతనికి యింకేమి లక్ష్యాలు పెడతాం? అన్నాడు.

సూరజ్‌మల్లు, రాజా! నిజానికి మన నగరానికి నీటి ఎద్దడి వుంది. వర్షాలు సరిగా లేవు. వెంటనే అజిత్‌సింగ్ ని పిలిచి నగరంలో ఉదయం కల్లా పన్నెండు బావులు తవ్వి సిద్ధం చెయ్యమని చెప్పండి, అన్నాడు.

రాజు అజిత్‌సింగ్‌ని పిలిచి, నువ్వు యిప్పటిదాకా అనుకున్న లక్ష్యాల్ని అనాయాసంగా సాధించావు. కానీ యిది కష్టమైనపని ఉదయం కల్లా నగరంలో పన్నెండు బావుల్ని సిద్ధం

చెయ్యాలి, అన్నాడు.

మళ్ళీ నిరాశపడినపుడు సన్యాసి యిచ్చిన పార గుర్తొచ్చింది. రాత్రికి రాత్రేపార పన్నెండు బావుల్ని తవ్వింది. సూరజ్‌మల్లు ఆశ్చర్యపడి అజిత్‌సింగ్‌కు అతీతశక్తులున్నాయని భావించి రాజుతో, అజిత్‌సింగ్ తెలివైనవాడు. మీరు అతన్ని స్వర్గానికి పంపితే మీ తల్లిదండ్రులక్షేమ సమాచారాలు తెలుసుకుని వస్తాడు కదా! అన్నాడు. రాజు మొదట ఆలోచనలో పడ్డాడు. కానీ తరువాత నిర్ణయానికి వచ్చాడు. అజిత్ సింగ్ అనితర సాధ్యమయినవి సాధించగలిగిన ప్రతిభాశాలి. కాబట్టి ఆకాశంలో వున్న తన తల్లిదండ్రుల క్షేమసమాచారాలు కూడా తెలుసుకుని వచ్చి తనకు తెలియబరచి తనని ఆనందపరుస్తాడని భావించాడు.

రాజు సూరజ్‌మల్లుతో, మరి అజిత్ సంగ్‌ను స్వర్గానికి పంపేమార్గమేది? అని అడిగాడు.

సూరజ్ మల్లు , రాజా! ఏముంది గొప్ప వాళ్ళకు ఎలా చేస్తామో అజిత్‌సింగ్‌కు కూడా అలాంటి ఏర్పాటు చేద్దాం. అతను ఎన్నో గొప్ప పనులు చేశాడు కదా! అందుకని గంధపు చెక్కలు పేర్చి వాటిపై అతన్ని పెట్టి మంటపెట్టి, మంట పెరగడానికి ఆవు నేతిని మంటలో కుమ్మరిస్తే అతను సరాసరి స్వర్గానికి వెళతాడు అని చెప్పాడు.

రాజుగారికి సూరజ్‌మల్లు మాటలు నచ్చాయి. వెంటనే అజిత్‌సింగ్‌ను పిలిచి చూడు, యింతవరకూ మానవమాత్రుడు చెయ్యలేని మహిమల్ని చూపావు. అందుకని నీమీద నాకు గొప్ప నమ్మకం కలిగింది. నువ్వు స్వర్గానికి వెళ్ళి నా తల్లిదండ్రుల క్షేమసమాచారాలు తెలుసుకుని రా. అందుకు నువ్వే సమర్థుడవు. రేపే గంధపు చెక్కల మంటల గుండా స్వర్గం ప్రవేశించు, అని ఆదేశించాడు.

అజిత్ సింగ్ ఎంతో అల్లాడినా లాభం లేకపోయింది. రేపటి కల్లా రంగం సిద్ధమవుతుంది. సమాయత్తం కావాలి. రాత్రంతా నిద్రపోకుండా గడిపాడు. ఒక ఆలోచనవచ్చింది. పారతో తనని కట్టెల్లో కాల్చే స్థలం నించీ తన యింటిదాకా ఒక సొరంగం తవ్వాడు.

ఉదయం కట్టెలపై కూచున్నాడు. చుట్టూ మంట పెట్టారు పొగలు కమ్ముకుంటూనే సొరంగం గుండా యింటికి చేరాడు. జనం పొగ గుండా స్వరంలోకం చేరాడని భావించారు. పీడ విరగడయిందిని సూరజ్‌మల్లు భావించాడు.

అజిత్ సింగ్ నెల తరువాత హఠాత్తుగా రాజసభలో అడుగు పెట్టాడు అతన్ని

చూసి సూరజ్‌మల్లు వణికిపోయాడు. రాజు అతన్ని చూసి లేచి తన తల్లిదండ్రుల గురించి ఆరాతీశాడు. అజిత్‌సింగ్, రాజు! మీ తల్లిదండ్రులు క్షేమంగా వున్నారు. కానీ రాజా! మీ నాన్నగారు స్వర్గంలో వున్నా రాజేకదా! ఆయనకు తెలివయిన ఒక అమాత్యుడు తోడుకావాలి అన్నాడు. పైగా మీ నాన్న గారికి తెలిసిన మంత్రుల్లో సూరజ్‌మల్లు ముఖ్యుడు, అందుకని ఆయన్ను స్వర్గానికి పంపితే తనకు బాగా కాలక్షేపమవుతుందని మీ నాన్నగారు అన్నారు, అన్నాడు. సూరజ్‌మల్లుకు తగిన శాస్తి జరగబోతోందని అజిత్‌సింగ్ భావించాడు.

రాజు, నా తండ్రి కోరిక మన్నించడం కన్నా నాకు అదృష్టమేముంది, రేపటిదాకా ఎందుకు? యిప్పుడే సూరజ్‌మల్లును నా తండ్రి దగ్గరకు పంపుతాను, అని కట్టెలు సిద్ధం చేసి సూరజ్‌మల్లును వాటిపై కూచోబెట్టి మంట పెట్టి నెయ్యి పోసి మంట ఎగదోశాడు.

పొగలు పైకి ఎగిశాయి, పొగలతో బాటు సూరజ్‌మల్లు స్వర్గానికి పోయాడని జనమంతా అనుకున్నారు. సూరజ్‌మల్లు పైకి వెళ్ళాడే కానీ మళ్ళీ తిరిగిరాలేదు.

# 9 తల్లి ప్రేమ

పూర్వం ఒక రాజు, రాణి వుండేవాళ్ళు. వాళ్ళకి ఒక్కగానొక్క కూతురు. వాళ్ళకు కూతురంటే ప్రాణం, ఎంతో అనురాగంతో ప్రాణంగా పెంచుకున్నారు. కొన్నాళ్ళు ఆనందంగా గడిచింది. కాలమెప్పుడు ఒక్కలాగే వుండదుకదా!

హఠాత్తుగా రాణి అనారోగ్యం పాలయింది. తాను చనిపోతానని ఆమెకు తెలిసి వచ్చింది. రాజును దగ్గరికి పిలిచి, నేను చనిపోయిన తరువాత మన బిడ్డకు ఏ కష్టమూ రాకుండా సంతోషంగా పెట్టండి, అంది రాజు సరేనన్నాడు. రాణి కన్నుమూసింది.

కొంతకాలానికి రాజు మళ్ళీ పెళ్ళి చేసుకున్నాడు. కొత్తరాణితో బిడ్డను జాగ్రతగా చూసుకోమని ఒప్పగించి రాచకార్యాల్లో మునిగిపోయాడు మొదట కొత్త రాణి కొంతకాలం బిడ్డను బాగానే చూసుకుంది. తరువాత నిర్లక్ష్యం చేసింది. పట్టించుకోవడం మానేసింది. ఆ అమ్మాయి ఆలనాపాలనా చూసేవాళ్ళు కరువయ్యారు. సమయానికి సరయిన తిండిలేక బక్కచిక్కిపోయింది. ఒకరోజు ఆకలివేసి కొత్తరాణిని తనకు తినడానికి ఏమయినా యివ్వమని కోరింది. కొత్తరాణి కోపంతో వుండి ఆ అమ్మాయిని కొట్టింది. ఆ అమ్మాయి ఏడ్చుకుంటూ వుద్యాన వనంలోకి వచ్చి ఒక చెట్టు కింద కూచుంది. ఎవరో హఠాత్తుగా ఆ అమ్మాయిని పిలిచినట్లయింది. ఆ అమ్మాయి తలపైకెత్తి చూసింది. చెట్టు కొమ్మ మీద రామచిలుక కనిపించింది. అది, ఏడవకమ్మా! నేను మీ అమ్మను. ఈ జన్మలో ఈ రామచిలుకగా పుట్టాను. నీకు పళ్ళు ఫలహారాలూ తినడానికి తెచ్చి పెడతాను నీకు ఎప్పుడు ఆకలి వేసినా యీ చెట్టు కిందకు వచ్చికూచో! అని చెప్పింది.

ఆ అమ్మాయి ఎంతో సంతోషించింది. రామచిలుక తెచ్చిపెట్టిన పళ్ళు ఫలహారాలు తింది. అట్లా ఆకలి వేసినపుడల్లా అక్కడికి వచ్చేది. రామచిలుక తెచ్చిపెట్టినవన్నీ తినేది. ఆ అమ్మాయి చక్కగా బొద్దుగా తయారయింది. కొత్తరాణి సందేహం కలిగింది. ఆ అమ్మాయికి ఎవరో ఆహారం రహస్యంగా పెడుతున్నారని అనుమానం వేసింది.

అందుకని సవతి తల్లి తన చెలికత్తెను ఆ అమ్మాయి పైన ఒక కన్నేసి వుంచమని చెప్పింది. ఆ చెలికత్తె ఆ అమ్మాయికి రామ చిలుక పళ్ళు, ఫలహారాలు పెట్టడం చూసి వెళ్ళి సవతితల్లి తో చెప్పింది.

కొత్తరాణి కుట్ర పన్నింది. ఆరోగ్యం బాగాలేదని పడకవేసింది. ఏమయిందని రాజువచ్చి వాకబు చేశాడు. ఆమె కిటికీలోంచీ చెట్టును చూసి ఆ చెట్టుపై ఒక రామచిలుక వుంటుంది. అది రోజూ అరుస్తూ నాకు నిద్రలేకుండా చేస్తోంది. అందుకని నాకు తల నొప్పిగా వుంది, అంది. రాజు అలా అయితే యిప్పుడే ఆ రామచిలుకను చంపిస్తాను, అన్నాడు.

ఆ మాటలు విన్న అమ్మాయి పరిగెత్తుకుంటూ వెళ్ళి రామచిలుకతో తాను విన్నమాటలు చెప్పింది. ఆ రామచిలుక 'బిడ్డా! నువ్వు దిగులు పడకు. నేను యిప్పటి నించీ మేకగా మారిపోతాను. ఎప్పుడు నీకు ఆకలనిపిస్తే ఈ చెట్టుకిందకురా. నీకు కడుపునిండుగా పాలిస్తాను అంది.

కడుపునిండుగా పాలు తాగుతూ ఆ అమ్మాయి నిగనిగ లాడింది. సవతితల్లి ఆశ్చర్యపోయింది. చెలికత్తెను పంపింది. ఆ అమ్మాయి మేక పాలు తాగడం తెలిసింది.

మళ్ళీ రాణి పడకవేసింది. రాజు వచ్చి యిప్పుడేమయిందన్నాడు. కొత్తరాణి ,రాజా! యిప్పుడు రాత్రింబవళ్ళు ఆ చెట్టుకింది మేక అరుపుల్తో నాకు నిద్రావడం లేదు అంది. రాజు, అయితే దాన్ని చంపిస్తాను, అన్నాడు. యిది విన్న అమ్మాయి పరిగెట్టుకుంటూ వెళ్ళి జరిగింది. తల్లితో చెప్పింది. తల్లి నువ్వు దిగులు పడకు. యిప్పటి నించీ నేను మేక రూపంనించీ ఒక మొక్కజొన్న కండెలు కాల్చుకుని తిని ఆకలి తీర్చుకో, అంది.

కొత్తరాణి మళ్ళీ చెలికత్తెను పంపింది. ఆ అమ్మాయి వేడివేడి మొక్క జొన్న కండెలు తినడం చూసి పరిగెత్తుకుంటూ వచ్చి విషయం కొత్తరాణికి చెప్పింది.

కొత్తరాణి ఎప్పట్లా మంచమీద ముడుచుకుని పడుకుంది. రాజు వచ్చి రాణిని బుజ్జగించి, ఎందుకలావున్నావన్నాడు.

కొత్తరాణి, నాకు మనశ్శాంతి లేకుండాపోయింది. మొన్నటి దాకా రామచిలుక, ఆ తరువాత మేక, యిప్పుడు మొక్క జొన్న పొలం. దాని నిండుగా పిట్టలు చేరి అరుస్తూ వుంటే ఎట్లా నిద్రపడుతుంది? అంది.

రాజు సరే! మనుషుల్ని పెట్టి మొక్కజొన్న పంటకి వేర్లతో సహా పెకిలించి విసరికొడతాను, అన్నాడు.

రాజు సేవకుల్ని పిలిపించి వెళ్ళి ఆ మొక్కజొన్న పంటను మొదలంటా పెకిలించి పడెయ్యమని ఆజ్ఞాపించాడు.

వాళ్ళు కత్తులతో, రంపాలతో పొలం వెళ్ళి చూస్తే అక్కడ ఏమీ లేదు. అంతాపెద్దపెద్ద బండలేవున్నాయి.

వాళ్ళు తిరిగి రాజు దగ్గరికి వచ్చి, రాజా! మీరు చెప్పిన పొలం దగ్గరకి వెళితే అక్కడ పంటలేదు. అన్నీ బండలేవున్నాయి. అన్నారు.

రాజు ఆశ్చర్యపోయి, అదెట్టా? నేనేవచ్చిచూస్తానని వాళ్ళతోబాటు వచ్చాడు. రాజు కళ్ళముందే వాళ్ళు పారతో నేలను తవ్వినా అది ఎంతో గట్టిగా వుండి ఏమీ రాలేదు.

రాజు తనే ఒక పారతీసుకుని భూమి తవ్వడానికి ప్రయత్నించాడు. అప్పుడు హఠాత్తుగా తెల్లవస్త్రాలు ధరించిన తన మొదటి భార్య ప్రత్యక్షమైంది. రాజు ఆశ్చర్యపోయాడు.

ఆమె, రాజా! మీరు నా అనంతరం నా బిడ్డకు ఏ లోటురాకుండా చూస్తానని హామీ యిచ్చారు. ఆ నమ్మకంతోనే మీరు కొత్తరాణికి నా బిడ్డను ఒప్పగించారు. ఆమె నా బిడ్డను ఆకలితో అల్లాడేలా చేసింది. బాధలు పెట్టింది. పెడుతోంది అని అదృశ్యమైంది.

దాంతో రాజుకు కనువిప్పయింది. ఎంత పొరపాటు చేశానో అని పశ్చాత్తాప పడ్డాడు. కొత్తరాణిని తీవ్రంగా మందలించాడు అది మొదలు ఒక్క క్షణం కూడా తన బిడ్డను వదిలిపెట్టకుండా కంటికి రెప్పలా చూసుకున్నాడు.

# 10 స్వర్గానికి ప్రయాణం

మధుర జిల్లాలోని ఒక గ్రామంలో అనోఖీ, అన్న అల్లరి కుర్రాడు వుండేవాడు. తన చిలిపి చేష్టల్తో, కొంటె పనుల్తో అందరి ఆటా పట్టించేవాడు. అతని మేనమామ గౌరవనీయుడయిన గ్రామపెద్ద. గ్రామస్థులంతా ఒకరోజు ఆ గ్రామపెద్దదగ్గరకు వచ్చి, అయ్యా! మీ మేనల్లుడు చిన్నా పెద్దా అన్న తారతమ్యం లేకుండా అందర్నీ ఎగతాళి చూస్తూ యిబ్బంది పెడుతున్నాడు. మీరు గ్రామపెద్ద కాబట్టి ముందుగా మీకు చెప్పాల్సిన బాధ్యత మాకుంది. అతన్ని మీరు అదుపులో పెట్టండి. లేని పక్షంలో మేమే అతన్ని అదుపులోపెడతాము అన్నారు. గ్రామపెద్ద, మీకా శ్రమ అక్కర్లేదు. మావాడికి నేనంటే భయం, నేను చెప్పినట్లు వింటాడు. అతన్ని నాకు వదిలిపెట్టండి నేను అదుపులో పెడతాను, అని చెప్పి వాళ్ళను పంపించివేశాడు.

మేనమామ అనోఖీని పిలిచి గ్రామస్థులు అతని గురించి చెప్పిన విషయాలు వివరించాడు. అనోఖీ. నేను వాళ్లకు ఎలాంటి అపకారం చెయ్యడం లేదు. ఆటపట్టిస్తున్నాను, చమత్కారాలు పేలుస్తున్నాను, అంతే వాళ్ళంటే నాకు భయం లేదు. పైగా వాళ్ళను వినోదపెడుతున్నాను. సరే నువ్వు గ్రామస్తుల్తో యిలాచెప్పు. నాకో వందరూపాయలిస్తే అందర్నీ కనుకట్టు విద్యల్తో కళ్ళు చెదిరేలా చేస్తాను, అన్నాడు.

అతని మేనమామ గ్రామస్థుల్ని పిలిచి వాడు నా అదుపాజ్ఞలకు లొంగేలా లేదు. పైగా అందరూ కలిపి వందరూపాయలు యిస్తే అద్భుతాలు చేస్తానని, కనుకట్టు విద్యల్తో కళ్ళు చెదిరేపనులు చేస్తానని అన్నాడు అని చెప్పాడు.

గ్రామస్తులకు ఆ మాటలు ఆకర్షణీయంగా అనిపించాయి అందరూ కలిసి వందరూపాయలు సేకరించి గ్రామపెద్దకిచ్చి, యిదిగో వందరూపాయలు. అనోఖీ, మమ్మల్ని ఆశ్చర్యానికిలోను చేఏపనులు చేయకుంటే అతన్ని మేమంతా కలిసి కొడతాము. తరువాత మమ్మల్ని అని లాభం లేదు, అన్నారు.

అనుకోకుండా అందిన వందరూపాయలకు అనోఖీ ఆనందించాడు. భార్యతో, చూడు. మామేనమామ గ్రామస్తుల దగ్గర వందరూపాయలు సేకరించి నాకిచ్చాడు. గ్రామస్తులు నేను ప్రదర్శించే కనికట్టు విద్యచూడాలని వువ్విళ్ళూరుతున్నారట. వాళ్ళని నా

చాతుర్యం ప్రదర్శిస్తా, అన్నాడు. అతని భార్య, ఎందుకు లేనిపోని సమస్యలు కొని తెచ్చుకుంటావు? గ్రామస్తులు నీకుకష్టాలు తెచ్చిపెడతారని భయంగావుంది. నీ కనికట్టు విద్యలకు వాళ్ళు లొంగిపోరు. వాళ్ళ డబ్బులు వాళ్ళకు తిరిగియిచ్చేసి ప్రశాంతంగా వుండు అంది.

అనోఖీ, భార్య మాటలకు నవ్వి, ఎంత అమాయకురాలివి ఈమాత్రనికే భయపడిపోయావు. నేను చెప్పినట్లు నువ్వు చేస్తే లెక్కలేనన్ని చీరలు, నగలు కొనిస్తాను అన్నాడు.

ఆ మాటల్తో ఆమె ముఖం వెలిగిపోయింది. సరే! త్వరగా చెప్పు అన్నీ నువ్వు చెప్పినట్లే చేస్తాను, అంది.

అనోఖీ, నేను చెప్పేది జాగ్రతగా విను. రోజూ నువ్వు నీళ్ళకోసం బావి దగ్గరికి వెళ్ళినట్లు ఈ రోజు కూడా వెళ్ళు. అక్కడ నీళ్ళు తోడుతూ కన్నీళ్ళు నింపుకో. అక్కడున్న స్త్రీలు ఏమైందని అడుగుతారు. మా ఆయన చాలా అనారోగ్యంతో వున్నాడు. ఈ రాత్రిదాకా కూడా బతకడం కష్టం అనిచెప్పు, అన్నాడు. ఆమె బావి దగ్గరకు నీళ్ళకోసం వెళ్ళి భర్త చెప్పినట్లే చేసింది. అందరూ, మీ ఆయన ఎప్పుడూ నవ్వుతూ ఆడుతూపాడుతూ అందర్నీ వినోదపెడుతూ వుండేవాడు. నీ కెంతయిబ్బంది కలిగింది. అంటూ సానుభూతి ప్రకటించారు దాంతో ఆమె మరింతరోదించింది.

ఆమె యింటికి వచ్చి విషయం భర్త చెవిన వేసింది. ఆ రాత్రి పక్కగ్రామంలో ఎవరో వ్యక్తి చనిపోతే ఖననకార్యక్రమాలు జరిగాయి అనోఖీ రహస్యంగా భార్యతోబాటు స్మశానానికి వెళ్ళి సమాధి తవ్వి ఆ శావాన్ని తీసుకొచ్చి తలకూడా కనిపించకుండా గుడ్డతో కట్టి వరండాలో పెట్టి భార్యతో తాను చనిపోయానని అందరితో చెప్పమని ఎవరయినా శవం ముఖం చూడాలని అంటే ఆయన తను చనిపోయాక తనముఖం ఎవరూ చూడకూడదని చెప్పారని, అది ఆయన చివరికోరిక అని చెప్పమని వెళ్ళి దాక్కున్నాడు.

ఉదయానికి వార్త గ్రామమంతా వ్యాపించింది. అతని మేనమామ, గ్రామస్తులు అందరూ బాధపడ్డారు. తలకు చుట్టిన గుడ్డ తొలగించబోతే భర్త చివరికోరిక చెప్పి భార్య వారించింది.

అందరూ కలిసి భారీ ఎత్తున శవాన్ని పాతిపెట్టారు. గ్రామస్తులు తమని వినోదపరిచే వ్యక్తి వెళ్ళిపోయినందుకు బాధపడ్డారు.

కొన్నాళ్ళ అనంతరం అనోఖీ యింటి నించి బయట పడి మొదట తన మేనమామ యింటికి వెళ్ళి తలుపు తట్టాడు. అతని మేనమామ తలుపు తెరిచి చూసి అదిరిపోయి, ఎవరు నువ్వు, నువ్వు చచ్చిపోయావుకదా! ఎట్లా తిరిగి వచ్చావు? అన్నాడు.

అనోఖీ, మామా! నువ్వు చెప్పింది నిజమే. నేను చనిపోయాను. చనిపోయి స్వర్గానికి వెళ్ళాను. అక్కడి నుండి సరాసరి వస్తున్నా, అక్కడ చెప్పడానికి వీలుపడనన్ని అద్భుతాలు వున్నాయి. విశాల భవనాలు, అద్భుతమయిన ఉద్యానవనాలు, రత్నాల తాపడం చేసిన సోఫాలు, రంగులఫోంపైన్లు అక్కడి లాంటి భోజనం యిక్కడ కలలో కూడా దొరకదు. అక్కడ అప్సరసలు దగ్గరికొచ్చి పాటలు పాడుతూ నాట్యమాడుతూవుంటే మైమరచి పోతామనుకో, అన్నాడు.

మేనమామ ఆ మాటలకు పరవశించి, అబ్బాయి! ఈ గ్రామస్థులు నన్ను ఎన్నో యిబ్బందులకు గురిచేస్తున్నారు. నేను కూడా నీతో వచ్చేసి అక్కడ ఆనందంగా గడపాలనుకుంటున్నాను, అన్నాడు.

దానికి అనోఖీ, కానీ మామా! అది నువ్వనుకున్నంత సులభంకాదు అక్కడికి రావడానికి, ప్రవేశానికి ఎంతో కర్చవుతుంది. నువ్వు వంద రూపాయలిస్తే అక్కడ నీకు చోటుకోసం ప్రయత్నిస్తాను, అన్నాడు. వందయిచ్చాడ మామా.

అనోఖీ, మామా! రేపు ఈ సమయానికే యిక్కడికి వస్తాను. అన్ని సక్రమంగా జరిగితే, నిన్ను సరాసరి స్వర్గానికి తీసుకుపోతాను, అన్నాడు.

అనోఖీ వెళ్ళి పోయాకా అతని మేనమామ తన భార్యతో మన అనోఖీ యిప్పుడే వచ్చి వెళ్ళాడు, అన్నాడు. ఆమె, ఏం మాట్లాడుతున్నారు. అర్థం పర్థం లేకుండా? చనిపోయిన వాడు తిరిగి రావడంజరిగే పనేనా? అంది.

అతను, నేను నిజమే చెబుతున్నాను, స్వర్గం నించీ వచ్చి నన్ను కూడా రేపు స్వర్గానికి తీసుకెళతానని చెప్పాడు. అసలు నీకు స్వర్గం ఎలావుంటుందో తెలుసా? అన్నాడు. ఆమె తెలీదంది. అనోఖీ వివరించినట్లుగానే స్వర్గాన్ని భార్యకు వర్ణించాడు. ఆ మాటల్ని ఆసక్తితో విన్న ఆమె, నేను ఆమె అత్తను కదా! వాడు మొదట ఈ విషయం నాతో చెప్పాల్సింది. మొదట నన్నే స్వర్గానికి తీసుకు వెళ్ళాల్సింది అంది. రేపు వస్తాడులే. అడుగు అన్నాడు భర్త. మరుసటిరోజు అనోఖీ వస్తూనే, ఒరే! నేను మీ అత్తను కదా! నన్ను స్వర్గానికి తేసుకెళ్ళవా? అంది. 'అత్తా! అదంత సులభం కాదు. మామ ఎంతో కష్టపడి తనదగ్గరున్న వందరూపాయలు తెచ్చిచ్చాడు, అన్నాడు.

ఆమె యింట్లోకి వెళ్ళి రెండు వందల రూపాయలు తెచ్చి, తేసుకో రెండువందలిస్తున్నా. అయితే నాకు కూడా స్వర్గంలో చోటుందికదా! అంది. అనోఖీ, సరే! అత్తా! అంతాసిద్ధం చేసుకుని వుండండి. అర్థరాత్రి చడీచప్పుడు కాకుండా వస్తాను, ప్రయాణానికి రెడీకండి, అన్నాడు.

సాయంత్రం యింటినించే స్వర్గాయాత్రకు అనోఖీ అని ఏర్పాట్లు చేశాడు. దారిలో వెళుతువుంటే ఒక చాకలియింటి ముందు గాడిద కనిపించింది. మెల్లగాదాని కట్లు విప్పి తనతోబాటు తీసుకెళ్ళాడు. మేనమామా యింటికి వెళ్ళి అక్కడున్న చెట్టుకు గాడిదను కట్టేసి మేనమామ యింటి తలుపు తట్టి, త్వరపడండి. లేకుంటే స్వర్గంలో మీకు కేటాయించిన స్థలాల్ని ఎవరయినా ఆక్రమించేవీలుంది, అన్నాడు. యింకా, స్వర్గానికి ప్రయాణమన్నది ఎగుడు దిగుళ్ళతో యిబ్బందికరంగా వుంటుంది. రథంలో ప్రయాణించినట్లు కాదు. గాడిద మీద ప్రయాణంలా వుంటుంది. లోయలు, పర్వతాలు వుంటాయి. మీ కళ్ళకు గంతలు కట్టుకోవాలి అన్నాడు. కళ్ళకు గంతలు కట్టుకుని యిద్దర్నీ గాడిద మీద అడ్డంగా కూర్చో పెట్టి గాడిద తోకను చేతికందించి, యిది పవిత్రమయిన తాడు, దీన్ని గట్టిగా పట్టుకోవాలి అన్నాడు.

గాడిద ఎగుడు దిగుళ్ళలో యిబ్బందిగా ప్రయాణించింది. ఎంతదూరం వెళ్ళినా యింకా రాకపోవడంతో మేనమామ ‘ అబ్బాయీ! స్వర్గమింకా ఎంత దూరముంది. అలసిపోతున్నాం. ఈ పవిత్ర రథంపైన ప్రయాణం కష్టంగావుంది’ అన్నాడు.

మామా! ఓపిక పట్టాలి, అని యిటూ అటూ తిప్పి తన మేనమామ యింటి తలుపు దగ్గరే ఆపి, స్వర్గానికి రాజు యమధర్మరాజు. అతనే మీకు దారి చూపిస్తాడు, అని అనోఖీ మాయమయిపోయాడు.

భార్యా భర్తలిద్దరూ, యమధర్మరాజా! యమధర్మరాజా! అని పిలిచారు. ఎట్లాంటి ప్రతిస్పందనా లేదు. ఎన్ని సార్లు పిలిచినా ఎవరూ పలక లేదు. చివరకు వాళ్ళ అబ్బాయి మేలుకుని తలుపు తెరిచి గాడిద మీద గంతలు కట్టుకుని వున్న తన తల్లిదండ్రుల్ని చూసి ఆశ్చర్యపోయి వాళ్ళ కళ్ళ గంతలు విప్పాడు. యింకా మత్తులోనే వున్న వాళ్ళు. ఆహా! ధర్మరాజు! యిన్నాళ్ళకు నీ దర్శన భాగ్యం కలిగిందా! ఎంత అదృష్టవంతులం! అన్నారు.

కొడుకు తన తల్లిదండ్రులకు పిచ్చెక్కిందని భావించి వాళ్ళని కదిలించి, మీరు గంతలు కట్టుకుని గాడిద మీద వూరేగుతున్నారు. అవమానంగా లేదా? అన్నాడు, తల్లిదండ్రులు ఈ లోకంలోకి వచ్చారు. యిటా అటూ చూసి తమని అనోఖీ మోసం

చేసినట్లు గ్రహించి, అయ్యో! స్వర్గానికి తీసుకుపోతాడంటే నమ్మి మూడువందలు వాడికి సమర్పించుకున్నామే అని లబోదిబో మన్నారు.

మరుసటిరోజు గ్రామస్తులంతా అనోఖీని బంధించి అతని అల్లరి చిల్లరి పనుల గురించి నిలదీసి తమ ధనం కక్కమని అడిగారు.

దానికి అనోఖీ, నేను మీకు విచిత్రాలు ప్రదర్శిస్తానని ముందుగానే చెప్పాను. అందుకనే డబ్బు తీసుకున్నాను. మళ్ళీ ఎందుకు తిరిగియిస్తాను. విచిత్రాలు ప్రదర్శించాను. అందుకనే ఆ డబ్బు నాది అన్నాడు.

గ్రామస్తులు ఏమీ బదులు పలకలేదు. అనోఖీ నవ్వుకుంటూ తనయింటికి వెళ్ళాడు.

# 11 కనురెప్పల స్వేదం

బుందేల్‌ఖండ్‌లో పర్వతాలు, అరణ్యాలు పచ్చగా చూడముచ్చటగా వుంటాయి. బ్రిటిష్ వాళ్ళకు ఎదిరించిన ఝూన్సీ రాణి ఆప్రాంతానికి చెందిందే. ఆ ప్రాంతంలో ఒక గ్రామముంది. ఆ గ్రామంలో ఒక బ్రాహ్మణుడు నివసించేవాడు. అతను ధర్మాత్ముడు, నిరాడంబరంగా జీవించేవాడు. అత్యాశలేనివాడు. పూజా పునస్కారాలు చేసుకుంటూ, మంత్రాలు పండుగలకు పబ్బాలకు యిళ్ళలో చెబుతూ స్థానిక గుడిలో అర్చకత్వం చేస్తూ జీవించేవాడు. వివేకవంతుడు. అవసరానికి మించి ఆశించేవాడు కాదు.

కానీ అతని భార్యకు మంచి బట్టలు కట్టుకోవాలని, నగలు ధరించాలని ఆడంబరాలపట్ల ఆసక్తి వుండేది. యితర విధాల ఆదాయం పెంచుకోమని భర్తను పోరుతూ వుండేది. ఆయన పట్టించుకునేవాడు కాదు.

ఒకరోజు యిరుగుపొరుగు స్త్రీలు ఆ దేశాన్ని పాలించే రాజు ధర్మాత్ముడని ఆయన్ని యాచించిన వారికి లేదనకుండా దానధర్మాలు, భూరి విరాళాలు యిస్తాడని చెప్పారు. ఆమె ఆవిషయం భర్తతోచెప్పింది. ఆ బ్రాహ్మణుడు, రాజుల సొమ్ము పాపం చేసి సంపాదించింది. దౌర్జన్యంచేసి దండుకున్నది. అట్లాంటి వాళ్ళ దగ్గర డబ్బు తీసుకోవడం కూడా పాపమే అవుతుందని శాస్త్రాలు చెబుతాయి, అన్నాడు.

కానీ భార్య రోజూ పోరుతూ వుండేది. మీ చాదస్తం పక్కన పెట్టి నోరు తెరిచి రాజును అడగండి. ఆయన ఏదయినా సాయం చేస్తాడు అంది. భార్య బాధపడలేక బ్రాహ్మణుడు రాజును సందర్శించాడు. రాజు అతన్ని ఆహ్వానించి, విప్రులకు ఏం కావాలి, అడగండి మమ్మల్ని అడిగి లేదు అపించుకున్నవాళ్లు లేరు అన్నాడు దర్పంగా.

బ్రాహ్మణుడు, ప్రభువులు దానగుణశీలురు. నాకు ఏమీ గొప్పవి వద్దు ధనధాన్యాదులు వద్దు. కేవలం నాలుగుపైసలు మీ కష్టార్జితమైనవి యిచ్చారంటే చాలు అన్నాడు.

రాజు పగలబడినవ్వి అమాయకుడిలా వున్నావు. యిప్పటిదాకా నన్ను యింత అల్పమొత్తంలో అడిగిన వాళ్ళు లేరు. నగలు, ధనం, బంగారం అడిగిన వాళ్ళున్నారు. నువ్వేమో నాలుగుపైసలు అడుగుతున్నావు. అది నన్ను అవమానించినట్లు యింకేదయినా కోరుకో అన్నాడు.

బ్రాహ్మణుడు, రాజా! నాకు ఏమీ వద్దు. నాలుగుపైసలు అదీ మీ కనురెప్పల స్వేదంపై ఆర్జించింది. అంటే మీరు శరీరకష్టం చేసి సంపాదించిన నాలుగుపైసలు నాకిస్తే ధన్యుణ్ణి అన్నాడు.

సభలోని జనం చిత్రంగా చూశారు. రాజు ఆలోచనలో పడి, సరే! ఎల్లుండిరా! నువ్వు అడిగింది యిస్తానన్నాడు. బ్రాహ్మణుడు యింటికి వచ్చేశాడు.

చేతులూపుకుంటూ వచ్చిన భర్తతో భార్య, ఏమైంది! అని అడిగింది. బ్రాహ్మణుడు, నేను అడిగింది రాజు ఎల్లుండి యిస్తానన్నాడు అన్నాడు. బహుశా సంచుల్లో నింపడానికి సమయం పట్టడం వల్ల రాజు ఎల్లుండి దాకా సమయం తీసుకున్నాడేమో అని ఆమె సంతోషించింది.

ఈ మధ్యలో రాజు నాలుగు పైసలు కష్టపడి ఎలా సంపాదించాలా? అని తర్జనభర్జన పడ్డాడు. అప్పటి దాకా రాజు ఎప్పుడు కష్టపడి ఎరుగడు. ఆజ్ఞలు జారీ చెయ్యడం, అధికారం చెలాయించడం ఒక్కటే అతనికి తెలుసు. కష్టమంటే ఏమిటో తెలీదు.

రాజు ఎట్లా నాలుగు పైసలు సంపాదించాలా? అని రాత్రంతా మేలు కుని ఆలోచించాడు. తెల్లవారుతుండగా లేచి స్నానం చేసి బయటపడ్డాడు. మారు వేషంలో నగరంలోకి వెళ్ళాడు.

ఒక యింటి ముందు నిల్చున్న వ్యక్తిని, చూసి నా కేదయినా పనికావాలి, చూపించగలరా? అని అడిగాడు, అతను మా యింట్లో బావిలేదు. అదిగో అక్కడ బావివుంది అందరూ అక్కడ నీళ్ళు తోడుకుంటారు. అక్కడ నుండి నీళ్ళు తెచ్చి మాయింట్లో నింపు అని కుండయిచ్చాడు.

అలవాటు లేని పని ఒకటిరెండు బిందెల నీళ్ళు తీసుకురాగానే రాజు అలసిపోయాడు. చెమటలు పట్టాయి. ఆ యింటి యజమాని రాజును చూసి 'నువ్వు యింత ఆలస్యం చేస్తే ఎప్పటికి మా యింట్లో తొట్టెలు నిండుతాయి. త్వరపడాలి', కానీ అన్నాడు. రాజు ఆయాసపడుతూ లేచి బావి దగ్గర నీళ్ళు తోడి కుండలో నింపి నాలుగడుగులు వేశాడో లేదో ఆ బరువుకు అడుగులు ముందుకు పడలేదు. కాళ్ళు వణికి కుండజారి కిందపడి పగిలిపోయింది. రాజు పడబోయి నిలదొక్కుకున్నాడు. యింటి యజమాని యిదంతా గమనిస్తున్నాడు, ' అయ్యా! నువ్వెవరో సుకుమారుడివా వున్నావు. చేతకాని పనులు చేస్తున్నావు. ఇది నీవల్ల కాని పని. నిజానికి నాకుండ పగిలిపోయింది. నీకు ఏమీయివ్వకూడదు కానీ నిన్ను చూస్తే జాలివేస్తోంది. సరే. ఈ నాలుగుపైసలు తీసుకుని

నీ దారంటా నువ్వు వెళ్ళు అన్నారు. రాజుకు ఒళ్ళంతా పచ్చి పుండయింది. ఏమైతేనేం? చెమటోడ్చి నాలుగు పైసలు సంపాదించాను కదా! అనుకున్నాడు.

మరుసటి రోజు సభలో రాజు కొలువు దీరాడు. బ్రాహ్మణుడు సభలోకి వచ్చాడు. రాజు నాలుగు పైసల్ని బ్రాహ్మణుడికి యిచ్చి, ఎంతోశ్రమించి ఈ నాలుగుపైసల్ని సంపాదించాను. యివి నా కష్టార్జితమని నువ్వు నమ్మవచ్చు అన్నాడు. బ్రాహ్మణుడు ఆ నాలుగు పైసలు తీసుకుని రాజును ఆశీర్వదించాడు. రాజు మరింత సంపదని తీసుకోమని కోరాడు. బ్రాహ్మణుడు, రాజా! నాకు ఈ నాలుగుపైసలు చాలు. మీరు నిజాయితీగా సంపాదించిన నాలుగు పైసలు చాలు అన్నాడు. ఆ నాలుగుపైసలుతో బ్రాహ్మణుడు సంతృప్తిగా యింటికి తిరిగి వెళ్ళాడు. అతని భార్య ఆతృతగా ఎదురుచూస్తోంది. ఆమె తన భర్త ధనధాన్యాలు, వజ్రవైఢూర్యాలు తీసుకొస్తాడని ఎదురుచూస్తూనే వుంటే తను కండువాలో మూటకట్టిన నాలుగుపైసలు తీసి ఆమెకిచ్చాడు.

చూడు ఈ నాలుగు పైసలు రాజు కష్టార్జితమయినవి. చెమటోర్చి సంపాదించినవి విలువైనవి, అన్నాడు. ఆమె ఎంతో నిరాశపడిపోయింది. పట్ట లేనికోపం వచ్చింది. వాటిని తీసికోపంగా తులసికోటలో విసిరి కొట్టింది. ఆమె తత్వం తెలిసి కోటలో నాలుగు మొక్కలు మొలిచాయి అవి ఎంతో అందంగా బలంగా వున్నాయి. బ్రాహ్మణుడు తన కండువా పరచుకుని దానిపై పడుకుని విశ్రాంతి తీసుకున్నాడు.

కొన్నాళ్ళ తరువాత తులసి కోటలో నాలుగు మొక్కలు మొలిచాయి. ధాన్యం కూడా బంగారు రంగులో వుంది. సాయంత్రానికి తులసి కోట చుట్టూ స్వర్ణకాంతితో పడిన ధాన్యాన్ని యింట్లో ఒక దగ్గర ఆమె కుప్పవేసిపెట్టింది. చూడ్డానికి అందంగా వుండడంతో ఆమె ధాన్యాన్ని పడెయ్యడానికి యిష్ట పడలేదు. కూరగాయలమ్మే ఆవిడ వస్తే కూరగాయలు తీసుకొనే బదులుగా ఆ ధాన్యాన్ని ఆమెకు కొద్దిగా యిచ్చింది. మెరిసిపోతున్న ధాన్యాన్ని ముచ్చట పడి ఆమె తీసుకుంది.

అంతలో రాజు కూతురుకి వివాహం నిశ్చయమైంది. రాణి తన కూతురికి మంచి ముత్యాల దండలు చేయించాలని ముచ్చటపడింది. మంచి ముత్యాల కోసం వాకబు చేసింది. ఎవరో సరుకులమ్మ అంగట్లోవున్నాయని సమాచారం యిచ్చే మనుషుల్ని పంపింది. వాళ్ళు సరుకులమ్మే అతని దగ్గర ముత్యాలెందుకుంటాయి? అయినా రాణి పంపింది గనక విచారిద్దాం అని వెళితే అతను మెరిసిపోతున్న ముత్యాలు చూపించాడు. వాళ్ళు ఆశ్చర్యంతో నీకు యివి ఎక్కడివి అడిగితే ఒక కూరగాయలమ్మే స్త్రీ వీటిని తక్కువ ధరకు

నాకు అమ్మింది. వీటి విలువ ఆమెకు తెలీదు అన్నాడు.

ఈ విషయం రాజుదాకావెళ్ళి ఆ కూరగాయలమ్మే స్త్రీ ద్వారా బ్రాహ్మణుడి భార్య గురించి తెలిపింది. బ్రాహ్మణుడు రాజు ముందు నిలబడ్డాడు. రాజు ఆశ్చర్యంతో ఈ విలువైనముత్యాలు నీకు ఎక్కడివి? అని అడిగాడు.

బ్రాహ్మణుడు, రాజా! యివి మా తులసి కోటలో మొలిచిన చెట్లకు కాస్తాయి అన్నాడు. రాజు సముద్రంలో దొరికేముత్యాలు చెట్లకు కాయడమేమిటి, అని ఆశ్చర్యంగా బ్రాహ్మణుడి యింటికి వచ్చాడు. తులసికోటలో ధగధగ లాడే నాలుగు మొక్కలకు వెలిగిపోయే ముత్యాలపంటను, అది యింట్లో గోడకు ఆనించి కుప్పవేసిన విధానాన్ని చూసి రాజు ఆశ్చర్యపోయాడు.

రాజు తమయింటికి రావడం చూసి పండితుడి భార్య ఆనందపడి పోయింది. ఆమె, రాజుగారు! మా ఆయన మీ కష్టార్జితమని నాలుగు పైసలు నాకిస్తే కోపంతో వాటిని తులసికోటలోకి విసిరేశాను. అవి యీ మొక్కలుగా మొలిచాయి అంది రాజు ఆశ్చర్యానికి అంతులేదు.

బ్రాహ్మణుడు, రాజా! కష్టం ఎంతవిలువైందో చెప్పాను కదా! శ్రమకు మించిన ధర్మంలేదు అన్నాడు. రాజు తలవంచి బ్రాహ్మడికి నమస్కరించాడు.

# 12 దయగల చిట్టెలుక

ఒకప్పుడు ముందు చూపున్న ఒక చిట్టెలుక వుండేది. మంచిపనులు చేయడానికి ఎప్పుడూ అవకాశం కోసం ఎదురుచూసేది. ఒకరోజు దారిలో ఎండుకట్టెలు చూసింది. ఎందుకయినా పనికొస్తాయని వాటిని తీసుకెళ్ళి తన బొరియలో పేర్చింది. ఒకరోజు పట్టణంలో చక్కర్లు కొడుతూ వుంటే ఒక ముసలావిడ పోయ్యి మండక పొగతో కన్నీళ్ళు తుడుచుకుంటూ కనిపించింది. ఎలుక, ఎందుకు ఏడుస్తున్నావంది. నాదగ్గర ఎండుకట్టెలు లేవు. పిడకల్తోనే వంట చెయ్యాలి. ఎండుకట్టెలు లేందే పొయ్యి మండదు అంది. ఎలుకవుండు, అని చెప్పి పరిగెట్టుకుంటూ తన బొరియ దగ్గరికి వెళ్ళి ఎండుకట్టెలు తీసుకుని ముసలావిడకు యిచ్చింది. దాంతో ఆమె కళ్ళు తుడుచుకుని మంటపెట్టి వేడివేడి చపాతీలు చేసింది. సాయపడిన చిట్టెలుకకు కూడా ఒక చపాతీ యిచ్చింది.

ఎలుక ఆ చపాతీ తీసుకుని ముసలావిడకు సాయపడ్డాను కదా! అని సంతోషపడుతూ ముందుకు సాగింది. దారిలో ఒక కుమ్మరివాడి కొడుకు పసివాడు బట్టలేకుండా తినడానికి ఏమీ లేక ఏడుస్తూ కనిపించాడు. 'పనిఅయ్యేదాకా ఆగు' ఎందుకు మొత్తుకుంటావు? తరువాత నీకు తినడానికి ఏమయినా పెడతాను, అని తల్లి కసరుకుంది. కానీ ఆ పసివాడు ఆకలితో అల్లాడిపోతూ ఏడుస్తూనే వున్నాడు. ఆ దృశ్యం చూసి చలించిపోయిన చిట్టెలుక వృద్ధురాలు తనకిచ్చిన ఆ చపాతీని పసివాడికి పెట్టింది.

సమయానికి తన బిడ్డ ఆకలి తీర్చినందుకు ఆమె ఎంతో సంతోషించి ఆమె ముచ్చటగా వున్న కూజాను చిట్టెలుక కిచ్చింది. చిట్టెలుక ఉల్లాసంతో కూజాను దొర్లించుకుంటూ 'దొర్లు దొర్లు కూజా! మంచిపని విలువ ఎప్పుడూ నీ ఎత్తు బంగారం చేస్తుంది అనిపాడుతూ సాగింది. కొంత దూరం వెళ్ళేసరికి ఒక నీటి గుంట దగ్గర ఒక చాకలి బట్టలు వుతుకుతూ కనిపించాడు. ఆ చాకలి తను భార్యతో మాట్లాడుతూ ఏదో విషయంలో గొడవపడి భార్యను కట్టెతో కొట్టాడు. ఆమె లబోదిబోమని ఏడుస్తూ మొత్తుకుంది. ఎలుక వాళ్ళ మధ్యకు వెళ్ళి గొడవపడకండి అని చెప్పి ఎందుకు ఆమె ఏడుస్తోంది! అని అడిగింది. చాకలి, నేను రోజూ బట్టలు నానబెట్టే కుండను మా ఆవిడ పగల గొట్టింది. అందుకని నాలుగు అంటించాను, అన్నాడు. ఎలుక మట్టి కూజాను చాకలి కిచ్చి, పాపం ఆవిడను

కొట్టకు. అసలే బలహీనంగా వుంది. కొట్టావంటే పడకేస్తుంది. తరువాత నీయిష్టం. యిదిగో ఈ కుండలో నీళ్ళు కాచి బట్టలు వుతుక్కో అంది.

చాకలి ఎలుక చేసిన సాయానికి ఎంతో సంతోషించి కృతజ్ఞతగా దానికో కోటు యిచ్చాడు. ఎలుక కోటు తీసుకుని గంతులేసుకుంటూ పాటపాడింది.

కోటు చలికాలంలో వెచ్చగా పెడుతుంది. కానీ దాని కన్నా మంచిపని యిచ్చే వెచ్చదనం విలువైంది, సాటిలేనిది.

ఎలుక కొంత దూరం సాగేసరికి ఒక గుర్రం మీద ఒకవ్యక్తి నీరసంగా చలికి వణుకుతూ కనిపించాడు. ఎలుక ఆశ్చర్యంగా, నీకు గుర్రాన్ని కొనడానికి డబ్బువుంది కానీ చలికి కోటు కొనడానికి డబ్బులేదా? అంది. దానికి ఆ వ్యక్తి మా అన్నదుర్మార్గుడు. నా ఆస్తినంతా దోచుకుని నన్ను కట్టుబట్టల్తో యింటినుండి తరిమేశాడు అన్నాడు.

తనకు చాకలి యిచ్చిన కోటును ఎలుక ఆ వ్యక్తికి యిచ్చింది. అతను సంతోషంతో కోటును వేసుకుని చలిబారి నుండి తప్పించుకున్నాడు. అతను గుర్రం దిగి, యీ గుర్రం అవసరం నాకు లేదు. నేను దగ్గర్లోనే వున్న పట్టణానికి నడిచే వెళతాను నువ్వీ గుర్రాన్ని తీసుకో అని ఎలుకకు గుర్రాన్ని యిచ్చాడు. ఎలుక ఆనందంగా గుర్రమెక్కి పాటపాడింది.

గుర్రం నిన్ను అంతు లేని వేగంతో

ఎంత దూరమైనా తీసుకెళుతుంది

అది గొప్ప సంగతే కానీ

మంచి పనికి సాటి ఐన గొప్ప విషయం

మరొకటి లేదు

కొంత దూరం వెళ్ళే సరికి ఒక పల్లకీ కనిపించింది. దాంట్లో పెళ్ళి కొడుకు అలంకారాలతో వున్నాడు. కానీ అతనిముఖం ఎందుకో దిగాలుగా కనిపించింది. ఎలుక చూస్తే నీ పెళ్ళి కాబోతున్నట్లుంది. మరెందుకు అంత దిగాలుగా వున్నావు? అంది.

ఎలుకా, నువ్వు సరిగానే చెప్పావు. సాయంత్రానికి నేను పెళ్ళి వారింటికి వెళ్ళాలి. వందమైళ్ళు ఈ పల్లకీలో వెళ్ళాలంటే వీలుపడదు, ఏం చెయ్యాలో తోచడంలేదు, అన్నాడు అప్పుడు ఎలుక 'ఇదిగో! ఈ గుర్రం తీసుకో, వేగంగా వెళ్ళు. ప్రస్తుతానికి దీని అవసరం నాకులేదు. అని గుర్రాన్ని యిచ్చింది. అతను గుర్రం మీదకు ఎగిరి కూచుని, నువ్వు చేసిన సాయం మరిచిపోను. ప్రస్తుతానికి నీకు యివ్వడానికి నాదగ్గర ఏమీలేదు. ఈ

మద్దెల వుంది తీసుకో, అని మద్దెల యిచ్చాడు.

ఎలుక మద్దెల వాయించుకుంటూ యీలా పాడుకుంది.

'నాకు వూరి చివర వంట చెరకు దొరికింది
దాన్ని ముసలావిడ కిచ్చాను
ఆమె నాకు చపాతీ యిచ్చింది
నేను చపాతీని కుమ్మరి కొడుక్కి యిచ్చాను
కుమ్మరి నాకు కుండనిచ్చాడు
అది నేను చాకలి కిచ్చాను
చాకలి నాకు కోటిచ్చాడు
కోటును గుర్రం పై వ్యక్తికిచ్చాను
అతను నాకు గుర్రాన్నిచ్చాడు
పెళ్ళి కొడుకు నాకు మద్దెల నిచ్చాడు
మద్దెల పై మజాగా వాయిస్తూ పాటపాడాను!

# 13 తెలివితక్కువవాడు

అల్మోరా జిల్లాలోని ఒక గ్రామంలో భూలువా అన్న అమాయకుడు, తెలివితక్కువ వాడు వుండేవాడు. అతని భార్య ఒకరోజు అతన్తో, పుట్టింటికి వెళ్ళి మా చెల్లెల్ని తీసుకురా అంది.

సాయంత్రం అన్నీ సిద్ధంచేసుకుని వుంటే పక్కింట్లోని అతని చిన్నాన్న వచ్చి 'ఎక్కడి వెళుతునావు? అన్నాడు. భూలువా మా మామగారి యింటికి వెళ్ళి మా మరదల్ని తీసుకురావడానికి వెళుతున్నాను. అన్నాడు.

అతని చిన్నాన్న. నువ్వసలే తెలివి తక్కువవాడివి. మామగారి యింట్లో మర్యాదగా నడచుకో. లేకుంటే యిబ్బందు లెదుర్కొంటావు అన్నాడు. భూలువా, 'అయితే నేను ఏం చేయాలి'? అన్నాడు.

చిన్నాన్న, నువ్వు దారిలో ఎవర్నయినా కలిస్తే పెద్దగొంతుతో, నమస్తే, అని చెప్పు మామగారి యింటికి వెళితే అవసరానికి మించి ఎక్కువ మాట్లాడకు. కేవలం అవును, కాదు అని సందర్భాన్ని బట్టి మాట్లాడు అన్నాడు.

భూలువా, సరేనని చెప్పి ప్రయాణానికి సిద్ధపడ్డాడు. భూలువా ప్రయాణిస్తున్నాడు. గ్రామందాటి నిశ్శబ్దంగా వున్న దారి గుండా వెళుతున్నాడు. అక్కడ ఒక పెద్ద చెట్టుకు ఒక వేటగాడు వలవేశాడు. క్షణంలో వలను లాగేవాడు. గుంపుగా పిట్టలు వాలబోయాయి. అతన్ని చూసిన భూలువా, పెద్ద స్వరంతో 'నమస్తే' అని అరిచాడు. ఆ అరుపుకి వేటగాడు వులిక్కిపడ్డాడు. వలలో వాలబోయిన పిట్టలు ఒక్కసారిగా చెల్లా చెదరయ్యాయి. దాంతో నోటిదగ్గర తిండి లాగేసినట్లు ఆగ్రహించి భూలువాను పట్టుకుని వాయగొట్టాడు. ఒళ్ళు హూనం చేశాడు. 'ఒరే ! బుర్రలేని వెధవా! నా కడుపు కొట్టావు కదరా! పిట్టలు మళ్ళీ ఎప్పుడు వాలుతాయో ఏమో, అన్నాడు. భూలావా, మనుషులు కనిపిస్తే యిట్లా మర్యాదగా పలకరించమని మా చిన్నాన్న చెప్పాడు. యిలా కాదనుకుంటా. ఐతే మరి ఎలా చెప్పాలి? అని అడిగాడు. వేటగాడు వస్తూ వున్నావంటే దొరికిపోతావు అను అన్నాడు.

భూలువా కొంత దూరం నడిచాకా ఎదురుగా ఒక దొంగలగుంపు వచ్చింది. వారిని

చూసి భూలువా, వస్తూవున్నావంటే దొరికిపోతావు అన్నాడు. దొంగల గుంపు అతన్ని పట్టుకుని చితకబాదేసింది. భూలువా ఏడుస్తూ 'నేను ఏమని చెప్పాలో మీరే చెప్పండి' అన్నాడు.

'ఆగకుండా తీసుకొచ్చి ఎత్తి పెట్టండి అనాలి' అన్నారు భూలువా ముందుకు సాగాడు. ఎదురుగా శవయాత్ర వచ్చింది. 'ఆగకుండా తీసుకొచ్చి ఎత్తిపెట్టండి' అన్నాడు. మరణించిన వ్యక్తిని అవమానంచేసినట్లు భావించి శవయాత్రలో జనం భూలువాను కొట్టారు. భూలువా 'అయ్యా! పొరపాటయింది. నేను ఏమని చెప్పాలో మీరే చెప్పండి. అన్నాడు. జనం మళ్ళీ యిట్లా జరగదు అని చెప్పు అన్నాడు.

భూలువా సాగాడు. ఎదురుగా ఒక పెళ్ళి వూరేగింపు ఎదురయింది. వాళ్ళని చూసి మళ్ళీ యిట్లా జరగదు, అన్నాడు. జనం చితకబాదారు. దాంతో మళ్ళీ భూలువా ఎవర్నీ ఏ సలహా అడగలేదు. అత్తగారింటికి వచ్చాడు. అత్తగారు అల్లుడికి మర్యాదలు చేసి 'అంతా క్షేమమేనా' అంది భూలువా అవును, అన్నాడు.

'మా అమ్మాయి బావుందా? అని అడిగింది

భూలువా లేదు అన్నాడు. ఆమె ఆదుర్దాగా, ఆరోగ్యం బాగాలేదా? అంది. అవును అన్నాడు. కోలుకుంటోందా? అంది. లేదు అన్నాడు.

ఆమె ఆందోళనతో చనిపోయిందా? అంది. భూలువా అవును అన్నాడు. అల్లుడి మాటల్తో అత్తగారు స్పృహతప్పి పడిపోయింది. అందరూ వచ్చి ఆమె ముఖం మీద నీళ్ళు చల్లారు. ఆమె లేచి, నా అల్లుడు నా కూతురు చావు కబురు తెచ్చాడు అంది ఏడుస్తూ. కానీ మామగారు ఆ మాటల్ని విశ్వసించలేదు. ఒక రోజు గడిచాకా కూతురు రాసిన వుత్తరం క్షేమ సమాచారాల్తో అందింది. అప్పుడు మామ భూలువాని, మా అమ్మాయి చనిపోయిందా?

భూలువా, లేదు, అన్నాడు

అందరూ వూపిరి పీల్చుకున్నారు!

# 14 మంత్రాల మంచం

పూర్వం ఒకప్పుడు శీతల్ అన్న పేరున్న వడ్రంగి వుండేవాడు. కానీ అతను ఏపనీ చేసేవాడు కాదు. ఫలితంగా అతని కుటుంబం ఆకలితో అల్లాడేది. ఒకరోజు అతని తల్లి, నాయనా! నువ్వు వీసవంత పని చేయవు పైసా సంపాదించవు. ఎట్లా బతుకుతాం? నేనంటే ముసలిదాన్ని. వున్నా లేకున్నా ఒకటే. కానీ నీకు భార్య, కొడుకు వున్నారు. వాళ్ళని చూడు. తిండిలేక అల్లాడుతున్నారు. నీ బద్ధకం వదిలి ఏదయినా అర్థవంతమయిన పనిచేయి అంది.

శీతల్ సున్నితమయినవాడు. తల్లిమాటలు అతని గుండెల్ని తాకాయి అంతే అతను రాత్రింబవళ్ళు శ్రమించి, తన పనితనమంతా ప్రదర్శించి ఒక మంత్రాల మంచాన్ని తయారుచేశాడు. నాలుగు మంచం కోళ్ళ స్థానంలో నలుగురు సైనికుల్ని చెక్కాడు. చిత్రమెక్కడంటే అవి మనుషుల్లా నడుస్తాయి. మనుషుల్లా మాట్లాడతాయి.

శీతల్ తన మంచాన్ని రాజు అంతఃపురం ముందుకు తీసుకుపోయి పెట్టి అరవడం మొదలు పెట్టాడు.

మేలుకున్నవాడే ఏదయినా అందుకుంటాడు

నిద్రపోయినవాడు చేజార్చుకుంటాడు

మంత్రాల మంచాన్ని కొను

అద్భుతాల మంచాన్ని అందుకో!

అతని మాటలువిని రాజు వచ్చి ఆ మంచాన్ని చూశాడు. అద్భుతంగా చెక్కిన ఆ మంచాన్ని చూసి ఆనందించి ఎంతకమ్ముతావు? అన్నాడు.

రాజుగారూ ! నాకు ఏమీ వద్దు, యిది మీకు నచ్చితే ఉపయోగించండి. నేను దగ్గర్లోనే వున్న వడ్రంగిని. మీకు ఈ మంచం సంతృప్తి కలిగిస్తే మీకు మనసయినంత ఎప్పుడయినా యివ్వండి అనియింటికి వచ్చాడు.

తల్లి రాజుగారి దగ్గర్నించీ పెద్దఎత్తున ధనం తెస్తాడని ఆశగా ఎదురు చూస్తూ వుంటే ఖాళీ చేతులూపుకుంటూ వచ్చిన కొడుకుని చూసి నిరాశపడింది. 'ఏమయింది?

రాజు ఏమీ యివ్వలేదా? అంది. శీతల్, అమ్మా! మొదట మీరు మంచం వుపయోగించండి. నచ్చితే మీకు తోచినంత యివ్వండి, అని రాజుగారితో చెప్పాను అన్నాడు. తల్లి అతని నిరాడంబరతత్వానికి నవ్వి, నాయనా! రాజుల చిత్తం మాకుల నీడలాంటిది. వాళ్ళు ఒకసారి సంతోషంగా, ఒకసారి కోపంగా వుంటారు. వాళ్ళు ఎప్పుడు ఎట్లా వుంటారో దేవుడికి ఎరుక. నువ్వొక విషయం గుర్తుంచుకోవాలి, పొదల్లోని రెండు పిట్టలకన్నా గుప్పెట్లోని ఒక పిట్టమేలు అంది. శీతల్, అమ్మా! యిప్పుడు మంచం రాజు దగ్గర వుంది. దాన్ని తిరిగి తీసుకు రాలేను. అంతా మంచే జరుగుతుందని ఆశిద్దాం అన్నాడు.

రాజు మంచాన్ని తన పడకగదిలో వేసుకుని దానిపై పడుకున్నాడు. కానీ నిద్రపోలేదు. ఏవో రాజ్యానికి సంబంధించిన సమస్యలతో ఆలోచనల్తో మనసు అల్లకల్లోలమైంది. అర్థరాత్రిగడిచింది. మంచం నించీ ఒక సైనికుడి బొమ్మ పక్కకు వచ్చి తక్కిన ముగ్గురు సైనికుల బొమ్మల్తో మీరు ముగ్గురూ ఈ రాత్రికి మంచాన్ని అంటిపెట్టుకు వుండండి. నేను రాజ్యంలో తిరిగి ఎవరు సంతోషంగా వున్నారో ఎవరు బాధలు పడుతున్నారో తెలుసుకుని వస్తాను, అన్నాడు. ముగ్గురు సైనికులు, సరే! మేము మంచాన్ని భరిస్తూ యిక్కడే వుంటాం వెళ్ళిరా! అన్నారు.

సైనికుడు రాజభవనాన్ని వదిలి నగరంలోకి వచ్చాడు. బయట అతనికి ఒక రాక్షసుడు కనిపించాడు. ఆ రాక్షసుడు అరుస్తూ పోతున్నాడు. సైనికుడు, ఎందుకు అరుస్తున్నావు? అన్నాడు. రాక్షసుడు, నేను లెక్కలేనంతమంది జంతువుల్ని, మనుషుల్ని తిన్నాను. యిప్పుడు రాజును తినడానికి వెళుతున్నాను అన్నాడు.

సైనికుడు, నేను రాజు అంగరక్షకుణ్ణి, మొదట నువ్వు నన్ను ఎదురించాలి. నన్ను గెలిచిన తరువాత నువ్వు రాజును సమీపించగలవు అన్నాడు. రాక్షసుడు సైనికుడి మీదకు లంఘించాడు. ఇద్దరికి మధ్య బలమైన ఘర్షణ జరిగింది. చివరికి సైనికుడు రాక్షసుణ్ణి ముక్కలు చేశాడు. తరువాత వెళ్ళి మంచంలో తన స్థానంలో నిలబడ్డాడు.

మంచంలోని రెండో సైనికుడు మొదటి సైనికుడితో నువ్వు బయటికి వెళ్ళినపుడు ఏం జరిగింది చెప్పు అని అడిగాడు. మొదట సైనికుడు, దేశాన్ని అల్లకల్లోలం చేసిన రాక్షసుణ్ణి యిప్పుడే చంపివచ్చాను. అతను రాజును చంపి తింటానని బయల్దేరేసరికి నాకు ఆగ్రహం కలిగి వాణ్ణి వున్న ఫళంగా చంపి వచ్చాను, అన్నాడు.

ఆ మాటల్తో వులిక్కిపడిన రాజు తన సేవకుల్ని బయటికి పంపి విషయం తెలుసుకుని రమ్మన్నాడు. సేవకులు నగరంలో రాక్షసుడి శవం పడివున్న సంగతి వివరించాడు.

మరుసటిరోజు పొద్దున్నే రాజు శీతల్‌ని పిలిపించి ఒక బండినిండుగా బంగారు, వజ్రాలు నింపి పంపాడు, నిజానికి నీ మంత్రాల మంచానికి నేను విలువ కట్టలేను. నా తృప్తికోసం యివి స్వీకరించు అన్నాడు.

రెండోరోజు రాత్రి మంచంపై రాజు పడుకున్నాడు. అంతకు ముందు రాత్రి జరిగిన సంఘటనతో ఆశ్చర్యపోయిన రాజు ఉద్దేశపూర్వకంగా మేలుకుని ఏం జరుగుతుందో అని ఎదురుచూశాడు.

అర్థరాత్రి పన్నెందు గంటలయింది. రెండో సైనికుడు మంచం నుండి వేరయి కనిపెట్టి వుండండి. నేను నగరంలో పర్యటించి వస్తాను అన్నాడు. రెండో సైనికుడు ఖడ్గం చేతబట్టి వెళ్ళాడు. వెళ్ళబోయే ముందు అక్కడ వదిలిన రాజుగారి పాదరక్షల్ని చూశాడు. వాటిపై ఒక కాలనాగు బుసకొడుతూ చుట్టుకుని పడి వుండడం చూశాడు. వెంటనే తన కత్తితో దాన్ని ముక్కలు ముక్కలు చేసి తిరిగి తన చోటుకి చేరాడు. మొదటి సైనికుడు, అప్పుడే వచ్చేశావే. యిప్పుడే కదా నువ్వు వెళ్ళింది అన్నాడు. రెండో సైనికుడు, నేను వెళ్ళబోయేంతలో రాజుగారి పాదరక్షలపై కాలనాగును చూశాను. దాన్ని ముక్కలు ముక్కలు చేసి వచ్చాను అన్నాడు.

మొదటి సైనికుడు, నువ్వు రాజుగారి ప్రాణం కాపాడావు అంది. రాజు పడక దిగి దీపం పట్టుకుని చూస్తే చచ్చిపడిన పాము కనిపించింది ఉదయాన్నే రెండు బళ్ళ ధనరాసుల్ని శీతల్ యింటికి పంపాడు.

మూడోరోజు రాత్రి. మూడో సైనికుడి వంతు నగరంలో తిరుగుతూ వుంటే నలుగురు దొంగలు రాజుగారి కోశాగారాన్ని దోచుకోవడానికి పథకం వెయ్యడం చూశాడు. ఒకడు బయట వుండి ముగ్గురు కన్నం వేసిలోపలికి వెళ్ళారు. ధనాన్ని సంచుల్తో నింపి వాళ్ళు బయటికి వచ్చేంతలో కావలివున్న వాణ్ణి చంపి ఖడ్గంతో దారి కాచి బయటికి వచ్చిన తక్కిన ముగ్గుర్నీ చంపేసి వెళ్ళి మంచం కోడులో కుదురుకున్నాడు. నాలుగోమిత్రుడు అడిగితే జరిగిని విషయం చెప్పాడు. రాజు సేవకుల్ని పంఎి విచారించాడు. అక్కడ దొంగల శవాలు కనిపించాయి. రాజు సంతోషించి మూడు బండ్ల నిండుగా ధనధాన్యాల్ని శీతల్ యింటికి పంపాడు.

నాలుగో తేది రాత్రి యధాతథంగా రాజు మేలుకొని జరగబోయేది తెలుసుకోడానికి ఉత్సాహంగా వున్నాడు. రాజుకు శీతల్ చెప్పిన మాటలు గుర్తుకొచ్చాయి

'మేలు కొన్నవాడు ఏదయినా సాధిస్తాడు

నిద్రపోయినవాడు అన్నీ చేజార్చుకుంటాడు

అంతలో నాలుగో సైనికుడు మంచం నించీ బయటికి వచ్చి బయటికి వెళ్ళ బోయాడు. కిటికీ నించీ ఎవరో అపరిచితుడు ఆయుధగారమై పడగగదిలోకి దూకబోయాడు. నాలుగో సైనికుడు అతన్ని ఎదుర్కొని 'ఎవరు నువ్వు? అన్నాడు. నీకెందుకు? నీ దారంటా నువ్వు వెళ్ళు, రాజు మాకు దాయాది. అతన్ని మా దారినించీ తప్పించాలి. అతన్ని చంపడానికి వచ్చాను అన్నాడు. నాలుగో సైనికుడు, అలా అయితే దొంగలా రావడమెందుకు? బహిరంగంగా సవాలు విసరవచ్చుకదా! అన్నాడు. దాంతో అపరిచితుడు, ఆగ్రహించి, మొదట నిన్ను చంపుతాను, అని నాలుగో సైనికుడి మీదకు ఎగబడ్డాడు. నాలుగో సైనికుడు అపరిచితుడితో తలపడ్డాడు. చాలా సేపు యుద్ధం చేశాకా చివరకు నాలుగో సైనికుడు అపరిచితుణ్ణి మట్టుపెట్టాడు.

తరువాత మంచంలో యధా స్థానానికి చేరి తనుచేసిన పనిని తక్కిన ముగ్గురు సైనికులతో చెప్పాడు. జరుగుతున్నది కళ్ళముందు చూసిన రాజు మహదానందం పొందాడు.

తెల్లవారాకా రాజు శీతల్‌ని పిలిపించి, నేను నీరుణాన్ని తీర్చుకోలేను. నువ్వు అమర్చిన నలుగురు సైనికులు నన్ను, నా రాజ్యాన్ని రక్షించారు. నువ్వు నాతో బాటు వుండు. నా ముఖ్యమంత్రిగా నిన్ను నియమిస్తున్నాను అని శీతల్‌ని రాజు కౌగిలించాడు, శీతల్ ఇంటికి వెళ్ళి ఆ వార్తని తన తల్లికి భార్యకు వివరించాడు.

# 15 తెలివయిన నక్క

ఒక నక్క భార్యా పిల్లల్తో ఒక చెట్టు కింద నివసించేది. దానికి దాని కుటుంబానికి ఒక నిలకడ అయిన స్థలం వుండేది కాదు. అన్ని అనుకూలాలు వున్న యిల్లు లేక పిల్లలు చలికి అల్లాడుతూ వుండేవాళ్ళు. ఎక్కడ వెతికినా సరయిన వసతి దొరకలేదు.

అందుకని నక్క తండ్రి దగ్గరకు వెళ్ళి, నాన్నా! నీ కోడలు, మనుమలు చలికి అల్లాడుతున్నారు. ఎక్కడయినా మంచి యిల్లు కట్టి పెట్టు, అన్నాడు. నక్క తండ్రి తప్పకుండా త్వరలో అడవిలో మీకు మంచి యిల్లు కట్టియిస్తాను, అన్నాడు. నక్క తండ్రి బద్ధకస్తుడు, సోమరిపోతు. ఎప్పుడు నిద్రపోతూ వుండేవాడు. ఎన్నాళ్ళయినా ఏ పనీ  చెయ్యలేదు.

నక్కతండ్రి, దగ్గరికి వెళ్ళి మమ్మల్ని యిలా చలిలో చంపుతావా? మాకు యిల్లంటూ కట్టివ్వవా? అంది.

నక్కతండ్రి, నేను అడవిలో పునాదులు తవ్వి పెట్టాను. ఐతే వర్షం వచ్చి ఆ పునాదులు పూడిపోయాయి అని నసిగింది.

ఆ సంగతి నక్క భార్యతో చెబితే నక్క భార్య, నన్నూ నా పిల్లల్ని చలికి చంపుకునే దాకా నీకు నిద్రపట్టదు అని నిష్ఠూరాలాడింది.

ఈ బాధలు భరించలేక తమకో యింటికోసం వెతుకుతూ నక్క అడవి లోకి వెళ్ళింది. అడవిలో ఒక పులి గుహచూసింది. పులి ఆ సమయంలో వేటకు వెళ్ళింది. నక్క గుహలోకి వెళ్ళి చూసింది. ఎంతో వెచ్చగా, హాయిగా వుంది. ఏమైతే కానీ అదే తమయిల్లు అనుకుని నక్క భార్యా పిల్లల్ని ఆ గుహకు తీసుకొచ్చింది.

భార్యాపిల్లలు ఆ గుహను చూసి యిష్ట పడ్డారు. నక్క వాళ్ళకు ముందుగా కొన్ని ముందు జాగ్రత్తలు చెప్పింది.

నేను గుహముందు వుంటాను. నేను ఒకకాలు ఎత్తిసైగ చేసినపుడు నువ్వు పిల్లల్ని కరిచినట్లు నటించాలి అన్నాడు. సరేనంది. భార్యా పిల్లల్తో మీరు మీ అమ్మ కరిచినట్లు చేస్తే మీరు ఏడుపు మొదలు పెట్టండి. అప్పుడు మీ అమ్మ, ఎందుకు ఏడుస్తున్నారని అడుగుతుంది. మీరు మాకు నిన్నటి మాంసం వద్దు. తాజా తాజా పులి మాంసమయితే

ఫరవాలేదా?అంటుంది. మీరు, సరేననాలి అంది.

అట్లా భార్యా పిల్లలకు ముందు జాగ్రత్తలు చెప్పింది. అంతలో బయట వేట నిమిత్తం వెళ్ళిన పులి తన గుహ ముందుకు వచ్చింది. అది చూసి అక్కడున్న నక్క తన కాలు ఎత్తింది. వెంటనే నక్క భార్యాపిల్లల్ని కరిచింది. పిల్లలు ఏడవడంతో ఎందుకు ఏడుస్తున్నారంది.

పిల్లలు మాకు తాజా మాంసం కావాలన్నాయి తల్లి అయితే పులిమాంస మయితే ఫరవాలేదా? అంది ఆ మాటలు విని పులి హడలిపోయింది. ఏవో వింత జంతువులు గుహలో నాకోసం ఎదురు చూస్తున్నట్టున్నాయి. బతికివుంటే బలుసాకు తినవచ్చని ఒక గెంతుగెంతి అడవిలోకి పారిపోయింది. మళ్ళీ ఎప్పుడూ అటువేపే రాలేదు.

నక్క తన కుటుంబంతో పులిగుహలో నిర్భయంగా జీవించింది.

# 16 తుఫాన్

పూర్వం ఒక అడవిలో ఒక వృద్ధురాలు నివసించే, ఆమెతో బాటు ఆమె కొడుకు వుండేవాడు. అతను అడవిలో గొర్రెల్ని మేపేవాడు. ఇంటివెనక పశువుల కొట్టంలో గొర్రెల్ని రాత్రిళ్ళు వుంచేవాళ్ళు.

ఆ సాయంత్రం తల్లి వున్నట్టుండి కొడుకు పిలిచి ' నాయనా జాగ్రత్త! తుఫానురాబోతుంది అంది.

అప్పటిదాకా పశువుల కొట్టంలో గొర్రెను వేటాడ్డానికి వచ్చిన ఒక చిరుతపులి ఆ మాటలు విని భయపడిపోయింది. ఎందుకంటే అప్పటిదాకా అది తుఫాన్ అన్న మాటను ఎప్పుడూ వినలేదు. అందుకని అదేదోగొప్ప జంతువో, దయ్యమో అనుకుని ఎక్కడ తనమీద దాడి చేస్తుందో అని పశువుల కొట్టంలో గొర్రెల మధ్యే దాక్కుంది.

చీకటి పడింది. గొర్రెను దొంగలించడానికి వచ్చిన దొంగలు చీకట్లో తడిమి చేతికి తగిలిన చిరుతపులిని కట్టి పెట్టారు. చిరుతపులి మనసులో తుఫానే మెదులుతోంది. దొంగలు తెల్లవారాకా వచ్చి గొర్రెను పట్టుకుపోదామని తెలతెలవారుతుండగా వచ్చారు. చూస్తే అది గొర్రెకాదు, చిరుతపులి. వాళ్ళు భయపడి పారిపోయి ఒక చెట్టు తొర్రలో నక్కారు. చిరుతపులి ఎక్కడదాడి చేస్తుందో అని భయపడ్డారు.

చిరుతపులి వేరే ఆలోచనల్తో దొంగల వెంటబడడం మాని అడవిలోకి వెళ్ళింది. అడవిలో పరిగెడుతూ వుంటే దారిలో ఒక ఎలుగుబంటి ఎదురయింది. అది చిరుతపులితో, మిత్రమా! ఏమైంది? ఎందుకంత వేగంగా పరిగెడుతున్నావు! ఎవరయినా శత్రువు నీ వెంటబడ్డాడా? అంది.

చిరుతపులి పరిగెడుతూనే, నేను తుఫాను నించీ తప్పించుకోవడానికి పరిగెడుతున్నాను. యిప్పటికే వెంట్రుకవాసిలో దాని నుండి ప్రాణాపాయం నుండి తప్పించుకున్నాను అంది.

ఎలుగుబంటి, నువ్వెందుకంత భయపడతావు నేను పెద్దపెద్ద జంతువుల్నే చంపాను. ఆ 'తుఫాన్‌ను నాకు చూపు దాంతో తలపడతాను' అంది.

పరిగెడుతున్న చిరుతపులి ఆగి, అయితే నాతో బాటురా నీకు తుఫాన్ ని చూపుతాను, అని వెనుదిరిగి చెట్టు తొర్ర దగ్గరికి వెళ్ళి దాంట్లో చూపింది. అసలు అందులో ఏముందో తెలుసుకోవడానికి ఎలుగుబంటి చెట్టెక్కి తన తోకని ఆ తొర్రలోకి వదిలింది. తొర్రలో దాక్కున్న దొంగలు ముగ్గురు కలిసి ఎలుగ్గొడు తోకని బలంగా లాగారు. ఎలుగుబంటి భయపడిపోయి చెట్టును గట్టిగా పట్టు కుంది. శక్తివంచన లేకుండా దొంగలు తోకను లాగారు. ప్రాణభయంతో గోళ్ళతో ఎలుగుబంటి చెట్టును పట్టుకుంది. ఈ ఘర్షణలో దాని తోక వుండి దొంగలచేతికి వచ్చింది. చచ్చాన్రా దేవుడా, అనుకుని ఎలుగుబంటి చిరుతపులితో కలిసి కాలికి బుద్ధి చెప్పింది.

ఆ రెండూ పరిగెడుతూ వుంటే దారిలో వాటికి ఒకపులి ఎదురైంది. అది ఆ రెంటీనీ చూసి, ఎక్కడికంత వేగంగా పరిగెడుతున్నారు. మీ ముఖాల్ని చూస్తే మీరు ఎంతో ఆందోళనలో, భయంలో వున్నట్లున్నారు. దేనివల్లా భయపడు తున్నారు అంది.

అవి, యిదంతా తుఫాను తెచ్చిన ముప్పు దానివల్ల మేము ప్రశాంతంగా వుండలేకపోతున్నాం. అది ఏక్షణంలోనయినా మమ్మల్ని పట్టుకోవచ్చు అందుకని పరిగెడుతున్నాం అన్నాయి.

పులి నవ్వి, నేను ఎన్నో ఏళ్ళ నించీ ఈ అరణ్యంలో వున్నాను. నేను యిప్పటిదాకా ఆ తుఫాన్‌ను ఎప్పుడు చూడలేదు. అది ఎలావుంటుందో కాస్త చెబుతారా? అంది.

చిరుతపులి ఎలుగుబంటి తోక తెగినవిషయం చెప్పి, బహుశా అది ప్రతిదాన్నీ లాగేసేదనుకుంటాను అంది

'సరే మీకు దాన్ని నాకు చూపించండి దాని పని పడతాను ' అంది ముగ్గురు కలిసి చెట్టు తొర్ర దగ్గరకు వెళ్ళారు.

మూడు జంతువులు చెట్టు దగ్గరకు రావడం చూసి దొంగలకు ముచ్చెమటలు పట్టాయి. ముగ్గురూ భయంతో చెట్టెక్కి చివరికొమ్మ చేరారు. పులి చెట్టు తొర్రకేసి రాబోతోంటే ఒకదొంగ పట్టుజారి దాని వీపుపై పడ్డాడు. దాన్ని గట్టిగా పట్టుకున్నాడు. అది దయ్యమనుకున్నాడు. దాంతో భయపడి పులి పరుగులంకించుకుంది. దార్లో పట్టు జారిదొంగ దొర్లుకుంటూ పొదల్లోకి వెళ్ళాడు. మూడు జంతువులూ కొంతదూరం పరిగెత్తి బతికి వున్నందుకు ఒకదాన్నొకటి అభినందించుకున్నాయి. పులి, తుఫాన్ అంటే లాగేది కాదు, స్వారీ చేసే జంతువు అని తీర్మానించింది. ఎలుగుబంటి దాంతో వాదించలేదు. మూడు జంతువులు బతుకుజీవుడా అనుకుంటూ వెళ్ళాయి.

# 17 కుండెడు నెయ్యి

ఆ కుర్రాడిపేరు షేక్‌చిల్లి. ఒకరోజు అతని తల్లి ' అబ్బాయ్ ' నువ్వు వెళ్ళి ఏదయినా పనిచేసి బతుకు. నీ కాళ్ళమీద నువ్వు నిలబడు అంది షేక్‌చిల్లి. తన కాళ్ళను చూసుకుని అమ్మా యివి నాకాళ్ళే. ఎవరికాళ్ళో కావు, అంటే నా కాళ్ళమీదే నేను నిలబడ్డాను, అన్నాడు.

మరుసటి రోజు చిల్లి పనికోసం వీధులు తిరిగాడు ఒక షాపు దగ్గర ఆగి సేటుని చూశాడు. ఆ సేటు, యిక్కడెవరయినా పనివాళ్ళు దొరుకుతారా? అని అడిగాడు. చిల్లి, చెప్పండి. ఏం చెయ్యాలి? అన్నాడు.

సేటు, ఈ నేతికుండను మాయింటిదాకా మోసుకొస్తే రెండు పైసలిస్తాను, అన్నాడు. తక్కువయినా మొదటిసారి గనక చిల్లి అంగీకరించాడు.

మొదట సేటు, వెనక చిల్లి నడుస్తున్నారు, చిల్లి తలపై నేతి కుండవుంది. చిల్లి ఆలోచనలో పడ్డాడు. ఇది తన మొదటి సంపాదన. రెండు పైసలే కావచ్చు. దాంతో ఒక కోడిగుడ్డు కొని పెట్టకింద పొదగడానికి వుంచితే అది పొదుగుతుంది. అది పెద్దదయి గుడ్లు పెడుతుంది. వాటిని అమ్మి కోళ్ళు కొంటాను. అట్లా పెద్ద కోళ్ళ ఫారాలు కొంటా. వేల కోళ్ళతో సంపన్నుడవుతాడు. ఆ లాభాలతో ఆవులు కొంటాడు. పొలాలు కొంటాడు సంపన్నుడవుతాడు. వ్యవసాయం భారీ ఎత్తున చేస్తాడు. పాలవ్యాపారం కూడా భారీ ఎత్తున చేస్తాడు. దాంతో లాభాలే లాభాలు.

దాంతో వూళ్ళో తను గొప్ప సంపన్నవర్గానికి చెందిన వాణ్ణవుతాడు. గొప్ప నవాబు తన కూతుర్నిచ్చి పెళ్ళి చేస్తాడు. నన్ను చూడడానికి రాజులు, మహరాజులు వస్తారు. వీళ్ళందరికీ వసతి సౌకర్యాలు కావాలంటే, మామూలు యిల్లు సరిపోదు. పెద్ద భవనం కట్టాలి. దాన్ని జాగ్రతగా పర్యవేక్షించాలి. తలుపులు, కిటికీలు, వజ్రాల తాపడం చేసినవయి వుండాలి.

దేశం నలుమూలల నించీ జనమంతా నా భవనాన్ని చూడడానికి తీర్థయాత్రికుల్లా తరలి రావాలి. అది చూసి నేను చిరునవ్వు నవ్వాలి అంటూ కలలలోకంలోకి వెళ్ళిపోయాడు.

అంతలో ఒక అరటితొక్క మీద కాలువేసి ధబీమని కింద పడ్డాడు. నేతి కుండ

ముక్కలై నేయి నేల పాలయింది.

శబ్ధానికి సేటు, వెనక్కి తిరిగి లబోదిబోమన్నాడు. తననేయంతా నేలపాలయిందిని మొత్తుకున్నాడు.

చిల్లి ఆపవయ్యా! సేటూ! నువ్వొక నేతి కుండ పగిలినందుకే మొత్తుకుం టున్నావు. నాకు కోళ్ళ ఫారాలు, అందమైన భార్య, పొలాలు, ఆవులు, రాజభవనం, రాజులు, మహారాజులు అందరూ క్షణంలో అదృశ్యమయ్యారు. నా పరిస్థితి ఎవరితో చెప్పకోను అన్నాడు.

సేటు, ఆశ్చర్యపడి విషయమడితే తను కలగనినవన్నీ చిల్లి పూసగుచ్చి చెప్పాడు.

సేటు తల పట్టుకుని పిచ్చివాణ్ణి పనిలో పెట్టుకున్నానే అనుకున్నాడు!

# 18 బ్రహ్మకన్వాల్

ఇంద్రసభలో దేవతలందరూ సమావేశమై దీపావళి పండుగను ఘనంగా జరుపుకోవాలని నిర్ణయించారు. అది దంతపు ఏనుగుబొమ్మ ద్వారకలోవున్న కృష్ణుని దగ్గరవుంది. వాయుదేవుడు వెళ్ళి ఆ దంతపు బొమ్మను తీసుకొస్తే మనం లక్ష్మీదేవి పూజ ప్రారంభించవచ్చు, అన్నాడు

ఇంద్రుడి ఆజ్ఞమేరకు వాయుదేవుడు ద్వారకానగరాన్ని వెళ్ళాడు. కృష్ణమందిరంలో అడుగుపెట్టాడు. రాజులు సామంతునితో కృష్ణుడు కొలువుదీరి వున్నాడు. వాయుదేవుడు నమస్కరించి ఇంద్రుడు పంపిన పని వివరించాడు. కృష్ణుడు, మంచిది కానీ పొరపాటు ఎక్కడ జరిగిదంటే రుక్మిణీదేవి ఆ బొమ్మను ఎక్కడో పెట్టి మరచిపోయింది అన్నాడు

వాయుదేవుడు, స్వామీ! దేవలోకంలో లక్ష్మీదేవి పూజకు ముందు ఆ దంతపు బొమ్మతో పాచికలాడందే కార్యక్రమం ముందుకు సాగదు మీరే ఏం చెయ్యాలో మనవి చేయండి, అన్నాడు

కృష్ణుడు కాసేపు ఆలోచించి, నువ్వు చెప్పింది నిజమే. ఏదయినా మార్గం వెతకాలి. అవును. గుర్తొచ్చింది. కామరూప దేశంలో మోతీమాల అన్న రాణివుంది. ఆమె దగ్గర నా దగ్గరున్న దంతపు బొమ్మలాంటిది వుంది. కానీ ఆమె తనతో ఎవరయినా సరే పాచికలాడందే అది యివ్వడానికి అంగీకరించదు. అంతేకాదు ఆటలో ఓడిపోయిన వాళ్ళను బానిసలుగా చేసుకుంటుంది. అందుకని ఎవరూ కామరూప దేశానికి వెళ్ళి మోతీమాల దగ్గరున్న దంతపు బొమ్మను తీసుకొస్తారా? అని అడిగాడు

సభంతా నిశ్శబ్దంగా మారిపోయింది. అక్కడికి వెళ్ళడానికి ఎవరూ సాహసించ లేదు. కృష్ణుడు వాయుదేవునితో 'సరే! రేపటిదాకా చూద్దాం. ఎవరూ ముందుకు రాకుంటే నేనే వెళ్ళి ఆ దంతపు బొమ్మను తీసుకొస్తాను. అప్పటిదాకా నువ్వు మా అతిథిగా వుండు అన్నాడు

ఆ రోజు సాయంత్రం కృష్ణుని పెద్ద తమ్ముడయిన బ్రహ్మకన్వాల్ తన వదిన ఐన రుక్మిణితో బాటు నడుస్తూ ఆమెను ఆటపట్టించాలనుకుని హఠాత్తుగా, మ్యావ్ అన్నాడు. దాంతో రుక్మిణి వులిక్కిపడింది. అతను ' వదినా! ఈ మాత్రానికే భయపడ్డావా? అన్నాడు

రుక్మిణి, నన్ను అంటున్నావు కానీ కామరూపదేశానికి వెళ్ళి మోతీమాల భవనంలో ప్రవేశించి దంతపు బొమ్మను ఒక స్త్రీ దగ్గరనించీ తీసుకొచ్చే దమ్ములేదు గానీ మాటలు మాత్రం కోటలు దాటుతాయి అంది.

దాంతో బ్రహ్మకన్వాల్ మనసు గాయపడింది. ఏమైనా కానీ తను వెళ్ళి పనిని సాధించుకొస్తానని దృఢనిశ్చయాన్ని సభలో ప్రకటించాడు. కృష్ణుడు తమ్ముణ్ని ఆపడానికి ప్రయత్నించాడు కానీ తమ్ముడు వినలేదు.

మోతీమాల భవనం ముందు ఒక డ్రమ్ముంది. గోడకు ఒక ప్రకటన అంటించి వుంది. ఆ ప్రకటన ఏమంటే, ఎవరయితే రాణితో పాచికలు ఆడదలచుకుంటారో వాళ్ళు ఈ డ్రమ్ము మోగించాలి అని. బ్రహ్మకన్వాల్ డ్రమ్మును బలంగా వాయించాడు. వెంటనే నలుగురు సైనికులు వచ్చి అతన్ని భవనంలోకి తీసుకుపోయారు.

రాణి అతన్ని చూసి ఆహ్వానించి ఒక ఖరీదయిన కంబళి అతనికి చూపి దానిపై కూర్చోమంది. తను ఒక పాత మురికి కంబళిపై కూచుంది. ఆట మొదలయింది బ్రహ్మకన్వాల్ తన నగల్ని, సంపదని రాజ్యాన్ని అన్నిట్నీ ఒడ్డి పాచికలాడాడు. అన్నీ పోగొట్టుకున్నాడు. కట్టుబట్టల్తో మిగిలాడు. వాటిని కూడా ఒడ్డి పాచికలాడమంది. కానీ అవి అతని తల్లి పెట్టిన బట్టలు కావడం వల్ల అతను అంగీకరించలేదు. ఆమె సేవకులు వచ్చి అతన్ని బంధించి ఒక చీకటి కొట్టంలో దోమలు, తేళ్ళు వున్న మురికికూపంలో చీకటిగా వున్న స్థలంలో వదిలారు.

ఆ రాత్రి అతనికి ఒక కల వచ్చింది. ఆ కలలో అతని తల్లి ఐన దేవకి కనిపించింది. ఆమె కొడుకును ఓదార్చి, నాయనా! రేపు మళ్ళీ ఆమెతో జూదానికి సిద్ధంగా నేను నీకు పెట్టిన బట్టల్ని పణంగా ఒడ్డి ఆడు అయితే ఆమె ఖరీదయిన కంబళి చూపినపుడు నువ్వు మురికిగా వున్న కంబళిపై కూచుని ఆట ఆరంభించు, అంది.

ఉదయాన్నే కాపలాదారుడితో తన బట్టలు పెట్టి జూదమాడడానికి సిద్ధంగా వున్నానని రాణితో చెప్పు అన్నాడు. రాణి ఆశ్చర్యపడి పాచికలు తీసుకుని సిద్ధపడింది. బ్రహ్మకన్వాల్, రాణిగారూ! యిప్పుడు నేను మీ బానిసను. నేను మురికి కంబళి మీద కూచుంటాను. మీరు ఖరీదైనా కంబళిపై కూచోండి అన్నాడు. ఆమె అక్కడ కూచుండానికి ఒప్పుకోలేదు. మొత్తానికి బలవంతంగా ఒప్పించాడు.

ఆమె ఆట మొదలుపెట్టింది. ఓడిపోయింది. ఎన్ని ఒడ్డినో అన్నిట్లో ఓడిపోయింది. బ్రహ్మకన్వాల్ క్రమంగా పోగొట్టుకున్నవన్నీ తిరిగి పొందాడు. అన్నీ ఓడిన మోతీమాల,

నువ్వు ఒంటరిగా వెళితే మీ వదిన నిన్ను హేళన చేస్తుంది. నన్ను పెళ్ళాడు అంది. అతను నేను జూదం ఆడే స్త్రీని పెళ్ళి చేసుకోను అన్నాడు.

అప్పుడు ఆమె నువ్వంత సాహసవంతుడవయితే అపురూప సౌందర్యవతి ఐన చంద్రమాలను పెళ్ళాడు చూద్దాం అంది. ఆ మాటల్ని సవాలుగా స్వీకరించిన బ్రహ్మకన్వాల్ దంతపుబొమ్మను సందేశకుడి ద్వారా కృష్ణునికి పంపి, తను చంద్రమాలను పెళ్ళాడి తిరిగివస్తానని చెప్పి పంపాడు.

చంద్రమాల ముల్లోకాలలో అందగత్తె చంద్రగిరి నాగ, అనే అతని భార్య. అతను విషం నిండిన కాలనాగు సోదరుడు తన యాభయి రెండు పడగలతో అతను చంద్రమాలను కాపలాకాస్తాడు

బ్రహ్మకన్వాల్ పిల్లనగ్రోవి మోగించుకుంటూ చంద్రమాల యింటి ముందు నిల్చున్నాడు. లోపలినించీ, ఎవరది? అన్నమాటలు వినిపించాయి. నేను బ్రహ్మకన్వాల్‌ని. కృష్ణుడి తమ్ముణ్ణి, అన్నాడు. ఆమె 'మా ఆయన యింట్లో లేడు' అంది. యింకా ఆమె, మీ అన్న కృష్ణుడు నాగుల శత్రువు, నిన్ను లోపలికి రానివ్వను అని పరుగెత్తింది. బ్రహ్మకన్వాల్ పిల్లనగ్రోవి వూదుతూ ఆమెను వెంబడించాడు. ఆమెను చూసి ఆమె అందాన్ని చూసి మూర్ఛపోయినంత పని చేశాడు. పరిగెత్తకు నేను భోంచేసి మూడు రోజులయింది. నాకేమయినా తినడానికి పెట్టు అన్నాడు

ఆమె పరుగు ఆపి వంట వండి అతనికి తినడానికి పెట్టింది. అతను తినబోతూ ఆగి అక్కడ పాత్రల్లో అప్పటికే సిద్ధంగా వున్న ఆహారాన్ని చూసి అది వుంది కదా! మళ్ళీ ఎందుకు వంట చేశావు? అన్నాడు.

ఆమె, ఆ ఆహారం నా భర్తకోసం చేసింది. అతను తప్ప అతని ఆహారం వేరే ఎవరైనా తింటే వాళ్ళు గిరగిర తిరుగుతారు. ఆ శబ్దం నా భర్త ఎక్కడున్నా అతనికి చేరుతుంది అంది. తనకు ఆ ఆహారం కావాలన్నాడు వద్దంటే వినలేదు. ఆమె పెట్టింది ఒక ముద్దతినేసరికల్లా బంగారు పళ్ళెం తిరగడం ఆరంభించింది. ఆ శబ్దం చంద్రగిరి నాగకు చేరి అతను తన అన్నతో, నాశత్రువెవరో నాయింట్లో చొరబడి నా తిండితింటున్నాడు అని చెప్పాడు.

కాలనాగు, నువ్వు నీ చెవుల్ని శుభ్రంచేసుకో. అవి చాలా రోజులనించీ దుమ్ముపట్టి ప్రతిధ్వనిస్తున్నాయి అని అన్నాడు.

ఈ మధ్యలో బ్రహ్మకన్వాల్ భోజనం ముగించి నిద్రకు వుపక్రమించాడు. మంచి

మెత్తటి పరుపు చూసి, చంద్రమాలా! యిది ఎవరి పరుపు? అన్నాడు ఆమె నా భర్తది. దయచేసి దానిపై పడుకోకు దానికి నాలుగువేపులా నాలుగు బొమ్మలున్నాయి. నువ్వు దానిపై  పడుకున్న మరుక్షణం అవి ఎగిరివెళ్ళి ఆవార్తను నా భర్త కందిస్తాయి అంది, 'నేను లెక్కపెట్టను ' అని అతను పడకపై పడుకున్నాడు సందేశం ఆమె భర్తకు చేరింది.

అతను వెంటనే వచ్చి నిద్రపోతున్న బ్రహ్మకన్వాల్‌ని చూశాడు. చంద మామ లాంటి చల్లని రూపంలో నిద్రిస్తున్న అతన్ని కాటువెయ్యడానికి మనస్కరించక వెళ్ళి ఆ విషయం తన అన్న ఐన కాలనాగుతో చెప్పాడు. పైగా ' అతను కృష్ణుని తమ్ముడన్నాడు'. అయితే వెళ్ళి వెంటనే అతన్ని కాటు వేయి, లేకుంటే నిన్ను చంపుతాడని కాలనాగు అన్నాడు. చంద్రగిరి నాగుడు వెళ్ళి నిద్రపోతున్న బ్రహ్మక న్వాల్‌ని కాటువేసి వెళ్ళిపోయాడు

కాటుతో మెలకువ వచ్చిన బ్రహ్మకన్వాల్ నల్లబడుతూ 'చంద్రమాలా! నన్ను ఉప్పుగదిలో పెట్టు. ఎప్పటికయినా మా అన్న వచ్చి నన్ను బ్రతికిస్తాడు, అని కన్ను మూశాడు.

తనంటే అల్లాడి కన్నుమూసిన బ్రహ్మకన్వాల్ చూసి కన్నీరు మున్నీరు విలపించింది చంద్రమాల. అది చూసి భర్త కోపంతో కదిలిపోయాడు.

ఈలోగా దేవకిమాతకు అదృశ్యవాణి ద్వారా కొడుకు మరణవార్త అందింది. కృష్ణుడు ససైన్యంగా బయల్దేరి సర్పాల్ని సంహరించాడు. ఆదిశేషుణ్ణి ప్రార్థిస్తే వచ్చి బ్రహ్మకన్వాల్ శరీరం నించీ విషాన్ని ఉపసంహరించాడు. సజీవంగా కన్వాల్ మేలుకొన్నాడు. చంద్రమాలతో కలిసి ద్వారకకు వచ్చిన బ్రహ్మకన్వాల్‌కి ఘనస్వాగతం లభించింది.

# 19 షేక్ చిల్లీ జీవనవిధానం

షేక్‌చిల్లీ గురించి ఉత్తరప్రదేశ్‌లో కథలు ప్రచారంలో వున్నాయి. వాటిల్లో యిదొకటి.

ఒక సారి షేక్‌చిల్లీ బతకడానికి ఏదయినా పనిచెయ్యాలనుకున్నాడు. ఒక పట్టణం వెళ్ళి ఒక బట్టల దుకాణం ముందు నిల్చుని యజమానితో, అయ్యా! నాకేదయినా పనియివ్వండి  చేస్తాను. అన్నాడు

బట్టల కొట్టు యజమాని ఒకవస్త్రాన్ని యిచ్చి దీని తీసుకెళ్ళి సంతలో అమ్మిడబ్బు తీసుకునిరా. దాంట్లో నీకు వాటా యిస్తాను అన్నాడు

షేక్‌చెల్లీ. మరిదీన్ని ఎంతకు అమ్మాలి? అన్నాడు. నిజానికి ఆ వస్త్రం పై దాని ధరవుంటుంది. ఆ సంగతి చిల్లీకి తెలుసునని వర్తకుడు అనుకుని, రెండు పైసలు పైన, రెండుపైసలు కింద బేరం కుదిరితే అమ్ము, లేకుంటే అమ్మకు, అన్నాడు. చిల్లీ సరేనని సంతకు వెళ్ళాడు.

సంతలో కూచుని, రెండుపైసలుపైన, రెండుపైసలు కింద వుంటేకానీ ఈ వస్త్రం అమ్మను అన్నాడు. జనాలు అతని మాటలకు నవ్వుకున్నారు. కానీ అతను తెలివితక్కువ వాడని ఒక వ్యక్తి కనిపెట్టాడు. తన చేతిలో పైన రెండుపైసలు, కింద రెండుపైసలు పెట్టి చిల్లీకి చూపించాడు. చిల్లీ సంతోషంతో బేరం కుదిరి నందుకు ఉత్సాహంతో ఆ వస్త్రం తీసి అతనికి యిచ్చి నాలుగు పైసలు తీసుకున్నాడు.

చిల్లీకి ఆకలి మండిపోతోంది. నాలుగుపైసలు పెట్టి రొట్టె కొని తినబో యేంతలో ఒక కుక్క వచ్చి ఆ రొట్టెను నోటకరచుకుని పారిపోయింది. చిల్లీకి కన్నీళ్ళు పర్యంతమైంది.

పరిగెట్టుకుంటూ బట్టల కొట్టు యజమాని దగ్గరికి వెళ్ళి, నువ్వు నాలుగు పైసల కన్నా మించిన ఖరీదయిన వస్త్రాల్ని యిస్తే నాకూ నాలుగు డబ్బులు మిగిలేవి. యిప్పుడు చూడు, నోటి దగ్గర రొట్టెను కుక్క లాక్కుపోయింది అన్నాడు.

ఆ మాటల్తో కోపగించిన యజమాని, పిచ్చిపిచ్చిగా మాట్లాడకు వెళ్ళి నా డబ్బులు తెచ్చిస్తావా లేదా! లేకుంటే వాయగొడతాను అన్నాడు

చిల్లీ బయల్దేరి కుక్కను వెతుకుతూ వెళ్ళాడు. అది ఒక స్వీట్‌షాపు ముందు ఆకులు

నాకుతూ కనిపించింది. అతను కుక్క దగ్గరికి వెళ్ళి ‘ మర్యాదగా నా డబ్బులివ్వు’ అని అరిచాడు. ఆ అరుపుల్తో భయపడి కుక్క పరిగెత్తి ఒక డబ్బున్న వాడి యింట్లోకి దూరింది. చిల్లీ దాన్ని అనుసరించాడు ఆ యింటి యజమాని బీరువా తెరిచి డబ్బులు లెక్కపెట్టి కట్టలు దాంట్లో పెడుతున్నాడు. కుక్క వచ్చే సమయానికి పని వుండి పక్కగదిలోకి వెళ్ళాడు. కుక్క వెంటపడిన. చిల్లీ అక్కడ తెరిచి వుంచిన బీరువా నించీ ఒక నోట్ల కట్ట అందుకుని బయట ఎమపడ్డాడు. బట్టలవ్యాపారి దగ్గరకు వెళ్ళి ఆ నోట్ల కట్టయిచ్చాడు. అంత ఖరీదుకు తన వస్త్రాన్ని అమ్మినందుకు ఆనందించిన వ్యాపారి చిల్లీకి భారీ కమీషన్ యిచ్చిపంపాడు.

పోలీసులకు సందేహం కలిగింది ఒక పోలీసు చిల్లీని పిలిపించి, నువ్వు దొంగతనం చేశావా? అని అడిగాడు.

చిల్లీ, అవును, అన్నాడు,ఎప్పుడు చేశావు?

‘కుక్క వెంట పడినప్పుడు’

‘కుక్క వెంట ఎప్పుడు పడ్డావు?

‘దొంగతనం చేసినపుడు’

‘ఆ యిల్లు ఎక్కడ వుంది?

‘మసీదుకు ఎదురుగా’

‘మసీదు ఎక్కడ వుంది’

‘ఆ యింటికి ఎదురుగా’

ఆ రెండు ఎక్కడున్నాయి?

‘ఒకదాని కొకటి ఎదురుగా!

ఈ సమాధానాల్లో పోలీసుకు చిల్లీ ఒక పిచ్చివాడని పించి అతన్ని నిరపరాధిగా వదిలేశాడు!

# 20 నలుగురు దేవకన్యలు

ఒక గ్రామంలో వెనకటి రోజుల్లో ఒక రైతు వుండేవాడు. పేరుకు రైతే కానీ అతను వ్యవసాయం చేసి ఎరగడు. అంతేకాదు ఏపనీ చెయ్యడం రాదు. మహాబద్ధకస్తుడు. సోమరిపోతు తినడం కూచోవడం తప్ప ఏమీ తెలీదు. అతనితో బాగా విసిగిపోయిన భార్య నువ్వు యింట్లోంచి వెళ్ళి ఏదయినా పనిచేసి కష్టపడి ఏదయినా సంపాదించుకుని రాకపోయిన పక్షంలో నేను పిల్లలకు విషంపెట్టి చంపుతాను. యిల్లు తగలబెట్టి, నేను బావిలోకి దూకి చనిపోతాను అని బెదిరించింది.

అట్లా బెదరగొట్టేసరికి రైతు అదిరిపోయి ఎక్కడికయినా వెళ్ళి ఏదయినా పనిచూసుకోవాలనుకున్నాడు. అతను బయల్దేరే సమయానికి భార్య జాలిపడి అతను తినడానికి నాలుగు రొట్టెలు మూటకట్టి యిచ్చింది.

అతను రహదారి వెంట సాగుతూ బయల్దేరాడు. ఎక్కడికి వెళ్ళాలో ఏం చెయ్యాలో అతనికి తోచలేదు. అలా వెళుతూ వుంటే అతనికి ఆకలి వేసింది. ఒక బావి దగ్గర ఆగాడు, నాలుగు చపాతీలూ తినేస్తే యిక తినడానికి ఏమీ మిగలవు, అందుకని అతను, ఒకటి తిందునా? రెండు తిందున్నా? మూడు తిందునా? నాలుగు తిందునా? అని తనలో తను అనుకుంటూ బయటికి విని పించేలా అన్నాడు.

ఆ బావిలో నలుగురు దేవకన్యలు నివాసం వుంటున్నారు. వాళ్ళు ఆ మాటలు విని భయపడిపోయారు. ఏదయినా దయ్యం తమని తినడానికి ప్రణాళిక వేస్తోందని వణికిపోయారు. ఆ దేవకన్యలు ఆ రైతు ముందుకు వచ్చి, అయ్యా! మేము నలుగురు అక్కాచెల్లెళ్ళం. మేము నీకు రెండు బహుమతుల్ని సమర్పించుకుంటాం. దయచేసి మమ్మల్ని వదిలిపెట్టు అన్నారు. అట్లా అని వాళ్ళు అతని చేతిలో ఒక పాత్ర, ఒక తోలుబొమ్మ పెట్టి, ఈ పాత్ర నువ్వు ఏం కోరుకుంటే అది యిస్తుంది. ఈ తోలుబొమ్మ నువ్వు ఏపనిచెబితే అది చేస్తుంది అన్నారు.

ఆ బహుమతుల్తో అతను ఎంతో సంతోషించి తనప్రయాణం మానుకుని తిరుగు ప్రయాణమయ్యాడు. కానీ తన గ్రామం యింకా దూరం కావడం వల్ల ఆ రాత్రి ఒక పొరుగుగ్రామంలో బసచేశాడు. ఒకరి యింటికి వెళ్ళి 'మీరు ఈ రాత్రికి నాకు

పడుకోవడానికి చోటివ్వండి' వుదయాన్నే వెళ్ళిపోతాను. వుదయాన్నే మీ యిల్లుంతటికీ కావలసినంత రుచికరమైన ఆహారాన్ని యిచ్చి మిమ్మల్ని తృప్తిపరుస్తాను అన్నాడు. పగటిదాకా ఆగకుండా రైతు ఆ రాత్రే పాత్రని కావలసిన ఆహారాన్ని, రకరకాల వంటల్ని అడిగాడు. ఆ పాత్ర అన్నీ సిద్ధం చేసింది. అందరూ తృప్తిగా భుజించారు. తోలుబొమ్మతో తిన్న గిన్నెల్ని శుభ్రపరచమని ఆదేశించాడు. అది తిన్న గిన్నెలన్నిటినీ కడిగేసింది.

ఆ యింటి యజమాని, అతని భార్య ఈ వింతచూసి ఎంతో ఆశ్చర్య పోయారు. రైతు నిద్రపోయాక అతని పాత్రను, తోలుబొమ్మను తస్కరించి వాటి స్థానంలో అలాగే వున్న నకిలీ వాటిని పెట్టేశారు.

రైతు పొద్దున్నే ఉత్సాహంగా తనగ్రామానికి వెళ్ళి తనభార్య ముందు నిలబడ్డాడు. యింత తొందరగా తిరిగి వచ్చిన భర్తను చూసి ఆమె విస్తుపోయింది. రైతు తను చేసిన ఘనకార్యం కథగా వివరించాడు. తనకు అందిన మహత్తుల గురించి చెప్పి పాత్రను, తోలుబొమ్మను చూపి వాటికి ఆదేశాలిచ్చాడు. కానీ అవి చలనం లేకుండా వుండిపోయాయి. రైతుకు దిక్కు తోచలేదు. భార్యకు పట్టరాని కోపం వచ్చింది. నువ్వు కేవలం బద్ధకస్తుడవని యిన్నాళ్ళూ అనుకున్నాను. తెలివితక్కువ వాడివని యిప్పుడు తెలిసింది. నువ్వు యింట్లో నించీ వెళ్ళిపో. ఎప్పుడయినా యింటికి వస్తే కాళ్ళు విరగ్గొడతా అంది.

పాపం దిగులు పడిపోయిన రైతు తను ఎక్కడ దేవకన్యల్ని కలుసు కున్నాడో ఆ బావి దగ్గరకి వెళ్ళి భోరున ఏడ్చాడు. అతని ఏడుపు విని దేవకన్యలు బయటికి వచ్చి ఎందుకేడుస్తున్నావని అడిగారు తనకు వాళ్ళిచ్చిన గిన్నె, తొలుబొమ్మ పని చేయలేదని, తన భార్య తనని తన్ని తగలేసిందని అన్నాడు. దేవకన్యలు ఎవరో నిన్ను మోసగించి వాటిని తస్కరించి నకిలీవి పెట్టారు. సరే, ఈ సారి నీకు ఒక తాడు, ఒక కట్టె యిస్తున్నాం. అవి తీసుకెళ్ళి నిన్న రాత్రి ఎవరి యింట్లోదిగావో అక్కడే బసచేయి. ఈ తాడు నువ్వు ఎవర్ని బంధించమంటే వాళ్ళని బంధిస్తుంది. ఈ కర్ర నువ్వు ఎవర్ని కొట్టమంటే వాళ్ళని కొడుతుంది అన్నారు.

రైతు దేవకన్యలు చెప్పినట్లే అంతకు ముందు ఎవరి యింట్లో దిగాడో అక్కడికే వెళ్ళాడు. ఆ యింటి యజమాని యింకా వింత వస్తువులు పట్టుకొచ్చాడో అని రైతును ఆహ్వానించాడు.

రైతు తాడును వదిలి యజమానిని, అతని భార్యను బంధించమన్నాడు. తాడు వాళ్ళిద్దరికీ చుట్టుకుంది. కట్టెను వదిలి వాళ్ళిద్దర్ని చితక బాదమన్నాడు. కట్టె వాతలు

పడేలా కుళ్ళబొడిచింది.

ఆ యింటి యజమాని, అతని భార్య మొత్తుకుంటూ క్షమించమని ప్రార్థించారు. దాచి పెట్టిన పాత్రను, తోలుబొమ్మను తిరిగి తెచ్చిచ్చారు.

అప్పుడు రైతు ఆత్మవిశ్వాసంతో తన భార్య దగ్గరికి వెళ్ళి తన అద్భుతాలు ప్రదర్శించాడు. ఆమె ఆశ్చర్యపడింది ఆనందించింది. ప్రయోజకుడయిన భర్తను చూసి పరవశించింది. అంతేకాదు తాడు, కట్టె వాళ్ళకు  గొప్ప రక్షణనిచ్చాయి ఆ దంపతులు ఆనందంగా, హాయిగా జీవించారు.

# 21 చిల్లీ అత్తగారింటి ప్రయాణం

షేక్‌జీ చిల్లీ చాలారోజులుగా అత్తగారింటికి వెళ్ళలేదు. అత్తగారు వుత్తరం రాసింది, అల్లుడుగారూ! మీరు మాయింటికి వచ్చి చాలారోజులయింది. అందుకని మీరు వచ్చి మా మర్యాదలు స్వీకరించాలని కోరుతున్నాం. తప్పకరండి అని రాసింది. చిల్లీ తల్లి అతన్తో, నీ బావమరిది, మరదలు నిన్ను చూడాలని ఎంతో ఉత్సాహంతో ఎదురుచూస్తున్నారు. అందుకని వాళ్ళని ఆనందపెట్టడానికి కొన్నాళ్ళు అక్కడ వుండిరా అంది. చిల్లీకి అంతగా యిష్టం లేకున్నా సరేనన్నాడు.

అతను ప్రయాణానికి సిద్ధపడినపుడు తల్లి, నాయనా! మూడు విషయాలు మనసులో పెట్టుకో. మొదటిది. దారిలో సూటిగా సాగిపో. ఎప్పుడూ పక్కగా వెళ్ళకు. రెండోది వినయంగా వుండు. మూడోది ఎవరయినా ఏదయినా యిస్తే స్వీకరించు, తలమీద ధరించు అంది. తల్లి చెప్పిన మాటలన్నీ చిల్లీ మనసులో పెట్టుకున్నాడు.

బయలుదేరిన తరువాత ఒక నది దగ్గరికి చేరాడు. అక్కడ పడవ తీరానికి రావడానికి యింకా సమయముంది. కాబట్టి ఎదురు చూస్తూ కూచున్నాడు చాలా సేపటికి ఒక పడవ రావడం చూశాడు. ఐతే అది ఒక మూల వచ్చింది. తల్లి చెప్పిన మాట గుర్తొచ్చి ఆ పడవ ఎక్కలేదు. నదిలో దూకి తడిచిన బట్టల్తోనే అవతలి తీరానికి ఈది వెళ్ళాడు. ముక్కుకు సూటిగా చెట్లు పుట్టలు దాటుకుంటూ కష్టపడి అత్తగారింటికి చేరాడు. రోడ్డు కనిపించినా ఆ దారంట వెళ్ళలేదు, కారణం రోడ్డు వంపు తిరిగి వుండడం.

అందరూ అతన్ని ఆహ్వానించారు. చిన్ని బావమరిది తమలపాకులు పెట్టిన పళ్ళేని అందిచ్చాడు. చిల్లీ తమలపాకులు తినడు. అయితే మర్యాద కోసం రెండు ఆకులు తీసుకుని నమిలాడు సున్నం వక్కలతో కలిపి. అతని ఎదురుగా ఒక అద్దం వుంది. అందులో రక్తం లాంటిరసం తన పెదాలపై వుండడం చూశాడు. అది రక్తమే అనుకున్నాడు.

ఎప్పుడో ఒక వైద్యుడు చెప్పిన మాటలు గుర్తుకొచ్చాయి. పెదాల నుండి రక్తంకారితే మరణం సమీపించినట్లే, అన్న మాటలు ఆ ఆలోచన రాగానే ఏడవడం మొదలు పెట్టాడు.

యింట్లో వాళ్ళందరూ ఏదో ఉపద్రవం ముంచుకొస్తూ వుందని వాళ్ళు ఏడవడం ప్రారంభించారు. పక్కింటివాళ్ళు, ఎదురింటి వాళ్ళు వచ్చి ఏమైందో తెలుసుకోకుండా

వాళ్ళు ఏడవడం ఆరంభించారు.

వూరి పెద్ద విషయం తెలుసుకుని వచ్చాడు. అందర్నీ చూశాడు. అందరూ ఏడ్చేవాళ్ళే కానీ ఎందుకేడుస్తున్నామో ఎవరికీ తెలీదు. కారణం గురించి ఆలోచించేవాళ్ళు కనిపించారనుకున్నాడు.

అతను సమాధానాన్ని తెలుసుకోడానికి ప్రయత్నించాడు. కానీ చిల్లీ గొల్లుమన్నాడు. గ్రామపెద్ద మళ్ళీ అడిగాడు చిల్లీ, అయ్యా! మీరు సమయానికి వచ్చారు. నేను చనిపోబోతున్నాను ఖురాన్ పఠనం చేయండి. నా ఆత్మశాంతిస్తుంది, అన్నాడు.

గ్రామపెద్ద పరీక్షించి నవ్వి, బాబూ! యిది తాంబూలం వేసుకుంటే వచ్చే ఎరుపు రక్తం కాదు, అన్నాడు దాంతో దృశ్యం మారిపోయింది. ఏడుపులు మానేసి ఎక్కడి వాళ్ళక్కడికి వెళ్ళారు.

అత్తగారు అన్నీ వడ్డించి అల్లుణ్ణి భోంచెయ్యమంది. ఒక కూర వేసిదాన్ని రుచి చూడమంది. అది నాకు వద్దన్నాడు. అలా అనకూడదు. అది మీ మరదలు మీకోసం చేసింది. రుచి చూడండి, అంది. తల్లి చెప్పిన సలహా గుర్తొచ్చింది. ప్రేమతో యిచ్చిన దాన్ని నెత్తిన పెట్టుకోమంది. వెంటనే ఆ కూరతీసి తలపై వేసుకున్నాడు. ఎందుకలా చేశావంటే, మా అమ్మ వినయంగా తలదాల్చమంది అన్నాడు.

తరువాత చిల్లీ పడుకోడానికి వెళ్ళి పడకమీద కూచుని కాసేపటికి నిద్రలోకి జారుకున్నాడు. రాత్రి సరిగా తినకపోవడం వల్ల అర్ధరాత్రి మెలకువ వచ్చింది.

ఏదో మంచి వాసన వేసింది. వంటగదిలోకి వెళ్ళాడు. పాయసం కుండ తడిమి దాంట్లో తలదూర్చాడు. తిన్నంత తిన్నాడు. తలబయటికి రాలేదు. శబ్దానికి యింట్లో వాళ్ళు లేచారు. దొంగ అనుకుని రెండు దెబ్బలు వేశారు. చివరికి అల్లుడేని తెలిసి పశ్చాత్తాపపడ్డారు.

అట్లా చిల్లీ అత్తగారింటి ప్రయాణం ముగిసింది.

# 22 వెయ్యి బళ్ళ తెలివి

ఒక రోజు ఒకరైతు భార్య ఆడవాళ్ళ తెలివి ముందు మగవాళ్ళు ఎందుకూ కొరగారని, ఆడదాని తెలివిని వెయ్యి బళ్ళ కెత్తవచ్చని అంది. నా ఎత్తులతో మిమ్మల్ని చిత్తు చెయ్యగలనని అంది. రైతు, నీ ఎత్తులు నన్నేమీ చెయ్యలేవు, నీ తెలివితేటలు నా ముందుపని చెయ్యవు అన్నాడు. అలా అయితే చూడండి. మీ పనిపడతా అంది.

ఒకరోజు రైతు పొలానికి వెళ్ళబోయే ముందే అతని భార్య పొలానికి వెళ్ళి నాగలి చేలలో ఒక పెద్ద చేపనూ దాచి వచ్చింది. రైతు పొలం వెళ్ళి నాగలితో దున్నితే చేప బయటపడింది. రైతు సంతోషంతో యింటికి వెళ్ళి భార్యకు చేపనిచ్చి, చేపనూ పట్టాను. దాన్ని మంచి రుచిగా వుండు. పూరీలు చేయి, అన్నాడు. భార్య, సరే!నంది. వంట సిద్ధం చేసింది. భర్తను భోజనానికి పిలిచింది. పూరీలు పెట్టింది. తినమంది. చేపకూర ఏది? అన్నాడు, చేపకూర ఏమిటి ఎప్పుడు తెచ్చారు? అంది. భర్త కోపం నసాళానికి అంటింది. పిచ్చిపిచ్చిగా మాట్లాడు తున్నావు? చేపను తెచ్చిచ్చానుకదా! గూబగుయ్యి మనిపిస్తాను అని భార్యను కొట్టడానికి లేచాడు.

ఆమె, అమ్మో! నా మొగుడు నన్ను చంపేస్తున్నాడు. రండి, రక్షించండి, అని అరిచింది. యిరుగు పొరుగు పరిగెత్తుకొచ్చారు.

వాళ్ళు, ఏమైంది? అన్నారు.

రైతు, నేను పెద్ద చేపను పొలం నించీ తీసుకొచ్చాను. నా కళ్ళముందే యిది చేపల పులుసు చేసింది. వడ్డించమంటే చేపల కూరే చెయ్యలేదంటోంది. అన్నాడు.

యిరుగు పొరుగులంతా పగలబడి నవ్వారు. 'చేప పొలంలో దొరకడం ఎప్పుడున్నా విన్నారా? అన్నారు. అంటూ రైతుకు మతిభ్రమించిందేమో అనుకుని ఎవరి దారంటా వారు వెళ్ళారు.

వాళ్ళు అటువెళ్ళగానే రైతుభార్య చేపలకూర తీసి ముక్కలు తినడం ప్రారంభించింది.

రైతు మళ్ళీ, అయ్యా! రండి! చూడండి! చేపల ముక్కలు తింటోంది. నాకు ఒక ముక్క కూడా పెట్టకుండా తింటోంది. అంది.

గ్రామస్థులు పరిగెత్తుకుంటూ వచ్చేసరికి ఆమె చేపలకూర దాచేసి ఏమీ ఎరగనిదానిలా కూచుంది. వాళ్ళు వస్తూనే నన్ను కొడుతున్నాడు. కొట్టి చేపల పులుసు తీసుకురా అంటున్నాడు. యిదేమీ ధర్మం చెప్పండి అంది. ఏడుపుమొదలు పెట్టింది.

రైతు, చూశారా! పొలంనించీ చేప తెచ్చాను. పులుసు పెట్టింది. నా కళ్ళముందే తింటోంది. నాకు ఒక ముక్కయివ్వమంటే యివ్వనంటోంది అన్నాడు.

అక్కడి కొచ్చిన గ్రామస్తులు ఒక నిర్ణయానికి వచ్చారు. రైతుకు ఏదో దయ్యం పట్టిందని తీర్మానించారు. పట్టుకుని పొగపెట్టారు, వేపాకులతో మంత్రించారు. గుంజకు కట్టేశారు. తరువాత ఎవరిదారంటా వాళ్ళు వెళ్ళారు.

రైతు భార్య అతని కట్లు విప్పి వేడి నీళ్ళ స్నానం చేయించి పళ్ళెంలో పూరీలు, చేపకూర వడ్డించింది. రైతు ఆశ్చర్యంగా చూశాడు.

ఆమె, నా తెలివి తేటల్లో ఒకటిమాత్రమే యిప్పుడు ప్రదర్శించాను. నా దగ్గర వున్న తెలివితేటలు లెక్కలేనన్ని వెయ్యి బళ్ళ తెలివి తేటలుంటాయి, అంది.

భర్త కిక్కురుమనకుండా చేపల కూర, పూరీలు తిన్నాడు.

# 23 మంచుకోతి

ఒక దేశాన్ని ఒక రాజు పాలించేవాడు. అతని దగ్గర ఓ సేవకుడు వుండేవాడు. అతని దగ్గర వున్న ఆ సేవకుడికి రాజంటే ఎంతో చనువు. రాజు సేవకుణ్ణి చూసినట్లు అతన్ని చూసేవాడు కాదు. అందుకని సేవకుడు తన హద్దుమీరుతూ వుండేవాడు.

ఒకరోజు సేవకుడు రాజా! మంత్రిగారి భార్య మహాఅందగత్తె కదా! ఆమె అతని దగ్గర కాదు, మీ అంతఃపురంలో వుండదగింది. ఆమె మీ దగ్గరకు తెచ్చుకోండి, అన్నాడు. రాజు, అదెలా వీలుపడుతుందిరా! మంత్రిగారు బతికున్నంత వరకూ అది జరగదు, అన్నాడు.

సేవకుడు, దానికి నేను ఓ పథకం వేశాను, ఉత్తరపర్వతాల్లో మంచుకోతి వుందని మనమందరం విన్నాం. చూసిన వాళ్ళెవరూలేరు. మంత్రికి ఆ పని ఒప్పచెప్పండి. అక్కడికి వెళ్ళినవాళ్ళు తిరిగివచ్చిన వాళ్ళు లేరూ కాబట్టి తరువాత అతని భార్యను మీరు చెరబట్టవచ్చు అన్నాడు.

రాజు మంత్రిని పిలిచి, మీరు వుత్తరపర్వతాల్లోకి వెళ్ళి మంచుకోతిని తీసుకురండి నాకు చూడాలని వుంది అన్నాడు. మంత్రి దిగులుగా సరేనని చెప్పి యింటికి వెళ్ళి విషయం భార్యతో చెప్పాడు.

ఆమె, యిదంతా కుట్రలేనిదాన్ని కోరడం వెనక రాజు నాపై కన్ను, వేశాడని తెలుస్తోంది. మీరు ఎక్కడికీ వెళ్ళకండి. యిక్కడే దాక్కోండి. ఏమి జరిగినా నేను చూసుకుంటాను, అంది.

మంత్రి రహస్యంగా యింట్లోనే వుండిపోయాడు.

కొంతకాలం గడిచింది. ఇక మంత్రి తిరిగి రాడని నిశ్చయించుకున్న రాజు తన సేవకుణ్ణి మంత్రి యింటికి పంపాడు. మంత్రి భార్యను తన అంతఃపురానికి రమ్మని చెప్పి పంపాడు.

సేవకుడు వుత్సాహంగా మంత్రి యింటికి వచ్చాడు. మంత్రి భార్య అతనికి మర్యాదలు చేసింది. భోజనం పెట్టింది. అన్నీ సర్దుకుని రేపు అంతఃపురానికి వస్తానని రాజుగారికి

కబురందించమంది. తన పన్నగం పారినందుకు సేవకుడు సంతోషించాడు. అతను వెళ్ళబోతోంటే, రేపు తప్పకుండా రావాలి. నాకు తోడుగా అంతఃపురానికి రావాలి అంది.

తనకు అంత గౌరవమర్యాదలు దక్కినందుకు సేవకుడు పొంగిపోయి, తప్పకుండావస్తానని వెళ్ళాడు. ఆ వార్త రాజుకు చేరవేసి సంతోషపెట్టాడు. తెల్లవారు తుందనగా మంత్రియింటికి బయల్దేరాడు.

అతను రాక ముందే చేసిన మంచం కింద ఒక పథకం సిద్ధం చేశారు. మంచం కోళ్ళు వదులు చేసిన మంచం కింద ఒక పెద్ద బానలో వేపబంకపెట్టారు. పైన మంచంలో రంధ్రంచేసి దానిపై ఒక పల్చటి దుప్పటి కప్పారు. పక్కనే తెల్లటి పిల్లి బొచ్చు చిన్నిసంచిలో సిద్ధం చేసుకున్నారు.

అంతలో సేవకుడువచ్చాడు. ఆహ్వానించి మంచంపై కూచోమన్నారు అంతే. కుండలోని వేపబంకలో పడ్డాడు. మంచం లేపి సంచిలోని పిల్లిబొచ్చు అతని ఒళ్ళంతా అద్ది ముఖం కనిపించకుండా ముఖమంతా అద్ది అతని పెదాల్ని సూదితో కుట్టేశారు. రేపు సభలో నువ్వు మంచుకోతివా అని అడిగితే అవునని తలూపాలి అని చెప్పారు.

మరుసటి రోజు మంచుకోతితో సభలోకి వచ్చిన మంత్రిని చూసి రాజు సభికులు ఆశ్చర్యపోయారు. నువ్వు మంచుకోతివా? అంటే సేవకుడు, ఊఊ, అన్నాడు.

రాజు యింటిదగ్గర స్థంబానికి మంచుకోతిని కట్టేశారు. రాజు నిద్ర పోకముందు యిది నిజమేనా అని కిటికీ గుండా చూశాడు. అప్పుడే వర్షం పడి స్థంబానికి కట్టేసిన సేవకుడి శరీరం పై పిల్లి బొచ్చు కొట్టుకుపోయి అసలు రూపం బయటపడింది.

ఆశ్చర్యంతో వెళ్ళి పాదాల కట్లు తొలగించాడు. మాట్లాడే శక్తి లేక సేవకుడు నొప్పితో కుయ్యోమొర్రో అన్నాడు.

ఆ రకంగా యితరులపె కన్ను వేసిన రాజుకు, సేవకుడి తగిన శాస్త్రి జరిగింది.

# 24 ఢిల్లీలో షేక్ చిల్లీ

షేక్ చిల్లీకి కష్టకాలం దాపురించింది. ఏదయినా పెద్దనగరానికి వెళ్ళి ఏదయినా పనిచేసి బతకాలని నిర్ణయించుకున్నాడు. అతను ఎప్పుడూ తన పల్లెను వదిలి ఎక్కడికీ వెళ్ళినవాడు కాదు. వాళ్ళూ వీళ్ళూ చెప్పడం ద్వారా ఢిల్లీ నగరం గురించి విన్నాడు. ఢిల్లీకి వెళ్ళాలంటే రైలో వెళ్ళాలి. అతను రైలు గురించి కూడా విన్నాడు కానీ ఎప్పుడు రైలు చూసి ఎరగడు.

రైలు ఎక్కాలంటే కొన్ని మైళ్ళు నడవాలి. రైలు ఎలా వుంటుంది? ఎలా ఎక్కాలి? మొదలయిన విషయాలు వూళ్ళో వాళ్ళనడిగాడు. వాళ్ళు టికెట్ తీసుకోవాలన్నారు. రైలు ఎలా వుంటుందని అడిగితే నల్లగావుంటుంది. పొగవదు లుతూ వుంటుంది అన్నారు.

చిల్లీ చాలాదూరం నడిచి రైలు స్టేషన్‌కు చేరాడు. స్టేషన్‌లో కౌంటర్ దగ్గరికి వెళ్ళి, టికెట్ కావాలి ఢిల్లీకి, అని అడిగాడు. కౌంటర్లో వ్యక్తి, ఐదురూపాయల ముప్పయిపైసలివ్వు అన్నాడు. మరీ అంత ఎక్కువగా అడగకు. పోనీ ఐదురూపా యలు తీసుకో అన్నాడు. కౌంటర్లో వ్యక్తి వీడెవడ్రా కూరగాయలు బేరమాడినట్లు అడుగుతున్నాడు. అనుకుని టిక్కెట్ల దగ్గర బేరాలుండవు అన్నాడు. అరే, ఎన్నోసార్లు వస్తూ వుంటాం, పోతూవుంటాం. ఆ మాత్రం తగ్గించకుంటే ఎలా? అన్నారు.

కౌంటర్లో వ్యక్తి, యిష్టముంటే తీసుకో. లేకుంటే వెళ్ళు, అని కసరుకున్నాడు. అరే! అంత కోపమెందుకయ్యా! అని ఐదురూపాయలిచ్చి టికెట్ తీసుకుని ప్లాట్‌ఫాం మీదకు వచ్చాడు.

ప్లాట్‌ఫాంలో టికెట్ కలెక్టర్ నల్లకోటు వేసుకుని పైపు పీలుస్తూ పొగవదుల్తున్నాడు. తను వూళ్ళో వ్యక్తి రైలును వర్ణించిన విధం గుర్తొచ్చింది. దయ్యంలా నల్లగా పొగవదుల్తూ వుంటుందని చెప్పడం గుర్తొచ్చింది. వెంటనే ఎగిరి టికెట్ కలెక్టర్ వీపులో కూచున్నాడు.

టికెట్ కలెక్టర్ భయపడిపోయి చిల్లీని వదిలించుకోవడానికి తంటాలు పడ్డాడు. చిల్లీ, అరె! టికెట్టు కొన్నానయ్యా అన్నాడు

అందరూ వచ్చి విడిపిస్తే రైలు గురించి తనువిన్న సంగతి చెప్పాడు. కాసేపటికి

వస్తుంది చూడు అని అందరూ సర్దిచెప్పారు. రైలువచ్చి స్టేషన్‌లో ఆగింది. చిల్లీ ఆశ్చర్యంగా చూసి పరిగెత్తుకుంటూ వెళ్ళి ఫస్ట్‌క్లాస్ కంపార్ట్ మెంట్‌లో ఎక్కాడు. కిటికీ దగ్గర సీట్లో కూచుని పరిగెడుతున్న పెట్టెలలాంటి రైలును, అద్దాల గుండా పరిగెత్తే చెట్లని, కొండల్ని, టెలిగ్రాపు స్థంభాల్ని చూస్తూ కళ్ళింతలు చేసుకుని కలా నిజమా అనుకున్నాడు.

హఠాత్తుగా టికెట్ కలెక్టర్ వచ్చి టికెట్ అడిగాడు చిల్లీ, నీకేమైనా పిచ్చా! నా టికెట్‌నీ నీకెందుకిస్తాను. ట్రెయిన్ ఎక్కక ముందే డబ్బుపెట్టి టికెట్ కొన్నాను అన్నాడు.

టికెట్ కలక్టర్, చూడు బాబూ! కొంతమంది టికెట్ లేకుండానే ప్రయాణిస్తారు. అట్లాంటి వాళ్ళ కోసం మేము టికెట్ చెక్ చేస్తాము. నువ్వు టికెట్ చూపించు, లేకుంటే జైల్లో వేస్తా, అన్నాడు.

జైలు, అన్న మాట విని చిల్లీ భయపడి టికెట్  చూపించాడు. టిసీ చూసి యిది ఫస్ట్‌కాస్ కంపార్ట్‌మెంట్ నీ టికెట్ థర్డ్‌క్లాసుది. ఎక్స్‌ట్రా డబ్బులు కట్టు అన్నాడు.

చిల్లీ, ఫస్ట్‌క్లాసుకీ, థర్డ్‌క్లాసుకి తేడా ఏమిటి? అన్నాడు టి.సి. థర్డ్‌క్లాసులో కుషన్ సీట్లుండవు అన్నాడు చిల్లీ కుషన్‌సీటు నించీ లేచి, సరే! నాకు ఈ సీటువద్దు అన్నాడు. చిల్లీని చూసి టిసి యితనెవరో అమాయకుడనుకుని నవ్వుతూ వెళ్ళాడు.

మొత్తానికి చివరికి చిల్లీ ఢిల్లీలో దిగాడు. అంత పెద్దనగరాన్ని చూసి ఆశ్చర్యపోయాడు. ఐనా ధైర్యం తెచ్చుకుని నగరంలో తిరిగాడు.

చాలా దూరం నడిచి చిల్లీకి దాహం వేసింది. ఒక వరండాలో కుండ వుండడం చూశాడు. అక్కడికి వెళితే అడగడానికి ఎవరూ లేరు. తనే కుండలో నీళ్ళు తీసుకుని తాగాడు. అంతలో యింట్లోంచి ఒక వ్యక్తి వచ్చాడు. ఎవరునువ్వు? ఏం చేస్తున్నావు? అన్నాడు.

చిల్లీ, నువ్వు గుడ్డివాడివా? మా పల్లెజనాలకన్నా మీరు బుర్ర లేని వాళ్ళలా వున్నారు. నీళ్ళు తాగడం కనిపించడం లేదా?

ఎవరూ లేనిది చూసి తప్పనిసరయి నీళ్ళు తాగుతున్నా అన్నాడు

అతను యితను అమాయకుడయిన గ్రామీణుడని తెలుసుకుని చిల్లీకి వుద్యోగమిచ్చాడు.

చిల్లీ తన యజమాని గుర్రపు బండి నడిపేవాడు.

ఒకరోజు యజమాని తన భార్యతో బాటు గుర్రబండిలో ప్రయాణి స్తున్నాడు చిల్లీ

బండి తోలుతున్నాడు. యజమానురాలి చేతిలో పర్సు జారిపోయింది. చిల్లీ అది చూసి కూడా బండి ఆపలేదు. యజమాని అది చూసి, ఆపు అన్నాడు. యజమాని దిగివెళ్ళి పర్సు తీసుకొచ్చాడు. పర్సుపడడం నువ్వు చూశావు కదా! ఎందుకాపలేదు! అన్నాడు. చిల్లీ మీరు ఆపమంటేనే ఆపుతాను. లేకుంటే ఆపను అన్నాడు.

యజమానురాలు నవ్వి, బండిదారిలో వెళ్ళేటప్పుడు ఏదయినా కిందపడిన వెంటనే తీసుకోవాలి అంది. చిల్లీ సరేనన్నాడు.

ఒకరోజు యజమాని స్నేహితుని యింటికి వెళ్ళాడు. చిల్లీ కొంతసేపటికి యజమాని దగ్గరకు వచ్చి ఒక బట్టల మూటపెట్టాడు. అందులో ఖరీదయిన దేమయినా వుందని యజమాని అనుకున్నాడు. చిల్లీ, మీరు బండి వెళ్ళేటప్పుడు కిందపడింది భద్రంగా తీసుకోమన్నారు కదా! అది యిదే! అన్నాడు.

యజమాని మూటవిప్పి చూస్తే. అది గుర్రంపేడ! ఏమిటిది? అన్నాడు యజమాని. మీరు దిగివెళ్ళాకా గుర్రంబండిని పక్కను తీసుకెళ్ళి ఆపుదామనుకుంటే యిది పేడకిందవేసింది, అన్నాడు. యజమాని చిల్లీ బుద్ధిహీనతకు నవ్వాలో ఏడవాలో తెలీక తలపట్టుకున్నాడు.

# 25 కానా భాయ్

ఒక గ్రామంలో యిద్దరు అన్నదమ్ములుండేవాళ్ళు పెద్దవాడు అందగాడు. చిన్నవాడు ఒంటికంటివాడు. పెద్దవాడికి చిన్నవాడంటే యిష్టం లేదు. పెద్దవాడు చిన్నవాణ్ణి యింట్లోంచీ తరిమేశాడు.

చిన్నవాడి పేరు కానాభాయ్. చిన్నవాడు పెళ్ళి చేసుకుందామనుకుంటే ఎవరూ అతన్ని పెళ్ళాడలేదు. చివరికి అతనికి భార్య దొరికింది. అదీ ఒంటి కన్నుదే.

అట్లా ఒంటికంటి సంసారం సాగుతూ వుంది. ఒకరోజు అతని భార్య పొలం వెళ్ళింది. ఎద్దును నాగలికి కట్టిపొలం దున్నుతోంది. ఆకాశంలో వెళుతున్న పార్వతీ పరమేశ్వరులు ఆ దృశ్యం చూశారు. పార్వతి, ఎవరితను భార్యతో పొలం దున్నిస్తున్నాడు! అనుకుంది.

వెంటనే పార్వతీ పరమేశ్వరులు ఆ పొలంలో దిగారు. అప్పుడే కానాభాయ్ పొలానికి వచ్చాడు. పరమేశ్వరుణ్ణి పార్వతిని చూపి దంపతులు నమస్కరించారు. వాళ్ళు పేదవాళ్ళని చేదోడువాదోడుగా వుంటారని గ్రహించిన పార్వతి భర్తతో, స్వామీ! మీ భిక్షాపాత్రలో ఏముంది అది వాళ్ళకు యివ్వండి అంది.

శివుడు తన భిక్షాపాత్రలో తడిమితే ఐదుగుమ్మడి గింజలు కనిపించాయి. అవి యిచ్చి వాళ్ళు అదృశ్యమయ్యారు. ఆ గింజల్ని నాలుగుదిక్కుల్లో పొలంలో నాటి పొలం మధ్యలో ఒకటి నాటారు కొన్నాళ్ళకు బుసబుసమని పొంగినట్లు గుమ్మడి తీగలు సాగి పొలంనిండుగా గుమ్మడి కాయలు కాచాయి. దంపతులు సంతోషంతో వాటిని యింట్లోకి చేర్చారు.

కానాభాయ్ ఒక గుమ్మడికాయను పగల గొడితే దాని నిండుగా బియ్యమున్నాయి. అన్ని గుమ్మడి కాయల్లో బియ్యం తీసి సంచులకు నింపి గదిలో పేర్చారు.

ఆ వార్త గ్రామమంతాపాకింది. అసూయతో వుడికిపోతున్న అతని అన్నకు కూడా అందింది. తమ్ముడి మీద కసిపెంచుకున్నాడు. పక్కగ్రామంలో ఏదో పెళ్ళికి వెళ్ళి వచ్చేసరికల్లా అతని అన్న యింటికి మంట పెట్టాడు. యిల్లంతా కాలి బూడిదయిపోయింది. దంపతులు ఏడ్చుకున్నారు. కానాభాయ్ బూడిదను సంచులకేసి భార్యతో నువ్వు పొలం దగ్గర వుండు. నేను వెళ్ళి ఈ బూడిదను అమ్ముకుని వస్తాను అన్నాడు.

తన ఒంటికంటి ఎద్దు మీద బూడిద మూటవేసుకుని నగరానికి వచ్చాడు. దగ్గరో వెళుతున్న ఒక సంపన్నుడయిన వ్యాపారస్తుణ్ణి చూశాడు. ఆ వ్యాపారి కొడుకు చిన్నవాడు. ఆడుతూపాడుతూ అలసిపోయాడు. తండ్రిని ఎత్తుకో మని మారాం చేస్తున్నాడు.

ఆ వ్యాపారి, బాబూ! నా కొడుకు అలసిపోయాడు. మాయింటి దాకా వాణ్ణి నీ ఎద్దుమీద కూచోబెట్టుకుని వచ్చావంటే ఎంతో కొంతయిస్తాను అన్నాడు. కానాభాయ్, నాకు మీరు ఏమీ యివ్వనక్కర్లేదు కానీ ఈ ఎద్దు పైన వున్న సంచిలో బంగారు నగలున్నాయి. మీ అబ్బాయి వాటిని మురికి చేస్తే అవి బూడిదగా మారే ప్రమాదముంది! అన్నాడు.

వ్యాపారి, సరే! అవి బూడిదగా మారితే వాటికి సమానమైన నగలు నీకిస్తాను సరేనా? అన్నాడు.

కానాభాయ్ ఆ కుర్రాణ్ణెత్తి మూటపై కూచోబెట్టాడు. వ్యాపారి యింటిదాకా వెళ్ళారు. కానాభాయ్ కుర్రాణ్ణి కిందకుదించాడు. అప్పుడు వ్యాపారితో 'అయ్యా! చూడు! మీ అబ్బాయి మురికిచెయ్యడం వల్ల నా నగలు బూడిదగా మారిపోయాయి, అన్నాడు.

ఆ వ్యాపారి గొప్ప సంపన్నుడు. ఏ మాత్రం సందేహించకుండా ఆ సంచి నిండుగా బంగారు నగలు నింపి యిచ్చాడు. కానాభాయ్ సంతోషంతో తనయింటికి వెళ్ళాడు.

కానాభాయ్ అంతు లేని సంపదతో అడుగుపెట్టాడని గ్రామమంతా తెలిసింది. అన్న పరిగెట్టుకుంటూ తమ్ముడి దగ్గరకు వచ్చి, తమ్ముడూ, యింత బంగారం నీకు ఎలా వచ్చింది? అన్నాడు.

కానాభాయ్, అరే! నీకు తెలీదా? యిక్కడకు దగ్గిరవున్న నగరంలో బూడిదకు సమానంగా బంగారం యిస్తారూ. మా యింటి బూడిద పట్టుకెళ్ళి దానికి సమానమయిన బంగారు నగలు తెచ్చుకున్నాను అన్నాడు

కానాభాయ్ అన్న యింటికి వెళ్ళి తన సొంతయింటిని తగలబెట్టాడు. బూడిద చేశాడు. దాన్నంతా సంచులకు నింపి నగరంలో సంతలో అమ్మడానికి బయల్దేరాడు. అందరూ అతనికి పిచ్చెక్కిందేమో అనుకున్నారు. నగరానికి వెళ్ళి నవ్వుల పాలయ్యాడు. తమ్ముడు తనని నిలువునా ముంచాడనుకున్నాడు.

అన్నకు తమ్ముడిమీద అంతులేని ఆగ్రహం కలిగింది. తమ్ముణ్ణి చంపడానికి పథకం వేశాడు. స్నేహితుల్ని పిలిచి తమ్ముణ్ణి చంపడానికి కుట్ర పన్నాడు. చీకట్లో తమ్ముడి యింట్లో జొరబడ్డారు. మంచం మీద పడుకున్న తమ్ముణ్ణి తాళ్ళతో మంచానికి కట్టేశారు. అన్న మిత్రులతో, యిలాగే తీసుకెళ్ళి నదిలో వదిలిరండి అన్నారు.

మనుషులు మంచాన్ని మోసుకెళుతున్నారు. నది యింకా దూరంగా వుంది. వాళ్ళకు ఆకలి వేసింది. మంచం అక్కడ మధ్యలో దించి ఏదయినా తిని వద్దామని వెళ్ళారు. ఆ దారంటా వెళుతున్న గొర్రెలకాపరి, ఏమయ్యా! ఎందుకు నిన్ను యిలా మంచానికి కట్టేశారు? అని కానాభాయ్‌ని అడిగాడు.

కానాభాయ్, మా బంధువులు నన్ను పెళ్ళి చేసుకోమని బలవంతం చేశారు. నాకు యిష్టంలేదు. అందుకని నాకు పెళ్ళి చేయడానికి మంచానికి కట్టి తీసుకుపోతున్నారు అన్నాడు.

గొర్రెలకాపారి, పిచ్చివాడిలా వున్నావే. పెళ్ళి చేసుకోమంటే ఎవరైనా వద్దంటారా? పెళ్ళి చేసుకోమని ఎవరయినా నన్నడిగితే ఈ క్షణమే నేను సిద్ధం, అన్నాడు.

కానాభాయ్, నన్ను తీసుకెళుతున్నవాళ్ళు నన్ను సరిగా గుర్తుపట్టరు నువ్వు నా బదులు మంచం ఎక్కు కట్టేస్తాను. తలకనిపించకుండా ముసుగేసుకో. నిన్ను తీసుకెళ్ళి పెళ్ళి చేస్తారు అన్నాడు.

గొర్రెల కాపరి సరేనన్నాడు. కానాభాయ్ కట్లు విప్పాడు కానాభాయ్ అతన్ని కట్టేసి తనదారంటా తను వెళ్ళాడు.

మంచం మోసే మనుషులు ఎక్కడో కొంత ఏదో తిని ఆకలి తీర్చుకుని వచ్చి మళ్ళీ మంచాన్ని పైకి ఎత్తి మోసుకుంటూ సాగారు. నది దగ్గరకు వెళ్ళారు. మంచాన్ని నదిలోకి విసిరి తమదారంటా తాము వెళ్ళారు.

గొర్రెల కాపరి వదిలిన గొర్రెలన్నిటినీ తోలుకుని కానాభాయ్ తనయింటికి వెళ్ళాడు.

అన్ని గొర్రెలతో ఆర్భాటంగా యింటికి వచ్చిన తమ్ముణ్ణి చూసి అన్న, అరే! యిన్ని గొర్రెలు నీకు ఎలా వచ్చాయి? అని అడిగాడు కానాభాయ్, అన్నా! మనుషుల్ని పెట్టి నువ్వు పొరపాటు చేశావు. వాళ్ళు నది అంచులో నన్ను వదిలారు. నది అంచులో వదిలినందుకే నాకు యిన్ని గొర్రెలు దొరికాయి. అదే నది మధ్యలో వదిలి వుంటే ఏనుగులు, గుర్రాలు, అంతులేని ఐశ్వర్యం అంది వుండేది అన్నాడు.

అత్యాశాపరుడయిన అన్న, తమ్ముడూ! నన్ను నది మధ్యలో వదిలి పుణ్యం కట్టుకో. రుణపడివుంటాను అని కాళ్ళావేళ్ళా పడ్డాడు. కానాభాయ్, సరే! నాతో బాటురా! అని దుర్మార్గుడయిన తన అన్నను వెంట బెట్టుకుని కాళ్ళూ చేతులు కట్టి నదిమధ్యలో వదిలిపెట్టి పీడ విరగడ చేసుకున్నాడు.

తరువాత ప్రశాంతంగా జీవితం గడిపాడు.

# 26 వెలుగు చిమ్మే రాణి

ఓధ్ ప్రాంతాన్ని పాలించే రాజు ఒకసారి వేటకువెళ్ళి దారి తప్పాడు. తనవాళ్ళు కనిపించలేదు. అలా అడవి గుండా వెళ్ళి ఒక పట్టణంలో అడుగు పెట్టాడు. చీకటిగా ఉండడంతో ఒక మైనపు ఒత్తి కోసం ఒక అంగడికి వెళ్ళాడు. షాపతను మైనపు ఒత్తి ఎందుకండీ అన్నాడు. అదేమిటి? దీపం వెలిగించడానికి అన్నాడు. షాపు వ్యాపారి ఈ పట్టణంలో దీపం అవసరం లేదు! అన్నాడు. రాజు ఎందుకనీ? అని అడిగాడు.

షాపుయజమాని ఈ రాజ్యాన్ని పాలించే రాజకుమార్తె చాలా అందగత్తె. ఆమె రాత్రికి ఇరవై ఒక్క బిందెల నీళ్ళతో స్నానం చేస్తుంది. తరువాత అంతఃపురంపై భాగం పై నిల్చుంటుంది. ఆమె శరీరం నించీ వెలువడే కాంతి పుంజులతో పట్టణమంతా వెలిగిపోతుంది అని.

ఆ మాటలు రాజుకు అపూర్వంగా, అద్భుతంగా అనిపించాయి. ఆ రాణిని చూడాలనిపించింది. ఆ వుద్దేశ్యంతో రాణి నివసించే భవనానికి వెళ్ళాడు.

కాసేపటికి రాణి ఇరవయ్యొవ బిందెల నీళ్ళతో స్నానం చేసి అంతఃపురంపై భాగానికి వెళ్ళింది. ఆమె శరీరకాంతితో పట్టణ మంతా ధగధగ లాడింది.

పెళ్ళాడితే యింత గొప్ప స్త్రీని పెళ్ళాడాలి అని రాజు అనుకుని ఒక చెలికత్తెతో ఓధ్ రాజ్యానికి రాజు మిమ్ముల్ని భార్యను చేసుకోవడానికి వచ్చాడు. అని మీ రాణితో చెప్పమన్నాడు.

రాజకుమారి తల్లి ఆమాటలు విని వచ్చి మా పట్టణంలో రెండు ఖాళీ బావులున్నాయి. వాటిలో నీళ్లు లేవు వాటిని మట్టితో నింపితే నీకు మా అమ్మాయి నిచ్చి పెళ్ళి చేస్తాను అంది.

రాజ యిదెంత పని అని మనుషుల్ని పెట్టి మట్టి తెప్పించి ఆ బావులలో నింపడం ప్రారంభించాడు. ఎన్నాళ్ళయిన అవి నిండలేదు. చివరకు రాజు దగ్గర పనివాళ్ళకు యివ్వడానికి కూడా డబ్బులేని పరిస్థితి ఏర్పడింది. రాజకుమారి అతని పరిస్థితి గమనించింది. అతని పట్ల జాలిపడింది. తన తల్లిని తెలియకుండా ఒక వుంగరాన్ని

పంపి దాన్ని రెండు ముక్కలు చేసి చెరోకటి ఒక్కో బావిలో వేస్తే అవి నిండుతాయి. అంది రాజు ఆమె చెప్పినట్టే చేశాడు.

బావులు నిండాయి. చెప్పిన మాటకు కట్టుబడి ఆమె తల్లిరాజకుమారితో రాజు వివాహం జరిపించింది. భార్యతో రాజు తన ఓఢ్ రాజ్యానికి బయల్దేరాడు. దారిలో ఆకలివేసింది. రాజకుమారి అందమైన రెండుకర్చీఫ్‌లను యిచ్చి వాటిని అమ్మతినడానికి ఏదైనా తీసుకురమ్మంది.

రాజు భార్యను ఒక బావిగట్టు మీద కూర్చోబెట్టి దగ్గరున్న సంతకు వెళ్ళి వ్యాపారస్తులతో బెరమాడాడు. వ్యాపారస్థుడొకడు రాజకుమారి బావి గట్టు మీదవుందని వార్త తెలుసుకుని రహస్యంగా మనిషిని పంపి రాజు భోజన సదుపాయం సిద్ధం చేశాడు. మిమ్ముల్ని తీసుకురమ్మన్నాడు. అని చెప్పించాడు. ఆమె ఏమీ సందేహించకుండా అతనితో వెళ్ళింది. వ్యాపారి మనుషులు ఆమెకు గదిలో బంధించారు.

రాణి కనిపించకపోయే సరికి రాజు కన్నీరుమున్నీరుగా విలపించాడు. రాణిని తలచుకుంటూ ఆ ప్రాంతంలో తిరుగుతూ వుంటే వ్యాపారి యింటి ముందుగా వెళుతూ వుంటే గదిలో బంధింపబడిన రాణి రాజు వ్యాపారాన్ని విన్నది. కిటికీలోంచీ చూసి రాజా! నన్ను యిక్కడ బంధించారు. ఒక తాడును విసిరావంటే దాన్ని పట్టుకుని వచ్చేస్తానంది.

రాజు ఖడ్గం దూసి ఆ ఇంట్లో ప్రవేశించి తలుపు బద్దలు చేసి రాణిని దగ్గరికి తీసుకున్నాడు.

అప్పుడే రాణికి కలవడానికి వస్తున్న వ్యాపారస్తున్ని చూసి ఒక్క వేటుతో అతని తల కిందపడేలా చేశాడు

రాజు రాణి గుర్రమెక్కి తమ నగరానికి వెళ్ళిపోయాడు.

# 27 రాయి దాస

ఒకప్పుడు గంగా తీరంలో ఒక పండితుడు వుండేవాడు. అతడు గొప్ప గంగానది భక్తుడు. ప్రతి నెలా గంగానదిలో పవిత్ర స్నానం చేసేవాడు. ఒక పండుగ పూట గంగానదిలో స్నానం చెయ్యడానికి వెళుతూవుంటే అతని చెప్పు తెగింది. గొప్పభక్తుడయిన రాయిదాస అన్న పేరుగల ఒక చర్మకారుడున్నాడు. పండితుడు అతనికి కుట్టడానికి పాదరక్షలిచ్చాడు. అతను కడుతూ వుంటే మీకు గంగానది పట్ల అంతగా భక్తి వున్నట్లు కనిపించలేదు. మీరు గంగను నమ్ముకుంటే ఈ దరిద్రం కష్టాలు, ఈ చెప్పులు కుట్టే పని వీటన్నిటి నించీ విముక్తి కలుగు తుంది కదా! అన్నాడు.

రాయిదాస చిరునవ్వు నవ్వి!స్వామీ! మనసు స్వచ్ఛంగా వుంటే గంగామాత అందులోకే వస్తుంది అన్నాడు. యింక గంగానదిలో స్నానం చేసినంత మాత్రాన మనం పవిత్రులమవుతామనడానికి లేదు అన్నాడు.

పాపం అజ్ఞాని అని రాయి దాస గురించి పండితుడు జాలిపడ్డాడు. పండితుడు వెళుతుంటే రాయిదాస రెండు తమలపాకులు యిచ్చి స్వామి వీటీని గంగా మాతకు అందించండి. అయితే ఆమె చేతులు చాచినపుడు మాత్రమే వీటిని అందివ్వండి అన్నాడు.

పండితుడు రాయిదాస అమాయకత్వానికి నవ్వుకున్నాడు. ఆ తమలపాకులు అందుకుని జేబులో పెట్టుకుని గంగాతీరానికీ వెళ్లాడు. స్నానంచేసి పూజా విధులు నిర్వహించి. మంత్రులు చదివి గంగామాతను స్తుతించిన అనంతరం యింటికీ వెళ్ళడానికి వెనుదిరిగాడు. అప్పుడు రాయిదాస యిచ్చిన తమలపాకులు గుర్తొచ్చాయి.

ఆ తమలపాకులు తీసి అమ్మా! గంగామాతా! రాయిదాస నీకు యివి యివ్వమన్నాడు అన్నాడు. వెంటనే పద్మాల్లా మెరిసిపోయే రెండు చేతులు నది నించి పైకి లేచాయి. ఆ చేతులకు మెరిసి పోయే వజ్రాలగాజులు కాంతులు చిమ్మాయి. పండితుడు ఆ చేతులు చూసి పరమాశ్చర్యం పొందాడు. లేత తమల పాకులు ఆ మృదువైన చేతుల్లో పెట్టాడు. గంగామాత వాటిని స్వీకరించి ఒక చేతికి వున్న వజ్రాల గాజును తీసిచ్చి దీన్ని నా భక్తుడయిన రాయిదాసకు యివ్వు అంది.

గంగామాత ఆ వజ్రాల గాజుని తన చేతుల్లో పెట్టినందుకు ఆనందించాడు. వెంటనే మనసులో దురాలోచన మెదిలింది.

నేను ఈ గాజు తీసుకెళ్ళి రాజుగారి కిచ్చి గంగామాత నుకు ఈ వజ్రాల గాజు యిచ్చింది. దీన్ని మీకు సమర్పిస్తున్నాను అని అంది. రాజు నాకు ఎన్నో బహుమతుల్ని సంపదల్ని యిచ్చి సత్కరిస్తాడు అనుకున్నాడు.

అట్లా రాయిదాసకు ఆ వజ్రాల గాజును యివ్వకుండా రాజుకు యిచ్చాడు. రాజు ఆ గాజును చూసి ఈ ఒంటిగాజు ఏమంత శోభస్కరం కాదు గంగామాతను అడిగి ఆ రెండో గాజును కూడా తెచ్చావంటే బావుంటుంది. నువ్వు ఆ పనిలో వుండు. నేను నది దగ్గరికొస్తాను అన్నారు.

ఆ మాటల్తో పండితుడు భయపడిపోయాడు. తప్పని సరయి గంగానది దగ్గరకు వెళ్ళి మంత్రాలు వల్లించాడు. ప్రార్థనలు చేశాడు. గగ్గోలు పెట్టాడు. గంగ కరుణించలేదు.

రాజు గంగానది దగ్గరకు వచ్చి ఆ దృశ్యాన్ని చూసి ఎంతో ఆగ్రహిం చాడు. నువ్వు అబద్ధాలకోరువి, మోసగాడివి. నీకు ఈ వజ్రాలగాజు ఎక్కడ నుంచి వచ్చిందో మర్యాదగా చెప్పకుంటే నీకు వురిశిక్ష తప్పదు అన్నాడు.

భయంకొద్దీ పండితుడు జరిగినదంతా చెప్పాడు.

రాజు పండితుణ్ని వెంట బెట్టుకుని రాయదాస దగ్గరకు వెళ్ళాడు. రాజు జరిగిందంతా రాయిదాసకు వివరించి నువ్వు వెళ్ళి గంగామాతకు యింకో వజ్రాల గాజుని అడుగు ఆమె నీకు యిస్తుంది. గంగానది దగ్గరకు నిన్ను తీసుకెళ్లడానికి నా వాహనం సిద్ధంగా వుంది అన్నాడు.

రాయిదాస రాజా! గంగామాత దగ్గరకు వెళ్లాల్సిన అవసరమేముంది? మనసు స్వచ్ఛంగా వుంటే గంగామాత ప్రశాంతంగా మనలోకే ప్రవహిస్తుంది. ఐనా మీరు పండితుణ్ని వదిలి పెడతానని హామీ యిచ్చిన పక్షంలో రెండో వజ్రాలగాజును తీసుకొస్తాను! అన్నాడు.

రాయిదాస గంగానది దగ్గరికి వెళ్ళకుండానే కళ్ళు మూసుకుని గంగా మాతను ధ్యానించాడు. గంగామాత పద్మాల్లాంటి హస్తాలు ప్రత్యక్షమైనాయి. వజ్రాల గాజునిచ్చింది. అతను దాన్ని రాజుకిచ్చాడు. సైనికులు! రాజు పండితుడు అందరూ రాయిదాస పాదాలకు ప్రణమిల్లారు.

# 28 అదృష్టవంతురాలైన రాజకుమారి

ఒక రాజుకు ఏడుగురు కూతుళ్ళు. ఒకరోజు రాజు తన ఏడుగురు కూతుళ్ళను పిలిచి దగ్గర కూచోబెట్టుకుని, ఎవరి అదృష్టం వల్ల మీరు మంచి భోజనం చెయ్యగలుగు తున్నారు? అని అడిగాడు

మొదటి ఆరుగురు అక్కాచెలెళ్ళు, నాన్నగారూ! మీ అదృష్టం వల్లే మేము మంచి ఆహారం తినగలుగుతున్నాం అన్నారు.

అందరికన్నా చిన్నదయిన ఏడవ రాకుమారి, నాన్నగారూ! నేను నా అదృష్టం వల్లే మంచి ఆహారం తినగలుగుతున్నాను అంది. ఆ మాటల్తో రాజు ఆగ్రహించాడు. ఆరుమంది వినయంగా సమాధానమిస్తే ఏడవ కూతురు అహంకారంతో బదులిచ్చిందని భావించాడు. సరే! అంతా నీ అదృష్టమంటున్నావు కదా! మంచిది. నిన్ను శవానికిచ్చి పెళ్ళి చేస్తాను. అప్పుడు నీకు మంచి అదృష్టం వుంటుంది అన్నాడు.

రాజు మొదటి ఆరుగురికి మంచి రాజకుమారులను చూసి పెళ్ళి చేశాడు. ఏడో కూతుర్ని వెంట బెట్టుకుని శవాన్ని అన్వేషించడంలో పడ్డాడు. ఒక అడవి గుండా వెళు తున్నారు. రాజుకు దాహం వేసింది. దగ్గర్లో ఒక యిల్లు కనపడింది. కూతురితో, వెళ్ళి ఆ యింట్లో వాళ్ళనడిగి కొన్ని నీళ్ళు తీసుకురా దాహంగా వుంది. నేను ఆ చెట్టు కింద కూచుంటాను అన్నాడు

రాజకుమారి ఆ యింటి తలుపులు తీసుకుని లోపలికి వెళ్ళిన వెంటనే ఆ తలుపులు ధడేల్మని మూసుకున్నాయి. రాజు కొంతసేపు చూసి కూతురు తిరిగి రాకపోయే సరికి ఆమె అదృష్టానికి ఆమెని వదిలి వెళ్ళిపోయాడు.

రాజకుమారి ఆ యింటిని కలయజూసింది. అది సాధారణమైన యిల్లు కాదు. పెద్ద రాజభవనం, అక్కడ అన్నీ నిత్యజీవితంలో పనికొచ్చే వస్తువులు వున్నాయి. కానీ ఒక్క మనిషీ లేదు. కింద గదులన్నీ తిరిగింది. మొదట అంతస్థులోకి వెళ్ళింది.

అక్కడి దృశ్యాన్ని చూసి దిగ్భ్రమ చెందింది. మంచం మీద ఒక రాజ కుమారుడు చనిపోయివున్నాడు. అతని శరీరమంతా సూదులు గుచ్చివున్నాయి, లెక్కలేనన్ని సూదులు. రాజకుమారి ఆలోచనలో పడింది. మా నాన్న చనిపోయిన వ్యక్తితో నాకు పెళ్ళి చేయాలనుకున్నాడు. అందుకనే నన్నీ యింట్లోకి పంపాడను కుంటాను అనుకుంది.

అందుకని ఆమె ఆ రాజకుమారి శవం ముందు కూచుని శరీరంలోవున్న సూదుల్ని ఒక్కటొక్కటిగా లాగడం ప్రారంభించింది.

ఆ పనిలో వుంటే బయట నించీ ఎవరో వ్యాపారస్థుడు, ఎవరికయినా పనిపిల్ల కావాలా? అని అరచుకుంటూ వెళ్ళడం విన్నది. తనకు ఎలాగూ తోడు అవసరమని భావించి తన ఒంటి మీది నగలిచ్చి పనిమనిషిని కొన్నది. రాజకుమారి రాజకుమారుడి శరీరంలోని సూదులు పీకుతూ వుంటే పనమ్మాయి కూచుని చూస్తూ వుండేది.

ఒకరోజు రాజకుమారి సూదులు లాగుతూ కూచుంది. చివరికి శవం శరీరంలో మూడు సూదులు మాత్రమే మిగిలాయి. ఆమె నేను స్నానం చేసివస్తానని పనిపిల్లతో చెప్పి వెళ్ళింది.

రాజకుమారి వచ్చేలోగా పనిపిల్ల శవం శరీరంలోని మూడు సూదులు లాగింది. అన్నీ లాగేసిన వెంటనే రాజకుమారుడికి ప్రాణం వచ్చింది. రాజకుమారుడు కళ్ళు నులుముకుని దిక్కులు చూసి, ఎవరు నువ్వు? అని పనిపిల్ల నడిగాడు. మోసగత్తె అయిన పనిపిల్ల, నేను రాజకుమారిని. నాతోబాటు యింకో పనిపిల్ల వుంది. స్నానానికి వెళ్ళింది అంది.

రాజకుమారి స్నానం చేసి వచ్చేసరికి పరిస్థితి యిలా తారుమారైంది. పనిపిల్ల రాణిలా అధికారం చెలాయించడం ఆరంభించింది.

ఒకరోజు రాజకుమారుడు ఏదో పని మీద నగరానికి వెళ్ళాల్సి వచ్చింది. నకిలీ రాజకుమారి తన తలలో అలంకరించుకోవడానికి ఒక పచ్చల పతకాన్ని తీసుకురమ్మంది.

రాజకుమారుడు నీకేం కావాలి? అని నిజమైన రాజకుమారిని అడిగాడు. నెమ్మదితనంతో ఆమె, నాకో చిన్ని బొమ్మ తీసుకురండి! అంది. రాజకుమారుడు ఆమెకు బొమ్మ తెచ్చిచ్చాడు. ఆమె ప్రతి రోజూ కన్నీళ్ళతో తన కథను బొమ్మతో చెప్పుకునేది.

ఒకరోజు ఈ సంగతి రాజకుమారుడి కంటపడింది. అతను నకిలీ రాజకుమారితో పనిపిల్ల బొమ్మతో ఏదో చెబుతోంది. వెళ్ళి చూద్దాం పదా. అన్నాడు.

నకిలీ రాజకుమారి, మీరు ఆమె గురించి ఎందుకు ఆందోళనపడతారు, ఆమె పిచ్చిది కాబట్టి బొమ్మతో మాట్లాడుతుంది అంది.

కానీ రాజకుమారుడికి ఏదో సందేహం కలిగింది. అతను అసలు రాజకుమారి దగ్గరకు వెళ్ళి నిలదీసి విషయం అడిగాడు.

అతను పదే పదే నిలదీసి అడిగేసరికి రాజకుమారి తన కథను చెప్పింది. రాజకుమారుడు ఆగ్రహంతో నకిలీ రాజకుమారిని అసలు విషయం అడిగాడు. ఆమె తన తప్పు ఒప్పుకుంది. రాజకుమారుడు రాజకుమారిని వైభవంగా పెళ్ళి చేసుకున్నాడు.

# 29 మామ

ఒకవూళ్ళో భార్యాభర్తలు కొడుకు ముగ్గురూ ఎంతో అన్యోన్యంగా వుండేవాళ్ళు. ఆనందంగా వుండేవాళ్ళు. ఒకసారి భార్యా భర్తల మధ్య గొడవైంది. భార్యా భర్తలు మాట్లాడుకోవడం మానేశారు. వేరువేరు గదుల్లో పడుకునేవాళ్ళు.

ఒక దూర ప్రాంతం నించీ ఒకవ్యక్తి ఆ గ్రామానికి వచ్చాడు ఆ రాత్రి ఆ గ్రామంలో బసచెయ్యాలనుకున్నాడు. అనుకోకుండా ఆ యింటికి వచ్చాడు. వరండాలో కూచున్నాడు.

ఆమె చూసి తన భర్త స్నేహితుడేమో అనుకున్నది. అపరిచితుడు యింటి యజమాని లేడా? అన్నాడు. ఆమె నాకు తెలీదు. ఆయన ఎక్కడికో వెళ్ళినట్లున్నాడు అంది.

అక్కడే ఉన్న కొడుకు అపరిచితుడితో నాన్న ఎక్కడికి వెళ్ళలేదు. అమ్మతో నాన్న అమ్మతో మాట్లాలేదు అన్నాడు.

కొంత సమయానికి కుర్రాడు అపరిచితుడితో నువ్వెవరు? అని అడిగాడు అపరిచితుడు కాసేపు ఆలోచించి 'మామా' వచ్చాడు అని తల్లితో అన్నాడు. ఆమె ఆలోచించింది. ఇతను మనకు మామ కాదు, నా కొడుక్కీ కాదు. బహుశా మా ఆయన మామ అనుకుంటాను అని మనసులో భావించింది. అతని కోసం మంచి వంటకాలతో భోజనం సిద్ధం చేసింది.

కాసేపటికి భర్త తిరిగి వచ్చాడు. వరండాలో కొత్త మనిషిని చూసి ఎవరితను? అని అడిగాడు కొడుకు మామ అన్నాడు. యింకా అమ్మ కూడా మామే అంది అన్నాడు.

భర్తకు చిత్రంగా అనిపించింది. ఇతను నా మామకాదు, నా కొడుకు మామ కాదు. ఇతను తప్పకుండా నా భార్య మామే అనుకున్నాడు. అపరిచితుడ్ని గౌరవించాడు. మోసగాడయిన అపరిచితుడు నోరు మెదపకుండా వ్యవహారం నడిపాడు.

అపరిచితుడు తృప్తిగా భోంచేశాడు. నిద్రకు సిద్ధమయ్యాడు. భార్య భర్తల మధ్య మాటలు లేనందుకు భగవంతుడికీ కృతజ్ఞతలు చెప్పుకున్నాడు.

పొద్దున్నే భర్త గదిలోకి వెళ్ళి చూస్తే పడక మీద అపరిచితుడే లేడు కొడుకుని పిలిచి? మీ అమ్మనడుగు ఆమె మామ ఎక్కడికి వెళ్ళాడో అన్నాడు.

భార్య ఆ మాటలు విని నువ్వు నాతో పోట్లాడదలచుకుంటే సూటిగా అడగచ్చుకదా! అతను మా మామ కాదు, నీ మామె అంది.

అరే అతను మీ మామ అనుకున్నాను! అన్నాడు భర్త.

వాళ్ళ సంభాషణ విని కొడుకు నవ్వాడు!దాంతో భర్త నవ్వాడు భార్య నవ్వింది.

భర్త అపరిచితుణ్ని వెతకడానికి బయల్దేరబోయాడు. భార్య వారించి ఆగండి ఏది ఏమయినా అతిథి అతిథే. అతన్ని మన కోసం దేవుడే పంపాడు. అతను రాకుంటే మనిద్దరం మాట్లాడుకునే వాళ్ళం కాదు కదా! అంది. భర్త ఆ సంఘటనలను తలచుకుని ఎప్పుడూ నవ్వేవాడు